Prajalakshyam Telugu Daily
# ప్రజాలక్ష్యం
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 16 | సంచిక: 350 | కరీంనగర్ | ఆదివారం 10 మే 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## బండి తనయుడు భగీరథ్‌పై ఫోక్సో కేసు

**- మైనార్ బాలికపై అత్యాచారం జరిపినట్లు ఫిర్యాదు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 9 : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, తెలంగాణ భారతీయ జనతా పార్టీ కీలక నేత బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయినట్లు సమాచారం. ఒక 17 ఏళ్ల బాలికకు బలవంతంగా మద్యం తాగించి, హైదరాబాద్‌లోని మొయినాబాద్ ఫామ్‌హౌస్‌తో పాటు మరికొన్ని ప్రాంతాల్లో ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ వేధింపుల కారణంగా బాధితురాలు రెండుసార్లుఆత్మహత్యకు

11 లో

## కేరళంపై కాంగ్రెస్ మల్లగుల్లాలు

**- సిఎం ఎవరనేదానిపై తేల్చుకోలేని పార్టీ**

**- నేడు స్పష్టత వచ్చే అవకాశం ఉందన్న పార్టీ నేతలు**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 9 : తమిళనాట ముఖ్య మంత్రి పదవిపై ఏర్పడిన సందిగ్ధత వీడడంతో ఇప్పుడు అందరి దృష్టి పొరుగు రాష్ట్రం కేరళపై పడింది. ఫలితాలు వెలువడి ఐదు రోజులు గడుస్తున్నా.. సీఎం ఎవరనే దానిపై ఇంకా స్పష్టతరాలేదు. సీఎం ఎంపికపై దిల్లీలో కాంగ్రెస్

11 లో

### ఎట్టకేలకు తమిళనాడు

# ఉత్కంఠకు తెర

- తమిళనాడు కొత్త సిఎంగా విజయ్
- విజయ్‌ను నియమిస్తూ గవర్నర్ ఉత్తర్వులు
- నేడు పది గంటలకు సిఎంగా విజయ్ ప్రమాణం
- మద్దతు లేఖలు సమర్పణ..గంటన్నరకు పైగా చర్చలు
- గవరనర్ లేఖతో బయటకు వచ్చిన టివికె అధినేత
- 13లోగా మెజార్టీ నిరూపించుకోవాలని గవర్నర్ సూచన
- ప్రభుత్వానికి బయటనుంచి మద్దతుకు చిన్న పార్టీల నిర్ణయం



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

చెన్నై, మే 9 : తమిళనాడు రాజకీయాల్లో అనిశ్చితి వీడింది. సిఎంగా జోసెఫ్ విజయ్ నియమితులయ్యారు. దీంతో ఆయన నేడు ఉదయం పదిగంటలకు తమిళనాడు సిఎంగా ప్రమాణం చేయనున్నారు. నెహ్రూ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. గత నాలుగు రోజుల ఉత్కంఠకు తెరదించుతూ శనివారం గవర్నర్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ ప్రకటన చేశారు. అంతకుముందు విజయ్ తన అనుచరులతో కసలి గవర్నర్ను కలిసి చర్చించారు. తనకు మద్దతు ఇస్తున్న పార్టీల లేఖలను అందించారు. దీంతో సంతృప్తి చెందిన గవర్నర్ జోసెఫ్ విజయ్‌ను సిఎంగా

11 లో

## నేడు ప్రధాని మోడీ రాక

**నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధింపు**



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

హైదరాబాద్, మే 9 : భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం భాగ్యనగర పర్యటనకు రానున్నారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభలో మోదీ పాల్గొని ప్రసంగించ నున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో అటు పోలీసులు, ఇటు ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశాయి. ప్రధాని మోదీ ఆదివారం మధ్యాహ్నం 2:50 నిమిషాలకు ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా సభ జరిగే పరేడ్ గ్రౌండ్స్‌కు బయలుదేరుతారు. ప్రధాని పర్యటనను దృష్టిలో ఉంచుకుని పోలీసులు అత్యంత కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. పరేడ్ గ్రౌండ్స్ పరిసరాల్లో మూడంచెల భద్రతా వలయాన్ని నిర్మించారు. సుమారు 2,000 మందికి పైగా పోలీసులతో పాటు, ప్రత్యేక రక్షణ బృందాలు, స్నైపర్లు, మఫ్టీ పోలీసులు, క్విక్ రెస్పాన్స్ టీమ్స్ రంగంలోకి దిగాయి. ప్రధాని పర్యటన, బహిరంగ సభ కారణంగా సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ఈ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. ముఖ్యంగా బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి పరేడ్ గ్రౌండ్స్ వరకు వెళ్లే ప్రధాన రహదారులతో పాటూ సికింద్రాబాద్ పరిసరాల్లో వాహనాల రాకపోకలను నియంత్రించనున్నారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు



### పట్టణ జనాభాకు

# అనుగుణంగా వసతులు

**- సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్ అభివృద్ధి**

**- రోడ్ల విస్తరణతో పాటు మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్**

**- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సిఎం రేవంత్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 9 : ఆధునీకరణ, పట్టణీకరణతో భవిష్యత్తులో మరిన్ని కొత్త సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దే ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామన్నారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. అండర్ పాస్, సర్ఫేస్, ఎలివేటెడ్ అనే త్రీ లెవెల్ విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించు కున్నామని చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణకు కేవలం రోడ్ల విస్తరణ మాత్రమే సరిపోదని.. మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయాల్సిన

11 లో

## రైతులంటే పట్టింపులేని సిఎం రేవంత్

**- అకాల వర్షాలతో నష్టపోయినా చర్యలు లేవు**

**- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సిద్దిపేట, మే 9 : అకాల వర్షాల వల్ల రైతులు చాలా నష్టపోతున్నారని.. కానీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తోందని మాజీ మంత్రి హరీశ్ మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి రైతులపై పట్టింపు లేదని.. మూడు పంటలకు రైతుబంధు కూడా ఇవ్వలేదని హరీశ్ విమర్శించారు. ఢిల్లీకి లేఖలు రాయడం మాని, వెంటనే పండిన పంటను కొనుగోలు చేయాలని సూచించారు. శనివారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం అల్లిపూర్ సొసైటీ వద్ద పొద్దు తిరుగుడు, వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మాజీ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు బాధపడుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్క రివ్యూ మీటింగ్ కూడా పెట్టలేదని విమర్శించారు. ఆనాడు కేసీఆర్ ప్రభుత్వం కోతల సీజన్ వచ్చినప్పుడల్లా రివ్యూ మీటింగ్‌లు పెట్టి రైతుల అవసరాలన్నీ తీర్చేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం సీఎంతో పాటు మంత్రులు కూడా రివ్యూ చేసిన పాపాన పోలేదని మండిపడ్డారు. వడ్లు, పొద్దు

11 లో

## నేడు ప్రధాని బహిరంగ సభ

**- డ్రోన్లు, కెమెరాలు, బ్యాగులపై నిషేధం**

**- 2 వేల మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు**

**- మల్కాజిగిరి డిసిపి సుమతి వెల్లడి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే9 : హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభకు నగర యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. ఈ సభకు సంబంధించి భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై మల్కాజిగిరి డిసిపి సుమతి కీలక వివరాలను వెల్లడించారు. సభను ప్రశాంతంగా నిర్వహించేందుకు సుమారు 2,000 మంది పోలీసులతో భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.

11 లో

### బెంగాల్ ప్రజలకు మోడీ

# సాష్టాంగ ప్రణామం

**అశేషంగా హాజరైన ప్రజలకు అభివాదం**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

కోల్‌కతా, మే 9 :పశ్చిమ బెంగాల్ నూతన ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోదీ ప్రజలకు సాష్టాంగ వందనం చేశారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవానికి

11 లో

# బెంగాల్ సిఎంగా సువేందు

**- ఆయనతోపాటు ఐదుగురు మంత్రుల ప్రమాణం - ప్రమాణం చేయించి గవర్నర్‌ఆర్ఎన్ రవి - హాజరైన ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు - చంద్రబాబు సహా పలు రాష్ట్రాల సిఎంలు హాజరు**





(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

కోల్‌కతా, మే 9 : పశ్చిమ బెంగాల్‌లో మొట్టమొదటిసారి కమలదళ సర్కారు కొలువుదీరింది. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా భాజపా నేత సువేందు అధికారి శనివారం ప్రమాణస్వీకారం చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో సువేందు చేత బెంగాల్ గవర్నర్ ఆర్.ఎన్.రవి ప్రమాణం చేయించారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరింది. రాష్ట్ర 9వ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేశారు. అగ్నిమిత్ర పాల్, దిలీప్ ఘోష్, అశోక్ కిర్తానియా, నిశిత్ ప్రామాణిక్, క్షుదిరామ్ టుడు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రులు జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, యోగి ఆదిత్యనాథ్, రేఖా గుప్తా, భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్

11 లో

## 11వ తేదీ నుండి విద్యా వారోత్సవాలు

**జిల్లా కాలెక్టర్లతో సిఎస్ వీడియో కాన్ఫరెన్స్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 9 : 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 11 వ తేదీ నుండి నిర్వహించేంచే విద్యాశాఖ వారోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. విద్యా వారోత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్లతో సిఎస్ మాట్లాడుతూ ఈ నెల 11 న ఎల్ బి స్టేడియం లో నిర్వహించనున్న విద్యావారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు బారి సంఖ్యలో హాజరయ్యేలా కలెక్టర్లు చొరవతీసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టే వారోత్సవాలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను , రోజువారీ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్లకు విద్యాశాఖ

11 లో

## తుమ్మిడిహట్టిపై ప్రధానిని ఒప్పించండి

**కాంగ్రెస్ ప్రభుత్వానికి జీవన్ రెడ్డి సవాల్**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 9 : తుమ్మిడిహట్టి బ్యారేజీ పూర్తి చేసి ప్రాణహిత జలాలను ఎల్లంపల్లికి మళ్లించాకే.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్లు అడగాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి పేర్కొన్నారు. తుమ్మిడిహట్ట ఇపేరుతో కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. రెండున్నరేళ్లయినా తట్టెడు మట్టి కూడా ఎత్తకేండా ఇప్పుడు హడావిడి చేస్తున్నారని ఆరోపించారు. మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డును ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావుతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వరి, మక్కల కొనుగోళ్లు, తరలింపులో జాప్యంపై మండిపడ్డారు. ప్రధాన మంత్రి మోదీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది 'బడే బాయ్ చోటే బాయ్' బంధమని, హైదరాబాద్‌కు రానున్న ప్రధానికి తుమ్మిడిహట్టిపై విన్నవించి అంగీకారం తీసుకు వస్తే పాలాభిషేకం చేస్తామన్నారు. పగుళ్లు వచ్చిన మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లకు కాంట్రాక్టర్ మరమ్మతులు చేస్తానన్నా ప్రభుత్వం ఎందుకు అంగీకరించడం లేదని ప్రశ్నించారు.

## కాళేశ్వరంను తక్కువ చేసే యత్నం

**- అధికారంలో ఉండగా ప్రాణహిత కోసం చేసిందేమీ లేదు**

**- కెసిఆర్ ముందుచూపుతోనే కాళేశ్వరం నిర్మాణం**

**- బిఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సిద్దిపేట, మే 9 : కటిక చీకట్లోనూ కారుదీపం లాంటిది కాళేశ్వరం అని హరీశ్‌రావు తెలిపారు. ఎంత కరవు వచ్చినా నదిలో నీళ్లు ప్రవహించే సత్తా మేడిగడ్డకు ఉందని పేర్కొన్నారు. కేసీఆర్ ముందుచూపుతో ఆలోచించి కాళేశ్వరం నిర్మాణం చేపట్టారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును తక్కువ చేసి మాట్లాడితే తెలంగాణకు ద్రోహం చేసినట్లే అవుతుందని

11 లో

## బిజెపి దాడికి నిరసనగా బంద్

**బిఆర్ఎస్ పిలుపుతో స్వచ్ఛందంగా మద్దతు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కరీంనగర్, మే 9 : ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై బీజేపీ దాడిని నిరసిస్తూ బీఆర్ఎస్ ఇచ్చిన బంద్ కొనసాగుతోంది. నగరంలోని వ్యాపార, వాణిజ్య సంఘాలు స్వచ్ఛందంగా బంద్‌ను

11 లో

## రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి

**- సిఎం చేతిలో హోం ఉన్నా సమీక్షలు లేవు**

**- చట్టం ఎవరికైనా ఒక్కటిగానే ఉండాలి**

**- బండి భగీరథ్ కేసు నేపథ్యంలో సబిత వ్యాఖ్యలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 9 : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు నమోదైనట్లు వార్తలు వచ్చిన విషయంపై మాజీహోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పందించారు. 17 సంవత్సరాల బాలికకు బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ ఆల్కహాల్ తాగించి అత్యాచారం చేయించడంతో పేట్‌బషీరాబాద్‌లో కేసు నమోదైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి సబితారెడ్డి మాట్లాడుతూ.. ఒకప్పుడు తెలంగాణ పోలీస్ అంటే దేశంలో మొదటి

11 లో





# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

**- మూడు నెలల్లోనే దరఖాస్తుల పరిష్కారానికి కార్యాచరణ**
**- మే నెలాఖరు నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు**
**- తిరుమలాయపాలెం ప్రజా దర్బార్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

ప్రజాలక్ష్యం ప్రత్యేక ప్రతినిధి)

ఖమ్మం, మే 9 : :ప్రజా దర్బార్‌లో స్వీకరించే ప్రతి దరఖాస్తును మూడు నెలల కాలపరిమితిలోపు పరిష్కరించేలా ప్రభుత్వం పక్కా కార్యాచరణ రూపొందించిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శనివారం తిరుమలాయపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గంలోని ప్రతి మండలాన్ని మూడు సమూహాలుగా విభజించి ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటివరకు నిర్వహించిన కార్యక్రమాల్లో 14,700 దరఖాస్తులు స్వీకరించామని, వాటిలో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు, భూ సమస్యలు, పింఛన్లు, ఉచిత విద్యుత్‌కు సంబంధించినవేనని పేర్కొన్నారు. తక్షణ పరిష్కారం సాధ్యమైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామని, మిగిలిన వాటిని మూడు నెలల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

**మే నెలాఖరు నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు:**

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని మంత్రి గుర్తు చేశారు. గృహ నిర్మాణ పురోగతికి అనుగుణంగా లబ్ధిదారులైన మహిళల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేస్తూ పారదర్శక విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. మే నెలాఖరు నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ ప్రారంభమవుతుందని వెల్లడించారు.

**ధరణి సమస్యల పరిష్కారానికే 'భూ భారతి':**

గత ప్రభుత్వ హయాంలో ధరణి విధానంలో జరిగిన తప్పిదాల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి విమర్శించారు. ఒకే సర్వే సంఖ్యలో కొంత భూమి సేకరణ జరిగినా మొత్తం భూమిని నిషేధిత జాబితాలో చేర్చిన ఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు. అలాంటి సమస్యల పరిష్కారానికే 'భూ భారతి' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామని చెప్పారు. సాదా బైనామా దరఖాస్తులను పేదలకు న్యాయం జరిగేలా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**ధాన్యం కొనుగోళ్లపై రైతులకు భరోసా:**

రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని మంత్రి భరోసా ఇచ్చారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 ప్రోత్సాహకం అందిస్తున్నామని తెలిపారు. వరితో పాటు మొక్కజొన్నను కూడా పూర్తిస్థాయిలో సేకరిస్తామని చెప్పారు. రైతును ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇప్పటికే రూ.2 లక్షల లోపు రైతు రుణమాఫీ అమలు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు హరినాథ్ బాబు, ఆత్మ కమిటీ అధ్యక్షుడు, జిల్లా స్థాయి అధికారులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు సమర్థవంతంగా కొనుగోలు జరపాలి

**జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ వాసుదేవరావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ములుగు, మే 9 : రబీ 2025-26 సీజన్ లో ములుగు జిల్లాలో ప్రారంభించిన 149 వరి ధాన్య కొనుగోలు కేంద్రాల నిర్వహణలో పిఎసిఎస్,ఐకెపి,జిసిసి,ఎఫ్ పి ఓ నిర్వాహకులు సమర్ధవంతంగా కొనుగోలు జరపాలని బోర్కడే హేమంత్ సహదేవరావు సూచించారు.శనివారం రబీ 2025-26 ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో పొంచి ఉన్న అకాల వర్షాల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల ఆవశ్యకతను పునరుద్ఘాటిస్తూ, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ తరగతుల లో వివరించిన విధంగా అకాల వర్షాల నుండి ధాన్యాన్ని కాపాడుకోవడానికి సరైన పద్ధతిలో టార్పాలిన్స్ కప్పడంలో నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ధాన్య సేకరణ ప్రక్రియ నిర్వహించుట జరుపాలని, ధాన్యాన్ని తూర్పారాబట్టి ప్యాడి క్లీనర్ ఉపయోగించి ఎఫ్ ఏ క్యూ ఆధారంగా వ్యవసాయ శాఖ అధికారుల నుండి టోకెన్ పొందిన తర్వాతనే కాంటాలు నిర్వహించాలని, లారీలలో లోడ్ చేసి మిల్లులకు పంపాలని ఈ విషయంలో ఎలాంటి అలసత్వం వహించకూడదని, ఏ విధమైన అలసత్వం వహించినను సంబంధిత సెంటర్ నిర్వాహకులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోబడునని సూచించారు.ధాన్య సేకరణలో సమస్యలు ఎదురవుతే పరిష్కారంకై ములుగు కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో కంట్రోల్ రూం (9347416178) ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జీ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సయ్యద్ షా ఫైసల్ హుస్సైని, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల కార్పోరేషన్ ఎస్ కృష్ణవేణి, డీఆర్డీఏ పిడి చంద్రశేఖర్, డిప్యూటి తాహసిల్దార్ సివిల్ సప్లైస్ విజయ్ కుమార్, సంబంధిత శాఖల అధికారరులు పాల్గొన్నారు.

# గంజాయి బ్యాచ్ పట్టివేత

**- భారీగా గంజాయి ప్యాకెట్లు స్వాధీనం - ఇద్దరు అంతరాష్ట్ర ముఠా సభ్యుల అరెస్ట్**
**- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




నల్లగొండ, మే 9 : గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్టు చేసి వారి నుండి 104.5 కేజీల గంజాయి, ఒక లారీ, రెండు సెల్ ఫోన్లను నల్లగొండ పోలీసులు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. మరో ముగ్గురు ప్రధాన నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగిస్తున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. శనివారం ఉదయం విజయవాడ నుండి హైదరాబాద్‌కు భారీ మొత్తంలో గంజాయి తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం రావడంతో కేతేపల్లి ఎస్ఐ సతీష్ పోలీసు సిబ్బంది, క్లూస్ టీమ్‌తో కలిసి కొర్లపహాడ్ టోల్ ప్లాజా సమీపంలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గ్రీన్ కలర్ అశోక్ లేలాండ్ లారీని ఆపి తనిఖీ చేయబోతుండగా లారీలో ఉన్న ఇద్దరు వ్యక్తులు వాహనం దిగి పారిపోవడానికి ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని సోదాలు జరుపగా గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయన్నారు. నిందితులను జమ్ముకాశ్మీర్‌కు చెందిన పరంవిర్ సింగ్ అలంబుగా, మహారాష్ట్రకు చెందిన షా ఆలం పర్వేష్ ఆలం అన్సారిగా గుర్తించినట్లు తెలిపారు. అంతర్ రాష్ట్ర మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌పై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, నకిరేకల్ సీఐ హరిబాబు, కేతేపల్లి ఎస్ఐ సతీష్, పోలీస్ సిబ్బంది బి.వెంకటేశ్వర్లు, బి.వెంకట కృష్ణ, స్వామి, వెంకన్న, బాసిత్లను ఎస్పీ అభినందించారు. ఇదిలావుంటే నల్లగొండ జిల్లా కేంద్రంలో గంజాయి అమ్మకాలు చేస్తున్న ముఠాను అరెస్టు చేసి వారి నుండి 300 గ్రాముల గంజాయి, రెండు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు స్వాదీనం చేసుకున్నారు. వారిని రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి తెలిపారు. శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శనివారం ఉదయం హైదరాబాద్ రోడ్‌లోని హౌజింగ్ బోర్డు కాలనీ వద్ద గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం వచ్చినట్లు తెలిపారు. టూటౌన్ ఎస్ఐ యర్రా సైదులు తన సిబ్బంది బాలకోటి, షకీల్‌తో కలిసి పర్యటిస్తున్న క్రమంలో నలుగురు వ్యక్తులు రెండు బైకులపై అక్కడ అనుమానాస్పదంగా నిలబడి ఉండడంతో వారిని విచారించేందుకు ప్రయత్నించగా పారిపోవడానికి యత్నించారన్నారు. వెంటనే అప్రమత్తమై వారిని చేదించి ముగ్గురిని అదుపులోకి తీసుకోగా, మరో వ్యక్తి పరారైనట్లు తెలిపారు.వారిని విచారణ చేయగా హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన మహమ్మద్ అబ్దుల్ నయీమ్ అ ముజీబ్, మహమ్మద్ సోహెల్, షేక్ లతీఫ్ గా గుర్తించినట్లు చెప్పారు. పారిపోయిన వ్యక్తి రవీంద్రనగర్ కు చెందిన రౌడీషీటర్ బంటు-కార్తీక్‌గా తెలిసిందన్నారు. వారిని సోదా చేయగా వారి వద్ద 300 గ్రాముల గంజాయి లభించినట్లు వెల్లడించారు. పరారీలోన్న బంటు కార్తీక్ ఇతర ప్రాంతాల నుండి గంజాయిని కొనుగోలు చేసి వీరికి సరఫరా చేస్తున్నట్లు తెలిసిందన్నారు. నిందితులు స్వయంగా గంజాయి సేవించడమే కాకుండా, చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ఒక్కో ప్యాకెట్ ను రూ.500లకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. పరారీలోన్న బంటు కార్తీక్ పై గతంలో అనేక క్రిమినల్ కేసులు నమోదై కాగా టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అతనిపై రౌడీషీట్ కూడా ఉందని, మహమ్మద్ అబ్దుల్ నయీమ్ పై గతంలో హైదరాబాద్ మంగళహాట్ పోలీస్ స్టేషన్ లో ఆర్మ్స్ యాక్ట్ కింద కేసు నమోదై ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ సమావేశంలో ఎస్ఐ వై.సైదులు, సిబ్బంది ఎల్.బాలకోటి, ఎండీ.షకీల్, మహేష్, వీరాంజనేయుల పాల్గొన్నారు.

# లేగదూడను రక్షించే క్రమంలో తెగింపు

**బావిలో పడిప్రాణాలు కోల్పోయిన తండ్రీ కొడుకులు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, మే 9 : ప్రమాదవశాత్తు బావిలో పడ్డ లేగదూడను రక్షించే క్రమంలో తండ్రీ కొడుకులిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదకర ఘటన ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం కర్లపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. తండ్రీకొడుకులైన రస్పుత్ రాజు, పవన్‌లు కర్లపల్లి గ్రామంలోని సుమారు 35 అడుగుల లోతైన బావిలో లేగదూడ పడిపోవడంతో దానిని కాపాడేందుకు ఆ బావిలోకి దిగారు. అయితే ఇద్దరూ ఒకే తాడుతో బావిలోకి దిగే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో తాడు ఒక్కసారిగా తెగిపోవడంతో ఇద్దరు బావిలో పడిపోయి నీటిలో చిక్కుకున్నారు. గోవిందరావుపేట సీఐ దయాకర్, ఎస్సై తాజుద్దీనులు ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన రస్పుత్ రాజు మృతదేహాన్ని బయటకు తీశారు. పవన్ మృతదేహం కోసం గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు కొనసాగిస్తున్నారు. తండ్రీకొడుకులు గొప్ప మనుసుతో ఓ మూగజీవిని రక్షించాలనుకుని ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# క్లాస్‌లో డెమో ఇస్తూ కుప్పకూలిన టీచర్

**గెండెపోటుతో మృతి చెందినట్లు గుర్తింపు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 9 : జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. క్లాస్ రూమ్ లో డెమో ఇస్తూ గుండెపోటుతో కుప్పకూలాడు ఓ ఉపాధ్యాయుడు. శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. ఖమ్మం జిల్లా మధిరలో చోటు చేసుకుంది ఈ విషాద ఘటన. జిల్లాలోని మధిర పట్టణం రెండోవార్డు ఎంఎ÷-లాయిన్ కాలనీకి చెందిన ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు గారపాటి జయరాజ్ ఖమ్మంలోని మమతా రోడ్ లో ఉన్న శ్రీ చైతన్య ఒలంపియాడ్ స్కూల్ లో వర్క్ షాప్ కి హాజరయ్యాడు. వర్క్ షాప్ లో భాగంగా క్లాస్ రూమ్ లో డెమో ఇస్తుండగా గుండెపోటుతో కుప్పకూలాడు జయరాజ్. డెమో ఇస్తున్న జయరాజ్ ఒక్కసారిగా కుప్పకూలడంతో అతనిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు సహా ఉపాధ్యాయులు. అయితే.. అప్పటికే జయరాజ్ మరణించినట్లు తెలిపారు డాక్టర్లు. జయరాజ్ డెమో ఇస్తూ కుప్పకూలిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. జయరాజ్ మరణంతో అతని కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. అప్పటిదాకా హుషారుగా పాఠం చెబుతున్న జయరాజ్ ఒక్కసారిగా కుప్పకూలడం జీర్ణించుకోలేక పోతున్నామని అంటున్నారు తోటి ఉపాధ్యాయులు. ఈ ఘటనతో మధిర పట్టణంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# నిజామాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిజామాబాద్, మే 9 : నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రంలో తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ఓ ఇసుక లారీ.. ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 15 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు ఘటనపై విచారణ చేస్తున్నారు.

# సింగరేణికి స్వర్ణయుగం దిశగా అడుగులు

**-9 కొత్త గనులతో బొగ్గు ఉత్పత్తికి భారీ ప్రణాళిక - రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చొరవతో వేగంగా అనుమతుల ప్రక్రియ.**
**- ఈ ఏడాది 3, వచ్చే ఏడాది మరో 2 కొత్త గనుల ప్రారంభానికి చర్యలు. - రాష్ట్ర ఇంధన అవసరాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కొనసాగింపునకు నిర్ణయం**

ప్రజాలక్ష్యం ప్రత్యేక ప్రతినిధి)




హైదరాబాద్, మే 9 : సింగరేణి సంస్థకు ఉజ్వల భవిష్యత్తు అందించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో దూరదృష్టితో కొత్త గనుల ఏర్పాటుకు ముమ్మర సన్నాహాలు చేస్తోంది. బొగ్గు నిల్వలు అయిపోగా మూతపడుతున్న గనుల ఉత్పత్తిని భర్తీ చేయడానికి, అక్కడ పనిచేసే కార్మికులకు ఉపాధిని కొనసాగించడానికి, పెరుగుతున్న రాష్ట్ర ఇంధన అవసరాలు తీర్చడానికి కొత్త గనులను ప్రారంభించాలని, దీనికి సంబంధించిన సన్నాహాలు, అనుమతుల ప్రక్రియలు వేగవంతం చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించింది. దీనిపై సింగరేణి యాజమాన్యం తక్షణమే స్పందించి సింగరేణి ప్రాంతంలో 9 ప్రాజెక్టులు చేపట్టడానికి ప్రణాళిక రూపొందించి, కేంద్ర బొగ్గు, అటవీ, పర్యావరణ శాఖల అనుమతికి ప్రతిపాదనలు సమర్పించింది. ఈ ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,ఇంధన శాఖామాత్యులు భట్టి విక్రమార్క మల్లులు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ముఖ్యంగా భట్టి విక్రమార్క మల్లు ఇప్పటికే రెండుసార్లు దేశ రాజధానికి వెళ్లి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి కొత్తగనులకు అనుమతులను వెంటనే మంజూరు చేయాలని, రాష్ట్ర ఇంధన అవసరాల రీత్యా కొత్త గనుల ఆవశ్యకత ఉందని వివరించారు. భట్టి విక్రమార్క మల్లు చొరవతో ఇప్పటికే 3 గనులకు అనుమతులు రాగా. వీటిలో ఒడిశా లోని నైనీ బ్లాకును ఒడిశా రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించారు. దాదాపు దశాబ్ద కాలంగా పెండింగ్ లో ఉన్న ఈ ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వ చొరవతో గత ఏడాది కార్యరూపం దాల్చింది. అలాగే కొత్తగూడెంలో వీకే కోల్ మైన్ కూడా దాదాపు అన్ని అనుమతులను పూర్తి చేసుకుని బొగ్గు ఉత్పత్తికి సిద్ధమైంది. 2027-28 నాటికి సింగరేణిలో నాలుగు గనులు మూతపడుతుండగా. ఏడాదికి 12.51 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోనుంది. అయితే కొత్తగా ప్రారంభించనున్న ఐదు ప్రాజెక్టుల వల్ల ఈ లోటును భర్తీ చేసుకునే అవకాశం ఏర్పడుతుంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశంతో సింగరేణి సంస్థ రూపొందించిన 9 కొత్త ప్రాజెక్టుల ద్వారా సింగరేణి సంస్థ మరో 20 సంవత్సరాలకు పైగా ఉత్పత్తి తగ్గకుండా రాష్ట్ర ఇంధన అవసరాలు తీర్చే అవకాశం ఏర్పడుతుంది. సింగరేణి ప్రాంతంలో ఇప్పటికే బొగ్గు తవ్వకాలు పూర్తి చేసుకొని మూతబడిన భూగర్భ గనుల లోతుల్లో ఇంకా మిగిలి ఉన్న బొగ్గు ఖనిజాన్ని వెలికి తీయడానికి ఈ ప్రాజెక్టులను చేపట్టారు. అలాగే ప్రస్తుతం నడుస్తున్న ఓపెన్ కాస్ట్ గనులకు కొనసాగింపుగా కూడా కొన్ని ప్రాజెక్టులు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో సింగరేణి సంస్థ రూపకల్పన చేసిన కొత్త ప్రాజెక్టుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కొత్తగూడెం ఏరియాలో బొగ్గు తవ్వకాలు పూర్తిచేసిన భూగర్భ గనుల నుండి 190 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు గల వీకే కోల్ మైన్ ప్రధానమైనదిగా పేర్కొనవచ్చు. ఈ గనికి సంబంధించి ఇప్పటికే దాదాపు అన్ని అనుమతులు రాగా ఓవర్ బర్డెన్ తొలగింపు ప్రక్రియ ప్రారంభమైంది, త్వరలో బొగ్గు ఉత్పత్తి ప్రారంభించనున్నారు. కాగా సింగరేణిలో జేకే ఓపెన్ కాస్ట్ గని (ఇల్లందు ఏరియా) 19.68 మిలియన్ టన్నులు, రామగుండం ఓసీ-1 విస్తరణ ప్రాజెక్టు (రామగుండం-3 ఏరియా) 181.60 మిలియన్ టన్నులు, గోలేటి ఓపెన్ కాస్ట్ (బెల్లంపల్లి ఏరియా) 38.98 మిలియన్ టన్నులు, ఎం.వి.కె ఓపెన్ కాస్ట్ 30.34 మిలియన్ టన్నులు, మణుగూరు ఓపెన్ కాస్ట్ ఎక్స్ టెన్షన్ (మణుగూరు ఏరియా) 40.45 మిలియన్ టన్నులు, ఆర్.కె.పి ఓసీపీ ఫేజ్-2 (మందమర్రి ఏరియా) 34.42 మిలియన్ టన్నులు, పీకే కోల్ మైన్, కొండాపూర్ (మణుగూరు ఏరియా) 62 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణిలో కొత్త గనులను వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు వీలుగా ఆయా శాఖ అధికారులతో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి శనివారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా ఈ ఏడాది 3 గనుల నుంచి ఉత్పత్తి సాధించాలని, దీని కోసం ఇంకా మిగిలి ఉన్న అనుమతులను వెంటనే పొందేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు, తిరుమల రావు, ఈడీ (కోల్ మూవ్‌మెంట్) బి.వెంకన్న, అడ్వైజరు (ఫారెస్ట్రీ) మోహన్ పరిగెన్, జీఎం(కో ఆర్డినేషన్, మార్కెటింగ్) టి. శ్రీనివాస్, జీఎం సీపీపీ ఎ.మనోహర్, కొత్తగూడెం నుంచి జీఎం (పీపీ) జి. దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కోమటిపల్లి రైల్వే సొరంగ మార్గం

**నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వరంగల్, మే 9 : కాజీపేట రైల్వే సబ్ డివిజన్ పరిధిలోని మూడో లైన్, కోమటిపల్లి భూగర్భ రైల్వే సొరంగ మార్గాన్ని ప్రధాని నరేంద్రమోదీ హైదబాదాద్ నుంచి వర్చువల్‌గా ఆదివారం ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తర దక్షిణ భారతానికి ముఖ ద్వారమైన కాజీపేట రైల్వే జంక్షన్ సమీపంలోని కోమటిపల్లి వద్ద రైలు ట్రాఫిక్‌కు చెక్ పెట్టేందుకు రైల్వే శాఖ భూగర్భ సొరంగం మార్గం నిర్మించారు. దీంతోపాటు సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలోని కాజీపేట-బలార్షా, కాజీపేట- విజయవాడ సెక్షన్‌లో రైళ్ల రద్దీకి అనుగుణంగా 421 కిలో మీటర్ల మూడో లైన్‌ను ఏర్పాటు చేశారు. గ్రాంట్ ట్రంక్ రూట్‌లో ఢిల్లీ-సికింద్రాబాద్, విజయవాడ సెక్షన్‌లో రైళ్ల రద్దీని తగ్గించేందుకు రైల్వేశాఖ దాదాపు 12 ఏళ్ల కాలంలో దాదాపు రూ.4015 కోట్ల వ్యయంతో నిర్మాణం చేసింది. ఈ రెండు ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించి జాతికి అంకితం చేస్తారని రైల్వే అధికారులు వెల్లడించారు.

# భూముల ధరల పెంపు నిర్ణయం

**రిజిస్ట్రేషన్లకు భారీగా డిమాండ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 9 : భూముల ధరల సవరణ నిర్ణయంతో తెలంగాణలో రిజిస్ట్రేషన్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. స్థిరాస్తుల మార్కెట్ విలువ పెంచేందుకు కసరత్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో విలువలు పెరగకముందే రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు ప్రజలు చొరవ చూపుతున్నారు. ఈ నెల 12 నుంచి 15 వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అదనంగా పని చేయనున్నాయి. ఆయా రోజుల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు పనివేళలుగా ప్రభుత్వం నిర్ణయించింది. రిజిస్ట్రేషన్లకు వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. చంపాపేట్, సరూర్‌నగర్, వనస్థలిపురం, గండిపేట్, మహేశ్వరం, ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్, రంగారెడ్డి రూరల్, ఎల్బీ నగర్, శేరిలింగంపల్లి, సంగారెడ్డి, ఘట్‌కేసర్, నల్గొండ ఆర్వో, పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్ కార్యాలయాల్లో అదనపు పనివేళలు ఉంటాయని ప్రభుత్వం తెలిపింది. అవసరమైతే మరింత సమయం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

# స్వీయ గణనపై ప్రజల్లో చైతన్యం కోసం 2కె మారథాన్

**- జనగణన స్వీయ గణన అవకాశం సద్వినియోగం చేసుకోండి**
**- డిప్యూటీ కమీషనర్ నాయిని వెంకట స్వామి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 09 : జన గణనలో ఎవరి కుటుంబ వివరాలు వారే స్వంతంగా నమోదు చేసుకోవడానికి కల్పించిన స్వీయ గణన సౌలభ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని రామగుండం నగరపాలకసంస్థ డిప్యూటీ కమీషనర్ నాయిని వెంకట స్వామి సూచించారు. జన గణన స్వీయ గణనపై అవగాహన కల్పించడానికై శనివారం నిర్వహించిన 2 కె మారథాన్ ను రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం సాయంత్రంతో స్వీయ గణన చేసుకోవడానికి గడువు ముగిసిపోతున్నశీదున ఎక్కువ మందికి అవగాహన కల్పించడానికి విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రచార కార్యక్రమాల్లో భాగంగానే జిల్లా అదనపు కలెక్టర్, రామగుండం నగరపాలక సంస్థ కమీషనర్ అరుణశ్రీ ఆదేశాల మేరకు 2 కె మారథాన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్యూమరేటర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, మెప్మా సిబ్బంది, ఆర్పిలు పాల్గొన్న ఈ మారథాన్ రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయం నుండి గోదావరిఖని చౌరస్తా వరకు కొనసాగిశీది. ఈ సందర్భంగా చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు జన గణనపై అవగాహన కల్పించే పాటలు పాడి అలరించారు. అనంతరం నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్ మామిడాల శ్రీహరి స్వీయ గణన చేసుకోవడంపై అవగాహన కల్పించారు. జన గణన ప్రక్రియ రెండు దశలలో సాగుతుందన్నారు. స్వీయ గణన ప్రక్రియ మే 10న ముగుస్తుందని అన్నారు. ఆన్ లైన్ వెబ్ సైట్ లింక్ హ్ట్ట్ప్స్://సె.సెన్సుస్.గొవ్.ఇన్/ తెరిచి స్మార్ట్ ఫోన్, కంప్యూటర్ లో సులువుగా వివరాలు నమోదు చేసుకోవచ్చన్నారు. మే 11న మొదటి దశ జనగణన ప్రారంభం అవుతుందని అన్నారు. ఎన్యూమరేటర్ కు పూర్తి వివరాలు అందించి సహకరించాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ సెక్రెటరీ మహేశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ చింతల ఆంజనేయులు, పబ్బాల శ్రీనివాస్, అకౌంటెంట్ రవి తేజ, ఎన్యూమరేటర్ ప్రతినిధులు అంజన్ కుమార్, స్వరూప్ చంద్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్, మెప్మా టిఎంసి మౌనిక, సిఓ లు, తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**- ధాన్యం అన్ లోడింగ్‌ను రెట్టింపు వేగంతో పూర్తి చేయాలి**
**- రైస్ మిల్లుల్లో హమాలీల సంఖ్యను పెంచాలని**
**- ట్యాబ్ ఎంట్రీలు 100 శాతం పూర్తి చేసి రైతులకు త్వరితగతిన చెల్లింపులు చేయాలి**
**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**
**- వర్షాల నేపథ్యంలో ధాన్యం రక్షణకు అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, మే 09 : జిల్లాలో ధాన్యం అన్ లోడింగ్‌ను రెట్టింపు వేగంతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ శ్రీహర్ష సమీకృత కలెక్టరేట్ సమీపంలోని అన్నపూర్ణ రైస్ మిల్, పెద్ద కల్వల వద్ద ఉన్న రాధాకృష్ణ రైస్ మిల్, సుల్తానాబాద్ మండలంలోని కదంబాపూర్ గ్రామ సాయి తేజ రైస్ మిల్, పూసాల గ్రామంలోని కళ్యాణి రైస్ మిల్, కాట్నపల్లి గ్రామంలోని గౌరీనాథ్ రైస్ మిల్, మమతా రైస్ మిల్, సదాలక్ష్మి రైస్ మిల్, లక్ష్మీ గణపతి రైస్ మిల్, పూసాల గ్రామంలోని పరమేశ్వర రైస్ మిల్లులను సందర్శించి ధాన్యం అన్‌లోడింగ్, నిల్వలు, ట్యాబ్ ఎంట్రీలు, ట్రక్ షీట్ల జనరేషన్ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైస్ మిల్లుల వద్ద హమాలీల సంఖ్యను వెంటనే పెంచి అన్‌లోడింగ్ ప్రక్రియను రెట్టింపు వేగంతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుండి నాణ్యమైన ధాన్యాన్ని మాత్రమే రైస్ మిల్లులకు తరలిస్తున్న నేపథ్యంలో మిల్లుల వద్ద ఎటువంటి ధాన్యం కోతలు విధించరాదని స్పష్టం చేశారు. ట్రక్ షీట్లు వెంటనే జనరేట్ చేయాలని, ట్యాబ్ ఎంట్రీలు 100 శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు సంబంధించిన చెల్లింపులు త్వరితగతిన వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోయే ఏడు రోజులలో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ధాన్యం తడవకుండా అన్ని రైస్ మిల్లులు, కొనుగోలు కేంద్రాల్లో ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. గన్నీ బ్యాగులు, టార్పాలిన్ కవర్లు సరిపడా నిల్వ ఉంచాలని, అవసరమైన రవాణా వాహనాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఈ తనిఖీలలో జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి శ్రీనాథ్, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్ నిర్వాహకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 2వ వార్డు అభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించండి

**- రాష్ట్ర ముఖ్యమంత్రికి మెమోరాండం అందించిన వార్డు కౌన్సిలర్ వాణిశ్రీ మధుసూదన్ యాదవ్**
**- 110 కోట్లతో వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న సీఎంకు ధన్యవాదాలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వికారాబాద్, మే 09 : 2వ వార్డుకు నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని వార్డు కౌన్సిలర్ వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు. ఈ మేరకు శుక్రవారం కోడంగల్‌లోని వెంకటేశ్వర స్వామి పునర్నిర్మాణ శంకుస్థాపనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రెండో వార్డ్ కౌన్సిలర్ వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ పలు సమస్యలతో కూడిన వినతి పత్రని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందించారు. కొడంగల్ పట్టణంలోని పురాతనమైన 'గడిబావి శివాలయం' ప్రస్తుతం శిథిలావస్థకు చేరిందని, ఆలయ పునరుద్ధరణతో పాటు, ముందున్న గుండం (పవిత్ర కోనేరు) బాగు చేయాల్సిన అవసరం ఉందన్నారు, చకలోని బావి 6 బావుల సమాహారం కూడా శిథిలావస్థలో ఉం దన్నారు. శివరాత్రి సమయంలో, మాలధారణ చేసే శివస్వాములతో సహా చాలా మంది భక్తులు ఈ ఆలయాన్ని సందర్శిస్తారని, పూజారి నివాసం, అన్నదానాల కోసం వంటగదితో కూడిన పెద్ద భోజనశాల, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి సుమారు రూ. 5.00 కోట్ల నిధులు మంజూరు చేయలన్నారు.బండల ఎల్లమ్మ బండ ఎల్లమ్మ ఆలయం నుండి తెలంగాణవాడి, కేజీబీవీ పాఠశాల మీదుగా గౌరారం రోడ్డు వరకు కొత్తగా నిర్మిస్తున్న రోడ్డుకు, సెంట్రల్ లైటింగ్ రూ. 1.00 కోటి అంచనాతో నిధులు మంజూరు చేయలన్నారు. బండ ఎల్లమ్మ ఆలయం, అయ్యప్ప స్వామి ఆలయాల పరిసరాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, లైటింగ్, తాగునీటి సౌకర్యం, కాంపౌండ్ వాల్స్ , పార్కుల అభివృద్ధికి సుమారు రూ. 2.00 కోట్ల నిధులు మంజూరు చేయలని కోరారు. కొడంగల్ పట్టణంలో సుమారు 35 శాతం జనాభా యాదవ సామాజిక వర్గానికి చెందినవారు ఉన్నారని ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నలుగురు యాదవ కౌన్సిలర్లు ఎన్నికయ్యారని జనాభా ఎక్కువ ఉన్నప్పటికీ, సరైన సౌకర్యాల లేమి వల్ల ఈ వర్గం వెనుకబడి ఉందని, యాదవ సామాజిక వర్గం కోసం ఒక కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలన్నారు, 133 కేవి సబ్-స్టేషన్ వెనుక భాగంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేటాయించి, రూ. 2.00 కోట్లు మంజూరు చేయలని కోరారు. ముదిరాజ్ కమ్యూనిటీ స్మశానవాటికను ఆక్రమణల నుండి రక్షించడానికి, కాంపౌండ్ వాల్ నిర్మించి, స్మశానవాటిక లోపల నీటి సౌకర్యం, మరుగుదొడ్లు, లైటింగ్, షెడ్ ఏర్పాటుకు రూ. 2.00 కోట్లు మంజూరు చేసి అభివృద్ధి చేయాలన్నారు. సి.సి. రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, అంగన్‌వాడీ భవనాలు, సి.సి. కెమెరాలు, ఐమాక్స్ లైటింగ్ పనుల కోసం రూ. 11 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. చాలా మంది పేదరికం కారణంగా ఒకే గదిలో ఇబ్బంది పడుతున్నారని, ఈ వార్డు కోసం ప్రత్యేకంగా 100 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని విన్నవించారు.పార్కు ,శివాలయం , అయ్యప్ప స్వామి దేవాలయాల మధ్య ఉన్న 'వేద సిటీ' వంటి వెంచర్లలోని 10 శాతం ఖాళీ స్థలాన్ని పార్కు కోసం కేటాయించాలన్నారు. ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, ప్లే గ్రౌండ్ వంటి సౌకర్యాల కోసం రూ. 1 కోటి మంజూరు చేయాలని అభ్యర్థించారు.కొడంగల్‌లోని నిరుద్యోగ యువత కోసం స్థానికంగా ఏదైనా పరిశ్రమను ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని కోరారు. వినాయక చౌక్ నుండి కుమ్మరి వాడి వరకు ప్రతిపాదించిన 60 అడుగుల రోడ్డు విస్తరణ వల్ల పేదల ఇళ్లు దెబ్బతింటాయని, వారికి రెట్టింపు నష్టపరిహారం ఇవ్వాలని లేదా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని విస్తరణ పరిమితిని తగ్గించాలని పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందిస్తూ ఇచ్చిన సమస్యలకు నిధులు కేటాయించి వార్డు అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# ముగిసిన 'సూపర్ సమ్మర్' క్యాంప్

**ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా ఏఐ విద్యకు సన్నాహాలు**






(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 09 : ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాల పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించిన 'సూపర్ సమ్మర్-కంప్యూటర్, ఏఐ అండ్ రోబోటిక్స్ సమ్మర్ క్యాంప్' విజయవంతంగా ముగిసింది. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మార్గదర్శకత్వంలో, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రోత్సాహంతో జిల్లా వ్యాప్తంగా నాలుగు కేంద్రాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 350 మంది విద్యార్థులు శిక్షణ పొందారు. టి-ఫైబర్ తన టి-నెక్స్ట్ సేవల ద్వారా, సూపర్ టీచర్ ఎడ్యూ రిఫార్మ్స్ భాగస్వామ్యంతో జిల్లా యంత్రాంగ సహకారంతో ఈ శిక్షణ నిర్వహించింది. అడవి శ్రీరాంపూర్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ తొలి గ్రామీణ ఏఐ ల్యాబ్‌లో విద్యార్థులకు పెర్ప్లెక్సిటీ, గూగుల్ జెమినీ వంటి ఆధునిక ఏఐ టూల్స్‌పై అవగాహన కల్పించారు. పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం కావడంతో 2026-27 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా ఏఐ ఆధారిత విద్య ప్రవేశపెట్టే అవకాశాలను పరిశీలిస్తున్నారు. కాగా రామగుండం కేంద్రంలో కంప్యూటర్ ప్రాథమికాలు, టైపింగ్, డ్రాయింగ్, ప్రెజెంటేషన్లు, యానిమేషన్లు, ఏఐ వినియోగాలు, రోబోటిక్స్ మోడల్స్ తయారీపై ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు రూపొందించిన 'మూన్ ల్యాండర్' సహా వినూత్న ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ముగింపు సందర్భంగా ప్రాజెక్టుల ప్రదర్శనతో పాటు సర్టిఫికెట్లు పంపిణీ చేసారు. జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థి బృందాల మధ్య ఈనెల 26న పెద్దపల్లి కలెక్టరేట్‌లో పోటీలు నిర్వహించనున్నారు. టి-ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్ పన్నేరు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి జె.ఎస్.రాహుల్ ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. శిక్షణ బృందంలో ధీరజ్, రమ్య, రామస్వామి, మనోజ్, దినేష్ పాల్గొన్నారు. విద్యాశాఖ నుంచి రామగుండం ఎంఈవో మల్లేశం, డీఆర్‌పీ రవీందర్ రెడ్డి, సీఆర్‌పీ శ్రీలత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంబాబు సహకారం అందించారు.

# వరి కొనుగోలు కేంద్రాల్లో ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలి

**జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 09 : మంచిర్యాల (హాజీపూర్), మే 9 : మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండల పరిధిలోని పర్దనపల్లి, కర్ణమామిడి గ్రామాల వరి కొనుగోలు కేంద్రాలలో వడదెబ్బ నివారణపై జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హాజీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పర్దనపల్లి గ్రామపంచాయతీలో సర్పంచ్ దొండ ఏసయ్యతో కలిసి మహిళా సంఘాలు, రైతులు, కార్మికులకు వడదెబ్బ లక్షణాలు,నివారణ చర్యలు, ఓఆర్ఎస్ వినియోగంపై వివరించారు. ఈ సందర్భంగా పర్దనపల్లి, కర్ణమామిడి గ్రామాల ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి అక్కడ పనిచేస్తున్న కార్మికులు, రైతులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయడం జరిగింది. అనంతరం బుక్క వెంకటేశ్వర్లు మాట్లాడుతూ. మండుటెండలు,అధిక ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బ,డీహైడ్రేషన్ వంటి సమస్యలు ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. వేసవికాలంలో ప్రజలు ఎక్కువగా నీరు,కొబ్బరి నీరు,ఇతర ద్రవపదార్థాలు తీసుకోవాలని, రోజుకు కనీసం 15 గ్లాసుల నీరు తాగాలని సూచించారు. తేలికపాటి కాటన్ దుస్తులు ధరించడం,మధ్యాహ్న వేళల్లో బయట తిరగకుండా ఉండడం,బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ ఉపయోగించాలని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు, మధుమేహం వంటి అసంక్రమణ వ్యాధులతో బాధపడేవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడ ప్రాంతానికి తరలించి, చల్లని నీటితో శరీరాన్ని తుడవడం, ఉప్పు కలిపిన మజ్జిగ,గ్లూకోజ్ ద్రావణం ఇవ్వడం, అందుబాటులో ఉంటే వెంటనే ఓఆర్ఎస్ తాగించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాజీపూర్ పీహెచ్‌సీ సిబ్బంది రఘుపతి, ఐకేపీ సిబ్బంది శ్రీనివాస్,సీసీ రాజమణి,ఆశ కార్యకర్తలు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# నేడు ప్రధాని మోదీ సభను విజయవంతం చేయండి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 09 : నేడు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో జరప తలపెట్టిన ప్రధాని నరేంద్ర మోడీ భారీ బహిరంగ సభను విజయ వంతం చేయాలని పాపన్నపేట మండల పార్టీ అధ్యక్షుడు వడ్లసంతోష్ చారి తెలిపారు. శనివారం రోజు మండల పరిధిలోని చిత్రియాల చౌరస్తా లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ బిజెపి రాష్ట్ర శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని, రాష్ట్రం నలుమూలల నుండి లక్షలాదిగా కార్యకర్తలు తరలి వస్తున్న వేల పాపన్నపేట మండలం నుండి మహిళలు, పెద్దలు యువకులు మోడీ అభిమానులు మోడీ సందేశాన్ని వినాలని సభను విజయవంతం చేయాల్సిందిగా ఆయన పార్టీ మండల నాయకులు విజ్ఞప్తి చేశారు. మధ్యాహ్నం 12.00 గంటలకు మండలంలోని అన్ని గ్రామాల నుండి బస్సులు బయలు దేరుతాయని సాయంత్రం 04.00 గం.కు మోడీ సందేశం ఉంటుందన్నారు. ఈ కార్యక్ర మంలో ప్రధాన కార్యదర్శి

# శిశు విక్రయాలు జరిపితే ఎంతటి వారైన ఊరుకునేది లేదు

**ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, మే 09 : నవ మాసాలు మోసి బిడ్డకు జన్మనిచ్చిన తల్లులకు విషాదం నింపే విధంగా ఆసుపత్రి సిబ్బంది వ్యవహరిస్తే ఏ పార్టీ వారైనా ఎవరైనా ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. మెదక్ పట్టణంలో ఓ మహిళ ఆడబిడ్డకు జన్మనివ్వగా చనిపోయింది అంటూ ప్రైవేట్ ఆస్పత్రికి సిబ్బంది ఆడ శిశువును ఇతరులకు అమ్ముకున్న ఘటనపై ఎమ్మెల్యే రోహిత్ తీవ్రంగా ఖండించారు. ఇప్పటికే బాధ్యులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి ఘటనలు జరిగితే ఏ పార్టీ వారైన ఎంతటి అధికారులు తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించి ఇలాంటి ఘటనలు పునరావృతం రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మానవత్వం మంటగలిగే విధంగా వ్యవహరించిన ఆసుపత్రికి సిబ్బంది ప్రవర్తించిన తీరు నాకెంతో బాధ కలిగించిందన్నారు. నవ మాసాలు మోసిన ఆకన్నతల్లి సంతోషం లేకుండా కన్నీళ్లు మిగిల్చిన వారిని వదిలిపెట్టకుండా కఠినంగా శిక్షించాలని ఆయన అధికారులకు ఆదేశించారు. ఈఘటనకు పాల్పడిన బాధ్యులు ఎవరైనా వారిని కఠినంగా శిక్షించాలన్నారు.



# జిల్లాలో స్వీయ గణన మారథాన్ రన్ నిర్వహణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మే 09 : జనాభా గణన కార్యక్రమంలో భాగముగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని రైల్వే స్టేషన్ సెంటర్ నుండి బస్టాండ్ వరకు స్వీయ గణన మారథాన్ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్, అదనపు జనగణన అధికారి అనిల్ కుమార్ హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా తమ స్వీయ గణన వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు స్వీయ గణన పై అవగహన పరచడానికి శుక్రవారం నుండి ప్రచార రథన్ని కలెక్టర్ ప్రారంభించరని అన్నారు,ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు స్వీయ గణన ప్రారంభించి నిర్వహించడం జరుగుతుందని ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారన్నార. మే 11 నుండి జూన్ 9 వరకు ఇండ్ల గణన, ఇండ్ల సందర్శన జనగణన సిబ్బంది హాజరుకానున్నారని, ఆ కార్యక్రమంలో తమ వివరాలన్నీ నమోదు చేసుకోవాలని సూచించారు. దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ఈ జన గణన కార్యక్రమంలో పాల్గొని వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు,డిపిఓ హరిప్రసాద్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వరరావు, సెన్సెస్ సిబ్బంది వినయ్, ఉద్యోగులు అశోక్, రాము, వెంకటేశ్వర్లు,తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు, స్వయం సహాయక బృందాల సభ్యులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



# మొక్కజొన్న కొనుగోలు వారంలో పూర్తి చేయండి

**- రైతులకు నష్టం జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు**
**- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మే 09 : మహబూబాబాద్ జిల్లా పర్యటనలో భాగముగా జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ శుక్రవారం ఇనుగుర్తి మండలం చిన్న తండా సమీపంలోని మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ ఉన్న రైతులతో మాట్లాడి కొనుగోలు కేంద్రంలో ఉన్న సౌకర్యాలు, కొనుగోలు జరుగుతున్న క్రమాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ మాట్లాడుతు రైతులు పండించినా మొక్కజొన్న ను కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి నెల నెల పదిహేను రోజులు అవుతున్నదని, రైతులు వేరే పని చేయకుండా వాటికీ కాపలాగా ఉంటున్నారని, తిండి తిప్పలు లేకుండా అక్కడే పడుకుంటున్నారని అన్నారు. వాతావరణం బాగాలేదు అకాల వార్షాలు గత వారం రోజులుగా వస్తున్నాయి, ఆ వానలో తమ పంట తడిసిందని,ఇన్నిరోజులు పడ్డ కష్టనికి ప్రతిఫలం లేకుండా ఉందని, పెట్టిన పెట్టుబడి వచ్చేలా లేదని రైతులు చెబుతుంటే చాలా బాధగా ఉందన్నారు. అసలు ప్రభుత్వం ఏం చేస్తుంది,అధికారులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. మార్కెటుకు సంబందించిన అధికారికి ఫోన్ చేస్తే కూడా స్పందనలేదు అని ఇక్కడే ఆదికారుల పనితానం అర్థం అవుతున్నదని అన్నారు. ఆ అధికారి జవాబు చెప్పాలని అగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ముందే మొక్కజొన్న పంట వేయవద్దని చెప్పి ఉంటే వారు ఆ పంటను వేయకుండా ఉండేవారని, కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచకుండా రైతులకు ఇబ్బంధి పెడుతున్న అగ్రికల్చర్ అధికారులు జిల్లాలో,రాష్ట్రము లో ఉండడం చాలా బాధాకరం అని అన్నారు. వారం రోజుల్లో రైతుల వద్ద ఉన్న మొక్కజొన్న ను పూర్తిగా కోనేవిధముగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ప్రజాలక్ష్యం
సంపాదకీయం

# తమిళనాట భేతాళ ప్రశ్నలు ?

తమిళనాట ప్రతిష్ఠంభనకు చిన్న పార్టీలు ఆడుతున్న పెద్ద డ్రామాలు కలుషిత రాజకీయాలకు పరాకాష్టగా చూడాలి. లెఫ్ట్ పార్టీలు, ముస్లిం పార్టీ సహా ఇతర చిన్న పార్టీలు ఒకటి అరా సీటు సంపాదించినా బేరాలాడుతున్న తీరు వల్ల తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటుకు ఆటంకాలు వస్తున్నాయి. ఈ క్రమంలో తమిళనాడులో కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై ఇంకా సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. టీవీకేకు ఏఎంఎంకే మద్దతు ఇచ్చినట్లు వస్తున్న వార్తలను ఆ పార్టీ అధినేత దినకరన్ తోసిపుచ్చారు. తమ ఎమ్మెల్యే మద్దతిస్తున్నారని పేర్కొంటూ గవర్నర్‌కు టీవీకే నేతలు జిరాక్స్ కాపీ ఇచ్చినట్లు తెలుస్తోందన్నారు. అయితే, అసలైన లేఖ ఎక్కడుందో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అది లభిస్తేనే వాస్తవాలు బయటపడతా యన్నారు. లేఖపై తాను సంతకం చేస్తున్నట్లు టీవీకే విడుదల చేసిన వీడియోపై ఏఎంఎంకే ఎమ్మెల్యే కామరాజ్ స్పందిస్తూ.. అది కృత్రిమ మేధ ఆధారిత వీడియో అని ఆరోపించారు. ఇప్పటికే ఈ వ్యవహారంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమంటూ టీవీకే అధినేత విజయ్ వరుసగా గవర్నర్‌ను కలుస్తుం డటంపై డీఎంకే విమర్శలు గుప్పించింది. గవర్నర్‌ను సంప్రదించడానికి ముందే ఇతర పార్టీల మద్దతును కూడగట్టుకోవాలని సూచించింది. ఎమ్మెల్యేల మద్దతు లేకుండా గవర్నర్‌కు లేఖ ఎందుకు ఇవ్వడమని ప్రశ్నించింది. రాష్ట్రంలో నెలకొన్న అసాధారణ రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో.. అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ నేతృత్వంలోని టీవీకేను ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించా లని పీఎంకే వ్యవస్థాపకుడు రామదాస్ పేర్కొన్నారు. ప్రజాతీర్పును ప్రతిఒక్కరూ గౌరవించాల్సిందే నన్నారు. ప్రభుత్వ ఏర్పాటు పక్రియలో జాప్యం చేయొద్దని.. వెంటనే దీనిని పూర్తిచేయాలంటూ ఓ ప్రకటన విడుదల చేశారు. అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ మెజార్టీ లేక ప్రభుత్వ ఏర్పాటులో ఇబ్బందులు పడుతున్న విజయ్.. త్వరలో వీసీకే చీఫ్‌ను కలవనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈసందర్భంగా తమకు మద్దతు ఇవ్వాలని కోరనున్నట్లు తెలిసింది. ప్రజా తీర్పును వమ్ము చేసేలా చిన్న పార్టీలు దోబూచులాడు తున్నాయి. మద్దతుకు ఓకే చెప్పి గవర్నర్‌కు లేఖలు అందించడంలో వెనక్కి తగ్గాయి. దీంతో మెజార్టీ విషయంలో గవర్నర్ సంతృప్తి చెందక పోవడంతో ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియలో ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. 234 స్థానాలున్న అసెంబ్లీలో 108 స్థానాల్లో విజయ దుందుభి మోగించింది. అధికారం పొందడానికి అవసరమైన మేజిక్ ఫిగర్ కు కేవలం పదకొండు స్థానాలు తక్కువ. ఇటువంటి పరిస్థితిలో అసెంబ్లీలో అతి పెద్ద పార్టీగా అవతరించిన పార్టీ నేతను ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయించడం అన్నది కేవలం ఆనవాయితీ మాత్రమే. గతంలో అటల్ బిహారి వాజ్‌పేయి నాయకత్వంలోని బిజెపికి నాటి రాష్ట్రపతి అటువంటి అవకాశం ఇవ్వడం 13 రోజుల్లో మెజారిటీ రుజువు చేసుకోలేక వాజ్‌పేయి రాజీనామా చేసిన విషయం అందరికీ తెలిసిందే! దేశంలోనూ వివిధ రాష్ట్రాల్లోనూ ఇటువంటి దృష్టాంతాలెన్నో జరిగాయి. అయితే ప్రమాణానాఇకి ముందు మద్దతు లేఖలతో సం÷-యా బలం తెలుసుకోవడం గవర్నర్ విధి. దీనిని ఎవ్వరూ తప్పు పట్టాల్సిన పనిలేదు. తమిళనాడు ప్రజలు విజయ్ నాయకత్వంలోని టివికె పార్టీకి మె.ఆర్టీ సీట్లు కట్టబెట్టారు. ఫలితాలు వచ్చిన మరునాడే అతి పెద్ద పార్టీగా వచ్చిన తమను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని విజయ్ చేసిన విజ్ఞప్తిని గవర్నర్ ఆహ్వానిస్తూనే మద్దతు లేఖలు కోరారు. అయితే విజయ్ కూడా ఈ విషయంలో కొంత డ్రామాలు ఆడుతున్నట్లుగా ఉంది. అయిదు సీట్లున్న కాంగ్రెస్ పార్టీ మద్దతు ఉన్నప్పటికీ మెజారిటీకి అవసరమైన మద్దతు మాత్రం చూపడం లేదు. తమిళ ప్రజా తీర్పును అమలు చేయడానికి తమిళనాట గందరగోళం సృష్టించాలని తమిళ పార్టీలే యత్నిస్తు న్నాయి. వామపక్షాలు బేషరతు నిర్ణయం తీసుకొని టివికె ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ప్రకటించాయి. విసికె మద్దతు లేఖ ఇస్తే మేజిక్ ఫిగర్ చేరుకోవడం సులువ వుతుంది. ఈ క్రమంలో తమిళనాడులో నూతన ప్రభుత్వం ఏర్పాటుపై ఇంకా ప్రతిష్టంభన వీడలేదు. విజయ్ నేతృత్వంలోని టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించి నప్పటికీ.. ప్రభుత్వ ఏర్పాటుకు సతమతమవుతోంది. చిన్న పార్టీల మద్దతు ఉందని చెబుతూ మూడు రోజుల్లో మూడుసార్లు గవర్నర్‌ను కలిసినా.. ప్రభుత్వ ఏర్పాటుకు ఆ రాష్ట్ర లోక్‌భవన్ నుంచి పిలుపు రాకపోవడం తమిళ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠగా మారింది. ఇదంతా కేవలం మద్దతు ఇస్తున్న పార్టీల లేఖలు సమకూర్చడంలో చేస్తున్న జాప్యంగానే చయేడాలి.

# అక్షర ప్రస్థానంలో అపూర్వ ఘట్టం

# పాఠశాల నుంచి ఇంటర్ వరకు 'ఒకే గొడుగు'!

## కార్పొరేట్ కోరల్లోంచి ప్రభుత్వ ఒడిలోకి: ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే దిశగా అడుగులు



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

రాష్ట్ర విద్యా వ్యవస్థలో మరో కీలక సంస్కరణకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ప్రాథమిక పాఠశాలల నుంచి ఇంటర్మీడియట్ స్థాయి వరకు విద్యా సంస్థలను ఒకే పరిపాలనా వ్యవస్థ కిందకు తీసుకురావాలనే యోచనకు రూపురేఖలు సిద్ధమవుతున్నాయి. ప్రస్తుతం వేర్వేరు శాఖల ఆధీనంలో నడుస్తున్న ప్రభుత్వ పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశా లలను సమన్వయంతో నడిపించేం దుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. రానున్న విద్యా సంవత్సరంనుంచే ఈ విధానాన్ని అమలు చేయాలని ఉన్నత స్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. విద్యార్థుల నిరంతర విద్యాభ్యాసం, ఉపాధ్యాయుల వినియోగం, మౌలిక సదుపాయాల సమీకరణ, పరిపాలనా వ్యయాల తగ్గింపు వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఇప్పటి వరకు రాష్ట్రంలో విద్యాశాఖ నిర్మాణం విభజిత పద్ధతిలో కొనసాగుతోంది. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఒక శాఖ పరిధిలో ఉండగా, ఇంటర్మీడియట్ విద్య మరో ప్రత్యేక బోర్డు ఆధ్వర్యంలో కొనసాగుతోంది. ఫలితంగా పాఠ్యాంశాలు, బోధనా విధానాలు, ఉపాధ్యాయ నియామకాలు, పరీక్షా విధానాల్లో అనేక అసమానతలు కనిపిస్తున్నాయి. పదో తరగతి వరకు ఒక విధానంలో చదివిన విద్యార్థి, ఇంటర్‌కు చేరిన వెంటనే పూర్తిగా భిన్నమైన విద్యా వాతావరణాన్ని ఎదుర్కొంటున్నాడు. ఈ మార్పుకు చాలా మంది విద్యార్థులు అలవాటు పడలేక మధ్యలోనే చదువు మానేస్తున్నారని విద్యా నిపుణులు చాలా కాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దేశవ్యాప్తంగా కొత్త జాతీయ విద్యా విధానం--2020 అమలులోకి వచ్చిన తర్వాత విద్యా నిర్మాణంలో సమూల మార్పులు చోటుచేసుకుంటున్నాయి. 5ం3ం3ం4 విధానంలో పాఠశాల విద్యను పునర్వ్యవస్థీకరించాలని కేంద్రం సూచించింది. ఈ నేపథ్యంలోనే పదో తరగతి తరువాతి రెండు సంవత్సరాలను కూడా పాఠశాల విద్యలో భాగంగానే పరిగణిస్తూ, ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యతో అనుసంధానం చేయాలనే ఆలోచన బలపడింది. ఇప్పటికే పలు రాష్ట్రాలు ఈ దిశగా చర్యలు ప్రారంభించాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే మార్గంలో అడుగులు వేస్తూ, "స్కూల్ కాంప్లెక్స్" విధానాన్ని మరింత విస్తరించి జూనియర్ కళాశాలలను అందులో భాగం చేయాలని చూస్తోంది.

ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కళాశాలల పరిస్థితి కూడా ఆందోళన కరంగానే ఉంది. రాష్ట్రవ్యాప్తంగా వందలాది జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. కార్పొరేట్ విద్యాసంస్థల దూకుడు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కొరత, అధ్యాపకుల ఖాళీలు, ప్రయోగశాలల లేమి వంటి కారణాలతో ప్రభుత్వ ఇంటర్ కళాశాలలు క్రమంగా బలహీన పడుతున్నాయి. అనేక కళాశాలల్లో పూర్తి స్థాయి అధ్యాపకులు లేక గెస్ట్ లెక్చరర్లతోనే బోధన సాగుతోంది. కొన్ని కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పదులలోకి పడిపోగా, మరికొన్ని చోట్ల తరగతులే లేకుండా మారిపోయిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో పాఠశాలలతో జూనియర్ కళాశాలలను అనుసంధానం చేస్తే విద్యార్థుల ప్రవాహం పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు అదే విద్యా సముదాయంలో ఇంటర్ విద్యను కొనసాగించ గలుగుతారు. గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా బాలికల కు ఇది ఎంతో ఉపయోగకరంగా మారనుంది. ప్రస్తుతం ఇంటర్ చదువుకోవాలంటే దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుండటంతో చాలామంది బాలికలు విద్యను మధ్యలోనే ఆపేస్తున్నారు. ఒకే క్యాంపస్‌లో ఇంటర్ సదుపాయం ఉంటే తల్లిదండ్రుల్లో భద్రతాభావం పెరిగి విద్యార్థుల ప్రవేశాలు అధికమయ్యే అవకాశముంది. విద్యా హక్కు చట్టం ఆత్మను కొనసాగిస్తూ "స్కూల్ టు కాలేజ్" మార్పును సులభతరం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంటోందని విద్యావర్గాలు చెబుతున్నాయి.

మరోవైపు ఉపాధ్యాయ వనరుల వినియోగం కూడా ఈ మార్పుతో మెరుగుపడే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు అధికంగా ఉండగా, మరికొన్ని చోట్ల తీవ్ర కొరత ఉంది. జూనియర్ కళాశాలల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఒకే పరిపాలనా వ్యవస్థలోకి తీసుకువస్తే సబ్జెక్టు నిపుణులను అవసరానికి అనుగుణంగా వినియోగించు కోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా గణితం, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, ఇంగ్లిష్ వంటి విషయాల్లో నాణ్యమైన బోధన అందించేందుకు ఇది ఉపయోగ పడుతుందని భావిస్తున్నారు.

అయితే ఈ నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇంటర్మీడియట్ విద్య స్వతంత్ర లక్ష్యాలతో ఏర్పడిన ప్రత్యేక దశ అని, దానిని పూర్తిగా పాఠశాల విద్యలో కలిపేస్తే అకాడమిక్ నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని కొందరు విద్యా వేత్తలు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పోటీ పరీక్షల దృష్ట్యా ఇంటర్ స్థాయిలో ప్రత్యేక బోధన అవసరమని వారు చెబుతున్నారు. ఇంజినీరింగ్, మెడిసిన్, సైన్స్ రంగాలకు పునాది వేసే దశ ఇంటర్మీడియట్ కావడంతో దాని ప్రత్యేకతను కాపాడాలని సూచిస్తున్నారు. అదేవిధంగా జూనియర్ లెక్చరర్ల సేవా నిబంధనలు, పదోన్నతులు, పరిపాలనా హోదాలపై కూడా స్పష్టత అవసరమని ఉద్యోగ సంఘాలు కోరుతు న్నాయి.

ప్రభుత్వం మాత్రం ఈ సంస్కరణను కేవలం విలీనంగా కాకుండా సమగ్ర విద్యా పునర్నిర్మాణంగా ప్రచారం చేస్తోంది. విద్యార్థి ఒకే విద్యా వాతావరణంలో నిరంతరంగా అభ్యసించేలా "సీమ్‌లెస్ ఎడ్యుకేషన్" లక్ష్యంగా పనిచేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. డిజిటల్ తరగతులు, కామన్ లైబ్రరీలు, సమగ్ర ప్రయోగశాలలు, క్రీడా మైదానాలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు వంటి సదుపాయాలను ఒకే విద్యా సముదాయంలో కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను వినియోగించి "ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ క్యాంపస్"లుగా అభివృద్ధి చేసే అవకాశాలను కూడా పరిశీలిస్తు న్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం వేల సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలు, వందలాది జూనియర్ కళాశాలలు పనిచేస్తున్నాయి. కానీ




విద్యార్థుల నమోదు గణాంకాలను పరిశీలిస్తే ప్రభుత్వ విద్యాసంస్థలపై ఆధారపడే వారి సంఖ్య క్రమంగా తగ్గుతున్నట్లు తెలుస్తోంది. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల వైపు విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం "మన ఊరు--మన బడి" వంటి పథకాలు అమలు చేసినప్పటికీ, ఇంటర్ స్థాయిలో అదే స్థాయి సంస్కరణలు జరగలేదనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాలలతో ఇంటర్ విద్యను అనుసంధా నం చేయడం ద్వారా ప్రభుత్వ విద్యపై మళ్లీ ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలని ప్రభుత్వం యత్నిస్తోంది. ఇక విద్యార్థుల మానసిక ఒత్తిడిని తగ్గించే కోణంలో కూడా ఈ నిర్ణయాన్ని పరిశీలిస్తున్నారు. పదో తరగతి వరకు ఒక వాతావరణంలో చదివిన విద్యార్థి అకస్మాత్తుగా కార్పొరేట్ ఇంటర్ కళాశాలల ఒత్తిడికి గురవుతూ మానసిక ఆందోళనలకు లోనవు తున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. ఒకే విద్యా వాతావరణంలో కొనసాగితే విద్యార్థుల్లో భయం తగ్గి, సృజనాత్మకత పెరుగుతుందని విద్యా మానసిక శాస్త్ర నిపుణులు సూచిస్తున్నారు.

అయితే ఈ వ్యవస్థ విజయవంతం కావాలంటే కేవలం పరిపాలనా ఉత్తర్వులు సరిపోవు. మౌలిక సదుపాయాల విస్తరణ, నాణ్యమైన అధ్యాపక నియామకాలు, పాఠ్యాంశాల సమన్వయం, డిజిటల్ వనరుల కల్పన, గ్రామీణ ప్రాంతాలకు ప్రత్యేక ప్రాధాన్యం వంటి అంశాల్లో ప్రభుత్వం దీర్ఘకాలిక దృష్టితో ముందుకు సాగాల్సి ఉంటుంది. లేదంటే ఇది కూడా గతంలో వచ్చిన అనేక విద్యా సంస్కరణల మాదిరిగానే కాగితాలకే పరిమితమయ్యే ప్రమాదం ఉంది. విద్య అనేది కేవలం పరీక్షల వ్యవస్థ కాదు; సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి. అలాంటి విద్యా వ్యవస్థలో మార్పులు చేపట్టేటప్పుడు రాజకీయ ప్రయోజనాలకన్నా విద్యార్థుల భవిష్యత్తు, సామాజిక సమానత్వం, గ్రామీణాభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. "ఇంటర్ దాకా ఒకే గొడుగు కిందకు" అనే ప్రభుత్వ ఆలోచన అమలులో సఫలమైతే రాష్ట్ర విద్యా రంగంలో ఇది చారిత్రక మలుపుగా నిలిచే అవకాశం ఉంది. అదే సమయంలో అమలులో నిర్లక్ష్యం జరిగితే ప్రభుత్వ విద్య మరింత సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం కూడా లేకపోలేదు.

**-వ్యాసకర్త సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.**

# మోడీ మార్క్ రాజకీయాలు...

## భారత్ పయనం ఎటువైపూ... బానిసత్వం వైపా..! స్వేచ్ఛ వైపా..!

నేటి భారతదేశ రాజకీయ ముఖచిత్రం ఒక క్లిష్టమైన సంధి కాలంలో ఉంది. దశాబ్దాల పాటు భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిన దేశం, నేడు 'ఒకే దేశం - ఒకే సంస్కృతి' అనే నినాదం వెనుక తన వైవిధ్యాన్ని కోల్పోతోంది. నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం మతాన్ని రాజకీయ ఆయుధంగా మార్చుకుని, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చరిత్ర పుటలను తిరగేస్తే, అధికారాన్ని నిలబెట్టుకోవడానికి పాలకులు అనుసరించే మార్గాలు కాలంతో పాటు మారుతుంటాయి. 16వ శతాబ్దంలో ఇటలీకి చెందిన రాజనీతి తత్వవేత్త నికోలో మాఖియా వెలి తన ప్రసిద్ధ గ్రంథం 'ది ప్రిన్స్' ద్వారా రాజకీయాలను మతం మరియు నైతికత నుండి వేరు చేసి, "రాజకీయ లౌకిక వాదానికి" పునాది వేశారు. కానీ, నేటి భారతదేశంలో ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో రాజకీయాలు మళ్లీ మతంతో ముడిపడి, ఒక విలక్షణమైన మలుపు తిరుగుతున్నాయి. ఈ పరిణామం రాజ్యాంగ వ్యవస్థల పతనం వైపు దారి తీస్తోందా? భారతీయులను ఆధునిక యుగం నుండి మధ్య యుగపు ఆలోచనా ధోరణిలోకి నెడుతోందా? అన్నది నేడు మేధావుల ముందున్న ప్రధాన ప్రశ్న.

మాఖియావెలి కంటే ముందు, పాలన అనేది దైవ కార్యంగా భావించబడేది. మాఖియావెలి దానిని తలకిందులు చేశారు. "పాలన అనేది వాస్తవికత మీద ఆధారపడి ఉండాలి, ఆదర్శాల మీద కాదు." అని మాఖియావెలి స్పష్టం చేశారు. మాఖియావెలి మతాన్ని వ్యక్తిగత విషయంగా చూశారు. రాజకీయాలలో మతాన్ని కేవలం ప్రజలను నియంత్రించే ఒక 'సాధనం'గా మాత్రమే వాడాలని సూచించారు తప్ప, మతమే రాజకీయంగా మారకూడదన్నారు. "ఒక పాలకుడు దయాగుణం, విశ్వాసం, మానవత్వం, మత విశ్వాసం కలిగి ఉన్నట్టు కనిపించడం అవసరం, కానీ వాటిని నిజంగా కలిగి ఉండటం ప్రమాదకరం." - నికోలో మాఖియావెలి.

మాఖియావెలి రాజకీయాల నుండి మతాన్ని వేరు చేయాలని చెబితే, నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ మతాన్ని రాజకీయాలకు ప్రధాన ఇంధనంగా మార్చుకుంది. "మతం అనేది వ్యక్తిగత విశ్వాసం కావాలి, కానీ అది అధికార పీఠానికి నిచ్చెనగా మారినప్పుడు... మానవత్వం మంటగలిసి, మతోన్మాదం రాజ్యమేలుతుంది." అయోధ్య రామమందిర నిర్మాణం నుండి 'హిందుత్వ' నినాదం వరకు, ప్రతి అంశం ఓట్ల సమీకరణకు సాధనంగా మారింది. ఇది కేవలం భక్తి మాత్రమే కాదు, ఒక రాజకీయ అస్త్రం. బిజెపి అనుసరిస్తున్న రాజకీయ విధానం కేవలం అభివృద్ధి చుట్టూ కాకుండా, మతపరమైన భావోద్వేగాల చుట్టూ తిరుగుతోంది. రామ మందిరం నుంచి ఆర్టికల్ 370 రద్దు వరకు, ప్రతి అంశాన్ని రాజకీయ లబ్ధి కోసం మత రంగు పులిమి వాడుకోవడం కనిపిస్తుంది. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీషర్లు వాడిన విభజించు - పాలించు సూత్రాన్ని, నేడు మతం ప్రాతిపదికన ఓటర్లను చీల్చడానికి ఉపయోగిస్తున్నారు. ఎన్నికల సమయంలో ద్వేషపూరిత ప్రసంగాలు చేయడం, ప్రత్యర్థులను శత్రువులుగా, ఒక వర్గం ప్రజలను పరాయి వారిగా చిత్రించడం ప్రజాస్వామ్య పునాదులను కదిలిస్తోంది. రాజకీయాలకు మతం తోడైనప్పుడు, తటస్థంగా ఉండాల్సిన వ్యవస్థలు ప్రభావితమవుతాయి. ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ, మీడియా వంటి ప్రజాస్వామ్య స్తంభాలు మతపరమైన భావోద్వేగాల ముందు తలవంచుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. రాజ్యాంగంలోని 'సెక్యులరిజం' (లౌకికవాదం) అనే ఆత్మ క్రమంగా క్షీణిస్తోంది. భారత రాజ్యాంగం 'లౌకిక వాదం' (ూవష్ఠబశ్రీఱఝతీఅంఎ) మీద నిలబడింది. కానీ నేడు వ్యవస్థలన్నీ ఒకే భావజాలం క్రిందకు వెళ్తున్నాయి. ఈసీ, సీబీఐ, ఈడీ వంటి స్వతంత్ర సంస్థలు స్వయం ప్రతిపత్తిని కోల్పోయి, నిర్వీర్యం అవుతూ, అధికార పార్టీకి కీలు బొమ్మలుగా మారాయన్నది బహిరంగ రహస్యం. ప్రభుత్వాన్ని ప్రశ్నించే జర్నలిస్టులు, మేధావులను 'దేశ ద్రోహులు'గా ముద్ర వేయడం, భావప్రకటనా స్వేచ్ఛపై ఉక్కుపాదం మోపడంతో మనుగ డలో ఉన్న ప్రజాస్వామ్యానికి మరణశాసనం లిఖించబడుతుంది. ఆధునిక భారతంలో 'మనువాదం' మళ్లీ కొత్త రూపంలో ప్రవేశి స్తోంది. దళితులు, గిరిజనులు మరియు మైనారిటీల పట్ల పెరుగు తున్న హింస, వివక్ష దీనికి నిదర్శనం. రాజ్యాంగం కల్పించిన సమానత్వాన్ని కాలరాస్తూ, వర్ణ వ్యవస్థలోని ఆధిపత్య పోకడలను పరోక్షంగా ప్రోత్సహించడం ఆందోళనకరం మనువాద పోకడలతో ఆర్థిక, సామాజిక అసమానతలు పెరిగిపోతున్నాయి

అధికారం కోసం బీజేపీ అనుసరిస్తున్న వ్యూహాల్లో మతపరమైన హింస ఒక భాగంగా మారింది. అధికార దాహంతో హింస పెరిగిపోతుంది. అల్లర్లు సృష్టించడం ద్వారా ప్రజల మధ్య అగాధాన్ని పెంచి, ఆ అభద్రతా భావం నుంచి ఓట్లను పిండుకోవడం ఒక విష సంస్కృతికి తెరలేపింది. మత ఘర్షణలు కేవలం ప్రాణాలను తీయడమే కాకుండా, దేశ ఆర్థిక మరియు సామాజిక ఐక్యతను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి.

మాఖియావెలి చెప్పినట్టు, అధికారాన్ని కాపాడుకోవడానికి పాలకుడు ఏదైనా చేయవచ్చు (ఞష్ట్రవ వఅస యబర్‌ఱటఱవం్‌ష్ట్రవ ఎముఅం). కానీ మోదీ మతాన్ని ఉపయోగించి ప్రజామోదాన్ని పొందుతూ, రాజ్యాంగ నియమాలను తన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా మార్చుకుంటున్నారు. నేటి పరిస్థితులు అంబేద్కర్ భయపడిన ఆ రోజూలను గుర్తు చేస్తున్నాయి. సంప్రదాయాల పేరుతో అణచివేతను సమర్థించే ధోరణి పెరుగుతోంది. "రాజ్యాం గం ఎంత గొప్పదైనా, దానిని అమలు చేసే వ్యక్తులు దుర్మార్గులైతే అది విఫలమవుతుంది." - డా. బి.ఆర్. అంబేద్కర్

ఒక దేశం ఆర్థికంగా ఎంత అభివృద్ధి చెందినా, సామాజికంగా వెనక్కి వెళ్తుంటే ఆ అభివృద్ధికి అర్థం లేదు. మతం మనిషికి శాంతిని




ఇవ్వాలి, కానీ రాజకీయాలకు ఆయుధంగా మారకూడదు. ప్రజలను విద్య, వైద్యం, ఉపాధి వంటి ఆధునిక సమస్యల వైపు కాకుండా, గత చరిత్రలోని గొడవలు, మతపరమైన ఆధిపత్యం వైపు మళ్లిం చడం ద్వారా దేశాన్ని 'మధ్యయుగపు మత బానిసత్వం' వైపు తీసుకెళు న్నారనే విమర్శ బలంగా వినిపిస్తోంది.

భారతదేశం అంటే కేవలం భూభాగం కాదు, కోట్లాది మంది ప్రజల నమ్మకం మరియు వైవిధ్యం. మతం పేరుతో దేశాన్ని విడదీయడం, రాజ్యాంగ విలువలను పక్కన పెట్టడం భావి తరాలకు మనం ఇచ్చే చేదు బహుమతి. మేధావులు, యువత మరియు సామాన్య ప్రజలు నిద్ర మేల్కోవాల్సిన సమయం ఇది. "ప్రజాస్వామ్యంలో మౌనం అనేది నిరంకుశత్వానికి ఇంధనం వంటిది. ప్రశ్నించడమే ప్రజాస్వామ్యానికి ప్రాణం." రాజ్యాంగాన్ని కాపాడుకోవడం అంటే దేశాన్ని కాపాడుకోవడమే. మత రాజకీయం తాత్కాలికంగా అధికారాన్ని ఇవ్వవచ్చు, కానీ అది దేశ ఆత్మను చంపేస్తుంది. "మతం అనేది రాజకీయాల్లోకి ప్రవేశించినప్పుడు, అది మతాన్ని భ్రష్టు పట్టిస్తుంది మరియు రాజకీయాలను విషపూరితం చేస్తుంది." నేటి భారతీయులు తమను తాము ప్రశ్నించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. మనం రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛా వాయువులను పీలుస్తున్నామా? లేక మతపరమైన ఉద్వేగాల మధ్య బందీలుగా మారుతున్నామా? అంధ విశ్వాసాల నుండి బయటపడి, ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకున్నప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది.

**- విశ్వ జంపాల, న్యాయవాది, విశ్వ సమాజం వ్యవస్థాపకులు**

# సూర్యాపేట జిల్లాకు బి.యన్ పేరు పెట్టాలి

## బి.యన్ 18వ వర్ధంతి సందర్భంగా యంసిపిఐ (యు) నాయకులు డిమాండ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

శేరిలింగంపల్లి మే 9 : వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, యంసిపిఐ (యు) పోలిట్ బ్యూరో సభ్యులు, మాజీ పార్లమెంటు సభ్యులు, కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి (బి.ఎన్) పేరును సూర్యాపేట జిల్లాకు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని యంసిపిఐ (యు) నాయకులు డిమాండ్ చేసారు. బి.యన్ 18వ వర్ధంతి సందర్భంగా శనివారం హైదరాబాద్ మియాపూర్ ముజఫర్ అహమ్మద్ నగర్ పార్టీ కార్యాలయంలో బి.యన్ చిత్రపటానికి యంసిపిఐ (యు) గ్రేటర్ హైదరాబాద్ సహాయ కార్యదర్శి తుడుం అనిల్ కుమార్ మరియు పార్టీ నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా యంసిపిఐ (యు) గ్రేటర్ హైదరాబాద్ సహాయ కార్యదర్శి తుడుం అనిల్ కుమార్ మాట్లాడుతూ.. ఫ్యూడల్ వ్యవస్థను తలంపించిన నాటి నిజాం రజాకార్ పాలనకు వ్యతిరేకంగా వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని విరోచితంగా నడిపింది కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి(బి ఎన్) అని బాంచన్ నీ కాల్మొక్త అన్న బడుగు జీవులకు బంధువకులు చేత పట్టించి బానిసత్వాన్ని బద్దలు కొట్టిన వీరుడు బి.ఎన్ .నిజాం రజా కార్ పాలనపై,భూస్వాములు, దేశ్ ముఖ్ లపై ప్రజా చైతన్యంతో అలుపెరుగని పోరాటాన్ని నడిపిన ధైర్యశాలి కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి అని తెలిపారు ఆ పోరాటం ద్వారా పది లక్షల ఎకరాల సాగు భూమి మూడు వేల గ్రామాల స్వరాజ్య పాలనను సాధించాయని వెట్టి చాకిరి నిర్మూలించబడ్డాయని ఈ ఘనత ఆనాటి పోరాటం చేసిన వీరులలో కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి పాత్ర గణనీయమైనదని గుర్తు చేశారు. ఆయన ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు సార్లు ఎమ్మెల్యేగా మూడుసార్లు ఎంపీగా చట్టసభలకు ఎంపికై ప్రజలకు సేవలు అందించారని గుర్తు చేశారు. జనాభాలో 93% ఉన్న ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీలకు ఆర్థిక రాజకీయ సమానత్వం తో పాటు సామాజిక న్యాయం జరగాలని తపించి 1997లో సూర్యాపేటలో లక్షలాదిమంది అణగారిన ప్రజలను సమీకరించి గొప్ప బహిరంగ సభ నిర్వహించి సామాజిక న్యాయ సాధనకు పునాది కలిగించారని అన్నారు. 2008 మే 9న బిఎన్ అమరులైనారు. ప్రపంచం గర్వించదగ్గ జరిగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ప్రత్యక్షంగా నాయకత్వం తెలంగాణ సాయుధ పోరాట చరిత్రకారుడైన ప్రజలచే తెలంగాణ చేగువేరా అని పిలువబడే కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి (బి.ఎన్) సూర్యపేట జిల్లాకు వెంటనే నామకరణం చేయాలని, హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై బి.ఎన్ విగ్రహం ఏర్పాటు చేయాలని, పాఠ్యాంశాలలో బిఎన్ జీవిత చరిత్రను చేర్చాలని యంసిపిఐ(యు) తెలంగాణ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, అలాగే హైదరాబాదులో వీర తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర ఆనవాళ్లను భావితరాలకు తెలియచేయడానికి 25 ఎకరాలలో స్మృతి వనం ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కుల మత ప్రాంతీయ అసమానతలులేని సమసమాజ స్థాపన కోసం తమ జీవితాలను పణంగా పెట్టి పోరాటం చేశారని బి.ఎన్ కి యంసిపిఐ(యు) నాయకులు ఘనంగా నివాళులర్పించారు గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి వర్గ సభ్యులు తాండ్ర కళావతి, అంగడి పుష్ప, ఇస్లావత్ దశరథ్ నాయక్, పల్లె మురళి,మరియు మియాపూర్ డివిజన్ నాయకులు జి శివాని, యం డి రజియా బేగం, టీ పుష్ప లత తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నేటి ప్రధాని భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలి

## బీజేపీ జిల్లా మీడియా కన్వీనర్ ఊరటి మునేందర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, మే 9 : భారత ప్రధాని నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా తెలంగాణకు విచ్చేస్తున్న సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని భారతీయ జనతా పార్టీ జయశంకర్-భూపాలపల్లి జిల్లా మీడియా కన్వీనర్ ఊరటి మునేందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, దేశ ప్రగతిలో రాష్ట్రాన్ని భాగస్వామ్యం చేయాలనే సంకల్పంతో ప్రధాని మోదీ సభకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తోందని తెలిపారు. బీజేపీ చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాలకు ఆకర్షితులై ప్రజలు స్వచ్ఛందంగా పార్టీ వైపు ముందుకు వస్తున్నారని ఆయన అన్నారు. ఈ భారీ బహిరంగ సభ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# వయోవృద్ధుల చట్టంపై అవగాహన సదస్సు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 09 : తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో వయో వృద్ధుల సంరక్షణ, పోషణ చట్టంపై వయోధికులకు, వారి కొడుకులు, కోడళ్ళకు, వివిధ సంఘాల ప్రతినిధులకు సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ అవగాహన కల్పించారు. శనివారం సీనియర్ సిటిజెన్స్ జిల్లా సమావేశ మందిరంలో శనివారం జరిగిన ఈ సదస్సులో సీనియర్ సిటిజెన్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.సీ.హన్మంత్ రెడ్డి 63,వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. అనంతరం ఈ సదస్సు, వేడుకలకు ముఖ్య.అతిథిగా హాజరైన హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ..వృద్ధులైన తల్లి దండ్రులను పోషించకుండా నిరాదరిస్తే చట్టప్రకారం వారికి ఆరు మాసాల జైలు శిక్ష, జరిమానా విధించుటకు, వారు పొందిన ఆస్తిని తిరిగి తల్లిదండ్రుల పేరిట పట్టా మార్పిడికి వీలుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.సీ హన్మంత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి గౌరి శెట్టి విశ్వనాథం, ధర్మపురి సీ.డి.పి.ఓ బి.వాణిశ్రీ, సీనియర్ సిటిజెన్స్ జిల్లా సహాయ అధ్యక్షులు బొల్లం విజయ్, ఉపాధ్యక్షులు ఎం.డి.యాకూబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కే.సత్యనారాయణ, ధర్మపురి నియోజకవర్గ అధ్యక్షులు కండ్ల గంగాధర్, గొల్లపల్లి అధ్యక్షులు వీరారెడ్డి, కోరుట్ల డివిజన్ అధ్యక్షులు పబ్బా శివానందం, బుగ్గారం అధ్యక్షులు దుబ్బేష్,జగిత్యాల డివిజన్ అధ్యక్షులు బి.రాజేశ్వర్,బీసీ మహిళా సంఘాల జిల్లా నేతలు గంగము జలజ, శ్రీమంజరి, సింగం పద్మ, వివిధ సంఘాల నాయకులు సయ్యద్ యూసుఫ్, వజీర్, ప్రసాద్, కొండాపూర్ యాకుబ్ హుస్సేన్, పుప్పాల నర్సింగరావు, నారాయణ, బండారి ముత్తయ్య, అసిఫ్ ఖాజా, బాలయ్య, పుత్రయ్య, సీనియర్ సిటిజెన్ల, పెన్షనర్ల, బీసీ జేఏసీ, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# నియోజకవర్గ అభివృద్ధి, మహిళా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

## భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 9 : భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధి, మహిళా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. ఘనపూర్ మండలంలోని మైలారం గ్రామానికి చెందిన కూసు మమత-మహేందర్ దంపతులు, చిట్యాల మండలంలోని ఒడితల గ్రామానికి చెందిన సట్ల కవిత-కుమార్ దంపతుల గృహ ప్రవేశ కార్యక్రమాలకు శనివారం శాసనసభ్యులు హాజరై కుటుంబ సభ్యులను అభినందించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నిర్మించిన గృహాల్లో జరిగిన ఈ కార్యక్రమాలు ఆనందోత్సాహాల నడుమ జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం మహిళల సంక్షేమం, ఆర్థిక భద్రత, గౌరవప్రదమైన జీవన విధానానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని అన్నారు. మహిళ సాధికారత ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమవు తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పేదల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామాధికారులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా మొక్కజొన్నను వెంటనే తరలించాలి

## డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 9 : అకాల వర్షాల కారణంగా రైతులు ఇబ్బందులు పడకుండా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే గోదాములకు తరలించే చర్యలు చేపట్టాలని భద్రాద్రి జిల్లా పాల్వంచ సహకార సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర మార్కెట్ సమాఖ్య మాజీ సంచాలకుడు, డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు అధికారులను కోరారు. పాల్వంచ మండలంలోని ఉల్వనూరులో పాల్వంచ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. కేంద్రంలో నిల్వ ఉన్న మొక్కజొన్న పరిస్థితిని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న మొక్కజొన్న కుప్పలు తడుస్తున్నాయని, దీంతో గింజలకు పూత పట్టి నల్లబడే ప్రమాదం ఉందన్నారు. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్ సమాఖ్య అధికారులు లారీ యాజమాన్యాలతో సమన్వయం చేసుకొని కొనుగోలు చేసిన మొక్కజొన్నను వెంటనే సూచించిన గోదాములకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల శ్రమ వృథా కాకుండా అధికారులు తక్షణమే స్పందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర నిర్వాహకుడు మోహన్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యుడు బరిపటి వాసుదేవరావు, యర్రంశెట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోండం వెంకన్న గౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుల నియామక ప్రక్రియ ప్రారంభం

- దళిత నాయకులు దరఖాస్తు చేసుకోవాలి
- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దేవి ప్రసన్న, పరిశీలకుడు వెంకట నరసయ్య

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి కొత్తగూడెం, మే 9 : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుల నియామక ప్రక్రియ ప్రారంభమైనట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దేవి ప్రసన్న, ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిశీలకుడు వెంకట నరసయ్య తెలిపారు. రాష్ట్ర ఎస్సీ విభాగం అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు ప్రస్తుతం ఉన్న జిల్లా కమిటీలను రద్దు చేసి కొత్త కమిటీల నియామక ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శనివారం వెంకట నరసయ్య జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దేవి ప్రసన్నను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకట నరసయ్య మాట్లాడుతూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్ష పదవికి ఆసక్తి ఉన్న దళిత నాయకులు ఈ నెల 15వ తేదీ శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు జిల్లా కాంగ్రెస్ శిబిర కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దేవి ప్రసన్న, పరిశీలకుడు వెంకట నరసయ్య సమక్షంలో దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి అర్హులైన దళిత నాయకులు పెద్ద సంఖ్యలో వచ్చి దరఖాస్తు చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువజన జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



# వ్యవసాయ రంగ అభివృద్ధికి నీటి వినియోగం అత్యంత కీలకం

## శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 9 : వ్యవసాయ రంగ అభివృద్ధికి నీటి వినియోగం అత్యంత కీలకమని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లాలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న రైతు వారోత్సవాల్లో భాగంగా నీటి పారుదల ఆయకట్టు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శాయంపేట, ఘనపూర్ మండలాల్లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో శాసనసభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకుంటూ రైతులు శాస్త్రీయ విధానాల్లో పంటల సాగు చేపట్టాలని సూచించారు. నీటి విలువను గుర్తించి ఆయకట్టు ప్రాంతాల అభివృద్ధి, కాలువల పరిరక్షణ, నీటి పంపిణీ సమర్థవంతంగా జరిగితే రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. రైతులు ఆధునిక సాగు పద్ధతులను అనుసరించి అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ అధికారులు, స్థానిక గ్రామాధికారులు, మండల పార్టీ అధ్యక్షులు, రైతులు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

- రైతు ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియపై దృష్టి సారించాలి
- విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, మే 09 : ధాన్యం కొనుగోలు, ఫార్మర్ రిజిస్ట్రీ, సెన్సస్, విద్యా వారోత్సవాలపై శనివారం హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.జిల్లా కలెక్టరేట్ మొదటి అంతస్తు వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్ వీసీ లో పాల్గొన్నరు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో అదనపు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సూచనలు ఆదేశాల మేరకు సంబంధిత అంశాలపై పకడ్బందీగా ముందుకెళ్తామన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్యా వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. సెన్సస్ పై సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లకు గూగుల్ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేయాలని సంబంధిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, వ్యవసాయ శాఖ అధికారిని సరిత, విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి, ఇంటర్మీడియట్ అధికారి మదర్, ఈ ఈ అరుణ్ కుమార్, మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ సాయి చరణ్, మార్కెటింగ్ అధికారి వెంకటేశ్వర్లు, సిపిఓ శ్రీనివాసరావు, డి.ఎస్.ఓ రమేష్, డి ఎం సప్లై సివిల్ సప్లై నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.



# కుప్పకూలిన రావి చెట్టుకు పునర్జన్మ

## జీఎం లలిత్ కుమార్ చొరవతో పునఃప్రతిష్ఠ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 09 : పర్యావరణ పరిరక్షణలో సింగరేణి సంస్థ మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. ఇటీవల కురిసిన గాలివానకు ఆర్జీ-1 ఏరియా పరిధిలోని జీడీకే-11 ఇంక్లైన్ గని సమీపంలోని సుమారు 80 సంవత్సరాల వయస్సు గల భారీ రావి చెట్టు నేలకొరిగింది. విషయం తెలిసిన ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ వెంటనే స్పందించి, ఆ వృక్షాన్ని సంరక్షించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో స్థానిక సింగరేణి సెంట్రల్ నర్సరీ సమీపంలోని జంక్షన్ రోడ్ వద్ద కూలిపోయిన రావి చెట్టును శనివారం శాస్త్రీయ పద్ధతిలో ప్రత్యేక యంత్రాల సహాయంతో తరలించి, పునఃప్రతిష్ఠ చేశారు. ఈ కార్యక్రమంలో జీఎం లలిత్ కుమార్ స్వయంగా పాల్గొని చెట్టును నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. వృద్ధ వృక్షాలను సంరక్షించడం ద్వారా ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ ఎప్పటికప్పుడు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీడీకే-11 గ్రూప్ ఆఫ్ మైన్స్ ఏజెంట్ చిలుక శ్రీనివాస్, డీజీఎం ఫారెస్ట్ ఆఫీసర్ కర్ణ, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, డీజీఎం సీఐఎస్ఎఫ్, సీఎస్పీ ఫైడిశ్వర్, సీనియర్ పీఓ హనుమంతరావు, ఏఐటీయూసీ ప్రతినిధి రాజు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా ఎనభై ఏళ్ల వయస్సు కలిగిన రావి చెట్టును కాపాడి పునఃప్రతిష్ఠ చేసిన జీఎం లలిత్ కుమార్ చొరవను స్థానికులు, పర్యావరణ ప్రేమికులు అభినందించారు.



# రైతుల సమస్య తెలుసుకుని వెంటనే స్పందించిన భూపాలపల్లి ఎమ్మెల్యే

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 9 : చిట్యాల నుండి భూపాలపల్లికి వెళ్తున్న సమయంలో శనివారం సాయంత్రం భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు చిట్యాల సమీపంలోని బాలమృగన్ పత్తి మిల్లు వద్ద మొక్కజొన్న ధాన్యంతో సుమారు రెండు వందల ట్రాక్టర్లలో వేచి ఉన్న రైతులను గమనించి వెంటనే తన వాహనాన్ని ఆపి మిల్లును సందర్శించారు. ఈ సందర్భంగా మిల్లు యాజమాన్యంతో మాట్లాడిన ఆయన రైతులు పండించిన మొక్కజొన్న ధాన్యాన్ని గోదాముల్లో నిల్వ చేసుకునే విధంగా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం నిల్వ, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. శాసనసభ్యుల సూచనలకు స్పందించిన మిల్లు యాజమాన్యం రైతుల మొక్కజొన్న ధాన్యాన్ని గోదాముల్లో నిల్వ చేసుకునేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చింది. దీంతో అక్కడ ఉన్న రైతులు తమ సమస్య పరిష్కారానికి వెంటనే స్పందించిన శాసనసభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బట్టు కరుణాకర్, భూపాలపల్లి పురపాలక సంఘం అధ్యక్షుడు బుర్ర కొమురయ్య గౌడ్, చిట్యాల మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# గ్రామ ప్రజలందరికీ దేవతల అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలి

**- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఒగొండ, మే 9 : భూపాలపల్లి నియోజకవర్గంలోని కొత్తపల్లి గోరి మండల పరిధిలోని విజయ్యపల్లి గ్రామంలో శనివారం నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని భూలక్ష్మి మహాలక్ష్మి, ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలందరికీ దేవతల అనుగ్రహం, దేవుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలు ఎంతో భక్తి శ్రద్ధలతో కార్యక్రమాన్ని నిర్వహించి చడం ఆనందదాయకమని తెలిపారు. గ్రామంలో శాంతి, సుఖసం తోషాలు, ఐకమత్యం నెలకొని ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమానికి తనను ఆహ్వానించిన గ్రామ ప్రజల కు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు, స్థానిక ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు.

# అజర హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మే 09 : మానుకోట మున్సిపాలిటీ, 26 వ వార్డు ప్రజల కోసం అజర హాస్పిటల్స్ ఆధ్వర్యంలో జాతీయ ఎస్టి కమీషన్ మెంబర్ జాటోత్ ఉస్సేన్ నాయక్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు 26వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ (బిజెపి)మాలోతు శ్రీదేవి బాలు నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 26వ వార్డు లోని చెరాలు కిరాణం షాప్ దగ్గర, సిగ్నల్‌కాలనీలో ఈ నెల 12న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించబడు తుందని, ఉచిత వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్,కార్డియాలజీ, బిపి, షుగర్,ఈసీజీ, ఐదు రకాల రక్తపరీక్షలు జరిపి, ఉచితంగా మందులు ఇస్తారన్నారు. ఈ సదావకాశాన్ని తప్పకుండా వార్డు ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. పూర్తి సమాచారం కొరకు బాలు నాయక్-9177949794 చుక్క శ్యాం ప్రసాద్- 96768 28982, అజ్మీరా శ్రీకాంత్-9985443774, పొడకంటి వెంక టేష్-9642221241, తేలూరి రమేష్-7013640013, రాజ్ కుమార్-8520008918, చిలుక రాము-7673968385 నంబర్లలలో సంప్రదించాలని కోరారు.



# చిన్న వర్షానికే చిత్తడవుతున్న రోడ్లు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే9 : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని చాలా గ్రామాలలో చిన్నపాటి వర్షాలు కురిస్తే రోడ్లన్నీ చిత్తడి అవుతున్నాయి. చిన్నపాటి వర్షాలు కురిసినప్పుడు రోడ్లపైన వర్షపు నీరు చేరి కొన్ని కాలనీలలో చెరువులను తలపిస్తున్నాయి. రోడ్ల పైన నిలిచిన నీటిని దాటేందుకు గ్రామస్తులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొన్ని గ్రామాలలో సరైన డ్రైనేజీలు లేక వర్షపు నీరు రోడ్లపైనే పేరుకుపోయి ఉంటున్నాయి. దీంతో బురదమ యంగా మారి దోమలు వృద్ధి చెంది దుర్గంధ భరితంగా మారుతు న్నాయి. రెబ్బెన మండలం కైరుగం గ్రామంలో రెండు రోజుల క్రితం కురిసిన చిన్నపాటి వర్షానికి రోడ్డుపై వర్షపు నీరు చెరువును తలపిస్తుందని కాలనీలో వృద్ధులు, చిన్నపిల్లలు రోడ్డుపై నుండి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కైరుగాం గ్రామంలో వర్షపు నీరు చేరకుండా డ్రైనేజీలు లేనిచోట డ్రైనేజీలను నిర్మించాలని, రోడ్డుపై మొరంపోసి వర్షపు నీరు ఆగకుండా గ్రామ సర్పంచ్ స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# మొక్కజొన్న పంట నష్ట బాధితులకు అండగా ఉంటాం

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 09 : విద్యుత్ ప్రమాదం వల్ల మొక్కజొన్న పంట కాలి నష్టపోయిన బాధితులకు న్యాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధిత అధికారులు ప్రతిపాదనను సిద్ధం చేసి పంపించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. కోరుట్ల నియోజకవర్గశీ మల్లాపూర్ మండలంలోని వివిరావుపేట గ్రామంలో ఇటీవల గుమ్ముల రాజారెడ్డి అనే రైతు రెండు ఎకరాల మొక్కజొన్న పంట విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల పూర్తిగా కాలిపోగా శనివారం కాలిపోయిన పంట జువ్వాడి కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ.. ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను ఆదుకోవాలని ప్రభుత్వం ఒక ప్రత్యేక పాలసీ తీసుకురావాల్సిన అవసరం ఉందని సంబంధిత మంత్రితో మాట్లాడి బాధితులను ఆదుకుంటామని కృష్ణారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వనతడుపుల పుష్పలత నర్సయ్య, వేంపేట్ సర్పంచ్ గోరుముంతల ప్రవీణ్, స్థానిక మాజీ సర్పంచ్ మిట్టపల్లి జలపతి రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి రాజోజి సదానంద చారి, గడ్డం లక్పతి రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు శేఖర్, నందు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వాహన తనిఖీలు నిర్వహించిన వన్ టౌన్ పోలీసులు

**రోడ్డు ప్రమాదాల నివారణపై వాహనదారులకు అవగాహన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



గోదావరిఖని టౌన్, మే 09 : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫైవ్ ఇంక్లైన్, రమేష్‌నగర్ తదితర ప్రాంతాల్లో గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి, ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా వాహనదారులకు రోడ్డు భద్రతా నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్ వంటి వాహన సంబంధిత పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్ వాహనదారులు సీటుబెల్ట్ ధరించడం ద్వారా ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం తగ్గించుకోవచ్చని వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్ చేయడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, మైనర్ల చేత వాహనాలు నడిపించడం వంటి ప్రమాదకర చర్యలు చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

# జనగణన-2027 విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 09 : జనగణన-2027లో భాగంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. దేశ అభివృద్ధి ప్రణాళికలకు జనగణన అత్యంత కీలకమని తెలిపారు. మే10, రాత్రి 12.00 వరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్ ముగియనున్నందున ప్రతి ఒక్కరు సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవాలన్నారు. 11 నుండి జనగణన ఇంటింటి సర్వే ఉంటుందని ప్రతి ఒక్కరు సహకరించాలని తెలిపారు. ప్రజలు స్వయంగా తమ కుటుంబ వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునే విధానమే సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవాలన్నారు.ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, వనరుల పంపిణీ, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనలో జనగణన సమాచారం కీలక పాత్ర పోషిస్తుందని వారు పేర్కొన్నారు.ప్రజలు సరైన వివరాలను నమోదు చేసి జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా జనాభా ప్రతిపాదికన నిధులు కేటాయించడం లో కూడా జనగణన ఉపయోగపడుతుందని ప్రతి ఒక్కరు ఈ జనగణనను తప్పనిసరిగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవాల్సిందిగా వారు పేర్కొన్నారు.

# పోరుమల్లను ఆదర్శంగా తీసుకొని అన్ని గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

**మెట్‌పల్లి డీఎస్పి అడ్డూరి రాములు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జగిత్యాల, మే 09 : మేడిపెల్లి మండలం పోరుమల్ల గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని మండలంలోని అన్ని గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మెట్పల్లి డిఎస్పి అడ్డూరి రాములు అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా మేడిపల్లి పోలీస్ వారి ఆధ్వర్యంలో శనివారం పోరుమల్ల గ్రామంలో మెట్పల్లి డీఎస్పీ అడ్డూరి రాములు, కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణతో కలిసి 16 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ..సీసీ కెమెరాల విశిష్టతను గుర్తించి పోరుమల్ల గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని, పోరుమల్లను ఆదర్శంగా తీసుకొని మండలంలోని అన్ని గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన దమ్మన్నపేట గ్రామానికి చెందిన షేర్ నగేష్ ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించి, పోలీసు వారికి సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారి వివరాలను స్థానిక పోలీసు వారికి అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి ఎస్ఐ శ్రీధర్ రెడ్డి, పోరుమల్ల సర్పంచ్ అంజన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ వినోద్ యాదవ్, ఉప సర్పంచ్ ప్రణయ్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఏనుగు రమేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి

**మెదక్ శాసనసభ్యులు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే0 9 : చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేయాలని,రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి అని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనాంపల్లి రోహిత్ రావు స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్లోని మీటింగ్ హాల్లో అదనపు కలెక్టర్ నగేష్,వ్యవసాయ,సివిల్ సప్లై, మార్కెటింగ్,ట్రాన్స్పోర్ట్, రెవెన్యూ,పోలీస్,ఇతర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ.. ధాన్యం చివరి గింజలకు కొనాలని,ధాన్యం తరలింపు ప్రక్రియలో ఆలస్యం అవుతుందని,రైస్ మిల్లులో హమాలీల సమస్యను పరిష్కరించుకోవాలని,ధాన్యం తరలింపు ప్రక్రియలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారు తెలుపాలని అధికారులపై ఆగ్రహించారు. రైతులు ధాన్యం తరలింపు పై రోడ్లపైకి వచ్చిన సంఘటన, ధర్నాలు చేసిన విధానం,రైతు పెట్రోల్ బాటిల్ తో రోడ్ల పైకి వచ్చారు ఇలాంటి సంఘటనకు ఎవరు బాధ్యులు అని ప్రశ్నించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటన చేయాలన్నారు. తమది రైతు ప్రభుత్వమని, రైతు సమస్యలపై తప్పకుండా గళం ఎత్తుతామన్నారు. ముఖ్యమంత్రి,మంత్రులు 24 గంటలు రైతుల కోసం అహర్నిశలు శ్రమిస్తున్నట్లు వివరించారు. తాను ప్రజలు,రైతులు ఎన్నుకుంటే వచ్చానని వారికోసం ఎవరినైనా ప్రశ్నిస్తానన్నారు. తక్షణమే అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలను స్పీడ్ అప్ చేయాలని అధికారులు ఆదేశించారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. ధాన్యం సేకరణ సజావుగా నిర్వహిస్తామని,హమాలీల సమస్యను పరిష్కరిస్తామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేపడతామన్నారు. నాలుగైదు రోజుల్లో మరింత స్పీడ్ అప్ చేసి రైస్ మిల్లుల వద్ద అన్ లోడింగ్ ప్రక్రియను సైతం త్వరిత గతిన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రాధికా భూపతి రాజు,వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్,వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- అధికారులు నిఘా పెట్టాలి - సర్పంచ్ మేడం దేవమ్మ బాపు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రామగుండం, మే 9 : రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని నకిలీ విత్తనాలను విక్రయించి రైతుల సొమ్ములను ముంచుతున్న వ్యాపారులపై వ్యవసాయ శాఖ అధికారులునిగా పెంచాలని రైతులు సైతం దృష్టి సారించాలని కుక్కల గూడూరు సర్పంచ్ మేడం దేవమ్మ బాపు అన్నారు శనివారం పాలకుర్తి మండలం కుక్కల గూడూరు గ్రామంలో రైతు వేదిక వద్ద నిర్వహించిన వ్యవసాయ వారోత్సవ సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు రైతులు పంటలు వేసే ముందు వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించి ఏ సమయంలో ఏ పంటలు వేయాలి ఎరువులు ఎలా వాడాలి అనే విషయాలపై అడిగి తెలుసుకోవాలని సర్పంచ్ దేవమ్మ బాపు అన్నారు ఈ కార్యక్రమంలో పాలకుర్తి మండల ఏవో బండి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ శాఖ సిఫారసు చేసిన సన్న రకాలనే రైతులు సాగు చేయాలని కోరారు వాటికి క్వింటాలకు 500 బోనస్ తో పాటు మద్దతు ధర సకాలంలో లభిస్తుందని ప్రమోద్ కుమార్ అన్నారు మార్కెట్లో డిమాండ్ ఉన్న ఆయిల్ ఫామ్ పంట సాగు వైపు రైతులు అడుగు వేయాలని కోరారు పీఎం కుసుమ పథకంతో బీడు భూముల్లో కూడా ఆదాయం పొందవచ్చని అన్నారు ఈ కార్యక్రమంలో బి. శశిధర్ ఏఈఓ (ఇంచార్జ్ కుక్కల గూడూరు) టి ప్రశాంత్ ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ ఆఫీసర్ రైతులు అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

# మోడీ బహిరంగ సభకు భారీ సంఖ్యలో తరలి రావాలి

**బిజెపి పట్టణ అధ్యక్షుడు దొనికేల నవీన్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జగిత్యాల, మే 09 : నేడు హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ లో జరుగనున్న ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభకు బిజెపి శ్రేణులు, మోడీ అభిమానులు భారీ సంఖ్యలో తరలి రావాలని మెట్ పెల్లి బిజెపి పట్టణ అధ్యక్షుడు ధోనికెల నవీన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం నాడు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ నేడు తెలంగాణలో 10 లక్షల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం పరెట్ గ్రౌండ్లో నిర్వహించే భారీ బహిరంగ సభలో పాల్గొంటారని, పెద్ద ఎత్తున స్వాగతం పలికేతందుకు, బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ప్రజలు కార్యకర్తలు మోడీ అభిమానులు తరలి రావాలని పిలుపునిచ్చారు. అభివృద్ధికి కొత్త దిశ చూపుతూ తెలంగాణకు కొండంత భరోసా ఇవ్వడానికి బెంగాల్లో దేశద్రోహులను తరిమికొట్టి దేశ భక్తుల గెలుపుతో వందేమాతరం నినాదాన్ని ప్రపంచానికి చాటి చెప్పి, మొట్టమొదటిసారిగా తెలంగాణ గడ్డమీద అడుగుపెడుతున్న ప్రధాని మోడీకి స్వాగతం పలికి, బహిరంగ సభను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ధర్మపురి స్వరూప వేణుగోపాల్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బొడ్ల ఆనంద్, సీనియర్ నాయకులు మిట్టపల్లి కృష్ణమూర్తి, కలికోట శ్రీకాంత్, పాసికంటి శ్రీనివాస్, బత్తుల జగదీష్, సంభాజీ, వివేక్, కోట నరేష్, మైనారిటీ నాయకులు ఫిరోజ్ అహ్మద్, సంకు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




# బీసీలకు న్యాయం చేయాలి

**రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, మే 9 : దేశంలో బీసీల జనాభాకు అనుగుణంగా హక్కులు అవకాశాలు రాజకీయ సామాజిక ప్రాధాన్యం కల్పించా లంటే కులాల వారి జనగణన అత్యంత అవసరమని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. జనగణనలో బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఓబీసీల ఎంపీల మాజీ కన్వీనర్ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు అంబర్పేట ఆయన నివాసం లో చేపట్టిన నిరాహార దీక్షలో పాల్గొని మాట్లాడారు. బీసీల వాస్తవ జనాభా వివరాలు వెలుగులోకి వస్తేనే వారికి తగిన న్యాయం జరిగే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీల అభ్యున్నతికి బీసీ జనాభా ప్రతిపాదికగా పలుమార్లు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి లేఖలు రాసినా కూడా సరైన స్పందన లేకపోవడంతో ఈ దీక్షకు మాజీ ఎంపీ రాజ్యసభ సభ్యులు వి హనుమంతరావు పూను కోవాల్సి వచ్చిందని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు.



# మార్కెట్ యార్డ్ ను సందర్శించిన దావ వసంత సురేష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 09 : రాయికల్ పట్టణంలోని మార్కెట్ యార్డ్ ను జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ శనివారం సందర్శించి, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మార్కెట్లో మక్కలు పోసి దాదాపు రెండు నెలలు అవుతున్న కూడా ఇప్పటివరకు కొనుగోలు చేయలేదని, అధికార బలంతో కొందరి నాయకుల ధాన్యాన్ని ఇళ్లలో పోసినా కూడా కాంటా చేస్తున్నారని సామాన్య రైతులు మార్కెట్లో పోసిన వాటిని పట్టించుకునే నాధుడే లేదని అన్నారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ కు ఫోన్ లో మాట్లాడి సమస్య తొందరగా పరిష్కరించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని, లేదంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గోపి, మాధవి రాజి రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ తురగ సౌజన్య, శ్రీధర్ రెడ్డి, బర్కాం మల్లేష్, మహిపాల్ రెడ్డి బిఆర్ఎస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం రైల్వే స్టేషన్ లో పోలీసుల తనఖీలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రామగుండం, మే 9 : రామగుండం రైల్వే స్టేషన్లో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పెద్దపల్లి డిసిపి బి రామ్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం రామగుండం సీఐ కృష్ణ కుమార్ ఆధ్వర్యంలో విస్తృత తనఖీలునిర్వహించారు నేరాల నియంత్రణ గంజాయి అక్రమ రవాణా వినియోగం అనుమానాస్పద వ్యక్తుల కదలికలను అరికట్టేందుకే తనఖీలు నిర్వహిస్తున్నామని ప్రయాణి కులు ప్రజలు అనుమాన వ్యక్తుల సంచారం వారి కదలికలను పోలీస్ శాఖకు అందించి సహకరించాలని సిఐ కృష్ణ కుమార్ ఈ సందర్భంగా అన్నారు యువత ప్రజల ఆరోగ్యానికి ప్రాణాలకు హాని కలిగించే మాలిక ద్రవ్యాల రవాణా అలవాటుకు దూరంగా ఉండాలని సిఐ కృష్ణకుమార్ కోరారు రైల్వేస్టేషన్లోని సిసి కెమెరాల పనితీరు హైదరాబాదు మహారాష్ట్ర వైపు నుంచి వచ్చే ప్రయాణికులు ప్రయాణించే రైల్వే బోగీలు అనుమానస్పదంగా కనిపించే ప్రతి పార్సెల్ రవాణా బ్యాగులు ప్రయాణికుల సామాగ్రిని క్షుణంగా పరిశీలించారు రైల్వే శాఖ అధికారులతో స్వయంగా సీఐ కృష్ణ కుమార్ కలిసి సమన్వయంపై మాట్లాడారు.

# గ్రామ దేవతల ఆశీస్సులతో గ్రామస్తులు సుభిక్షంగా ఉండాలి

**నాభిశిల, ముత్యాలమ్మ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



టేకులపల్లి, మే 9 : గ్రామ దేవతల ఆశీస్సులతో గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో జీవిస్తూ దినదినాభివృద్ధి చెందాలని ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆకాంక్షించారు. భద్రాద్రి జిల్లాలోని టేకులపల్లి మండలం బోడు గ్రామపంచాయతీ కేంద్రంలో శనివారం నిర్వహించిన నాభిశిల, ముత్యాలమ్మ ప్రతిష్ఠా పన కార్యక్రమానికి ఆయన హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో ఐకమత్యం, శాంతి నెలకొని ప్రతి కుటుంబం ఆనందంగా జీవించాలని కోరుకున్నారు. గ్రామ దేవతల కరుణతో ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ప్రజలు భక్తి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడం ఆనందదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గ నాయకులు కోరం సురేందర్, టేకులపల్లి వలయాధికారి బత్తు సత్యనారాయణ, టేకులపల్లి, బోడు ఉపవలయాధికారులు ఆలకుంట రాజేంద్ర, శ్రీనివాస్ రెడ్డి, బోడు గ్రామాధ్యక్షురాలు స్వరూప సుధీర్, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా గ్రామమంతా పచ్చని తోరణాలతో అలంకరించబడగా, బంధుమిత్రుల రాకతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# కోయగూడెం, జేవీఆర్ గనుల ప్రైవేటీకరణకు రాజకీయ స్వార్థ ప్రయోజనాలే కారణం

**- సింగరేణి యాజమాన్యాన్ని వేలంపాటలో పాల్గొనకుండా అడ్డుకున్నదే గెలిచిన సంఘాలు**
**- ఏబీకేఎంఎస్ కార్యదర్శి పి. మాధవ నాయక్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం, మే 9 : కోయగూడెం ఓసీ, జేవీఆర్ ఓసీ గనుల ప్రైవేటీకరణకు రాజకీయ స్వార్థ ప్రయోజనాలే ప్రధాన కారణమని ఏబీకేఎంఎస్ కార్యదర్శి పి. మాధవ నాయక్ ఆరోపించారు. సింగరేణి యాజమాన్యం వేలంపాటల్లో పాల్గొని గనులను సంస్థ ఆధీనంలో కొనసాగించే అవకాశం ఉన్నప్పటికీ, రాజకీయ ఒత్తిళ్లతో యాజమాన్యాన్ని అడ్డుకున్నారని విమర్శించారు. భద్రాద్రి జిల్లా ఇల్లందు ఏరియాలోని టేకులపల్లి మండలం కోయగూడెం ఓసీలో శనివారం సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. బి. దశరథం అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాధవ నాయక్ మాట్లాడుతూ, రాజకీయ నాయకులకు అనుబంధంగా ఉన్న పెట్టుబడిదారుల చేతుల్లోకి గనులను అప్పగించేందుకే సింగరేణి యాజమాన్యాన్ని వేలంపాటల్లో పాల్గొనకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. ఈ పరిణామాలకు గెలిచిన సంఘాలైన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీతో పాటు ఇతర సంఘాలే బాధ్యత వహించాలని విమర్శించారు. ఇప్పుడు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు నకిలీ పోరాటాల పేరుతో కార్మికులను మభ్యపెడుతున్నాయని మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటుకు తర్వాత గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం రెండూ కూడా సింగరేణిపై రాజకీయ జోక్యం పెంచి సంస్థను ఆర్థికంగా బలహీనపరిచాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు వినియోగించిన బొగ్గుకు సంబంధించిన బిల్లులను చెల్లించకపోవడంతో సింగరేణి తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి




వెళ్లిందన్నారు. ట్రాన్స్కో, జెన్‌కో తదితర సంస్థలు సింగరేణికి చెల్లించాల్సిన సుమారు రూ.53 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల ప్రధాన సమస్యలైన వైద్య బోర్డులు, సొంతింటి కల, పన్ను రీయింబర్స్‌మెంట్, హోదా విధానాలు, బకాయిల సమస్యలపై గెలిచిన సంఘాలు పోరాటం చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. దేశవ్యాప్తంగా బొగ్గు గని కార్మికుల 12వ వేతన ఒప్పందం కోసం జేబీసీసీఐ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనారోగ్యంతో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు తక్షణమే వైద్య బోర్డులు నిర్వహించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన వ్యవస్థాపక కార్యదర్శి టీఎస్ పవన్ కుమార్, ఇల్లందు ఏరియా ఉపాధ్యక్షుడు నాయిని సైదులు, సంయుక్త కార్యదర్శి బానోతు రాజేష్, బి. దశరథం, హెచ్. హరీష్, పి. రవికుమార్, పి. పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



# పర్సనల్ మేనేజర్ తిరుపతికి ఘన సన్మానం

**తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి–కొత్తగూడెం, మే 9 : సింగరేణి మణుగూరు నుంచి కొత్తగూడెం ఏరియాకు బదిలీపై వచ్చిన పర్సనల్ మేనేజర్ తిరుపతిని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సింగరేణి కొత్తగూడెం ఏరియాలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు గడప రాజయ్య ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా సంఘం ముఖ్య ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పారదర్శకంగా పరిష్కరించాలని, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా విధులు నిర్వహించాలని పర్సనల్ మేనేజర్ తిరుపతిని కోరారు. కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు వసికార్ల కిరణ్, కాగితపు విజయ్ కుమార్, బూర్గుల రవికుమార్, మాదాసు ఈశ్వరయ్య, ఫిట్ కార్యదర్శి సూరజ్, వెంకటేశ్వర్లు, మురళి, విద్యాసాగర్, శ్రీకాంత్, అన్వర్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# లాడ్జి యాజమాన్యాలు నిబంధనలు కచ్చితంగా పాటించాలి

**- ఉల్లంఘిస్తే లైసెన్సు రద్దుతో పాటు చట్టపరమైన చర్యలు - జిల్లా ఎస్పీ రోహిత్ రాజు హెచ్చరిక**






(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం, మే 9 : భద్రాద్రి జిల్లాలో లాడ్జిలను నిర్వహిస్తున్న యాజమాన్యాలు నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ నేర నియంత్రణలో పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే లైసెన్సు రద్దుతో పాటు చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం కొత్తగూడెం పట్టణంలోని వైద్యుల సంఘ భవనంలో జిల్లాలోని లాడ్జి యజమానులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. లాడ్జిల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. ప్రతి అతిథి నుంచి తప్పనిసరిగా ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు పత్రం తీసుకోవాలని, పేరు, పూర్తి చిరునామా, దూరవాణి సంఖ్య, వచ్చిన సమయం, వెళ్లిన సమయాన్ని నమోదు పుస్తకంలో స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. గదుల్లో ఉన్న వారిని కలిసేందుకు వచ్చే సందర్శకుల వివరాలు కూడా స్వీకరించిన తర్వాతే అనుమతించాలని తెలిపారు. విదేశీయులు బస చేస్తే వారి వివరాలను 24 గంటల్లోపు ఆన్‌లైన్ ద్వారా పోలీసులకు సమర్పించాలని, ప్రతిరోజూ ఉదయం సంబంధిత పోలీసు కేంద్రానికి అతిథుల వివరాలు అందజేయాలని సూచించారు. ప్రవేశ ద్వారం, స్వాగత కక్షి, మార్గదారులు, బయట రహదారి కనిపించేలా పనిచేసే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కనీసం 30 రోజుల దృశ్యాలను భద్రపరచాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపించినా, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అగ్నిమాపక భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, హెచ్చరిక అలారం వ్యవస్థ అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. సిబ్బంది వివరాలను పోలీసు ధృవీకరణ చేయించుకోవడం మంచిదని, భద్రతా సిబ్బంది గుర్తింపు పొందిన సంస్థలకు చెందిన వారై ఉండాలని సూచించారు. లాడ్జి నిర్వాహకులు పోలీసులతో సమన్వయం పెంచుకుని నేర నియంత్రణలో భాగస్వాములు కావాలని ఎస్పీ కోరారు.



# వీఓఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**- లేకపోతే నిరవధిక సమ్మె తప్పదు - ఐకేపీ వీఓఏ జేఏసీ హెచ్చరిక**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 9 : తెలంగాణ రాష్ట్రంలోని ఐకేపీ వీఓఏల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈ నెల 18వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడతామని తెలంగాణ ఐకేపీ వీఓఏ జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఐదు మండలాలకు చెందిన వీఓఏ ప్రతినిధులు శనివారం సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, పురపాలక సంఘ అధ్యక్షురాలు రెహానా కమల్ పాషాలకు సత్తుపల్లి శిబిర కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ ఐకేపీ వీఓఏ జేఏసీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమావేశంలో నిరవధిక సమ్మెపై ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నట్లు నాయకులు తెలిపారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లపై స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా శాంతియుత సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు. వీఓఏలకు కనీస వేతనం రూ.20 వేలుగా నిర్ణయించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తిస్తూ సేవా నియమావళి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అర్హులైన వీఓఏలకు పదోన్నతులు కల్పించడం, రూ.20 లక్షల ఆరోగ్య, సాధారణ బీమా సదుపాయం అందించడం, విధుల నిర్వహణకు ట్యాబ్‌లు మంజూరు చేయడం, జీవో సంఖ్య 58లో సవరణలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం తమ సమస్యలను మానవతా దృక్పథంతో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని వీఓఏ జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు.

# జనగణన ప్రతి పౌరుడి బాధ్యత

**- సమగ్ర సమాచారం దేశాభివృద్ధికి పునాది**
**- ఈ నెల 10లోగా ప్రతి ఒక్కరూ స్వీయ గణన పూర్తి చేయాలి**
**- అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 9 : జనగణన ప్రతి పౌరుడి బాధ్యత అని, సమగ్ర సమాచారం దేశాభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. జనగణనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శనివారం ఖమ్మంలోని సర్దార్ పటేల్ క్రీడా మైదానం నుంచి జిల్లా పరిషత్ కేంద్రం వరకు నిర్వహించిన అవగాహన వాక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులు, ప్రజలు, నడకదారులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జనగణనలో భాగంగా స్వీయ గణన ప్రక్రియ ఈనెల 10వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా నమోదు చేసుకొని స్వీయ గణన శాతాన్ని పెంచాలని కోరారు. మే 11వ తేదీ నుంచి ఇంటింటి గణన ప్రారంభమవుతుందని, ఇందులో మొత్తం 34 ప్రశ్నలు ఉంటాయని వివరించారు. ప్రజలు అందించే వివరాలన్నీ పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని, ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని సూచించారు. జనగణనకు సంబంధించిన సహాయ కేంద్రం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి కుటుంబం సరైన సమాచారం అందించి జనగణన విజయవంతానికి సహకరించాలని కోరారు. జనగణన ద్వారా ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై ప్రభుత్వానికి స్పష్టమైన అవగాహన ఏర్పడి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. "మన సమాచారం–మన భవిష్యత్తు" అనే భావనతో ప్రతి ఒక్కరూ జనగణన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రణాళికాధికారి శ్రీనివాస్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, ప్రత్యేక అధికారి శ్రీధర్, ఉప పురపాలక కమిషనర్ శ్రీనివాసరావు, సహాయ పురపాలక కమిషనర్ అనిల్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, క్రీడాకారులు, యువత, విద్యార్థులు, నగర ప్రజలు పాల్గొన్నారు.



# రైతన్నకు మేలు చేసేది ఎన్నడు..?

**- అకాల వర్షాలతో మొక్కజొన్న, ధాన్యం రైతుల ఆవేదన**
**- కొనుగోలు కేంద్రాల్లో అవస్థలు.. గోనె సంచుల భారం రైతులపైనే**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 9 : ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలోని వేంసూరు మండల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎట్టకేలకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనప్పటికీ అకాల వర్షాలు, సరైన సదుపాయాల లేమితో రైతులు కన్నీరు మున్నీరవు తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ధాన్యం, మొక్కజొన్నలను కుప్పలుగా పోసి ఆరబెడుతూ రాత్రింబవళ్లు కాపలా కాస్తున్నారు. చిన్నపాటి చినుకులు పడినా పంట తడిసిపోకుండా కాపాడేందుకు నానా అవస్థలు పడుతున్నారు. అకాల వర్షాల భయం రైతులను నిరంతరం వెంటాడుతోంది. ప్రభుత్వం గోనె సంచులు సమకూర్చడంలో విఫలమవడంతో రైతులే సొంతంగా సంచులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్కో గోనె సంచికి ప్రభుత్వం రూ.13 మాత్రమే చెల్లిస్తుండగా, మార్కెట్‌లో రైతులు రూ.33 వరకు ఖర్చు చేస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద కాటా వేసిన ధాన్యం, మొక్కజొన్న, గోధుమల వద్ద లారీలు, ట్రాక్టర్లు బారులు తీరడంతో రైతులు రోజుల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. సరైన నిల్వ సదుపాయాలు లేకపోవడం, కొనుగోళ్లు నెమ్మదిగా సాగడం రైతుల ఆందోళనను మరింత పెంచుతోంది. తడిసిన ధాన్యానికి మద్దతు ధర కల్పించి, వెంటనే కొనుగోళ్లు పూర్తి చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేసి అకాల వర్షాలతో నష్టపోతున్న రైతన్నను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# స్వీయ జనగణనకు ఒక్కరోజే అవకాశం

**- ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వివరాలు నమోదు చేసుకోవాలి**
**- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, మే 9 : స్వీయ జనగణన నమోదు ప్రక్రియకు ఒక్కరోజే అవకాశం మిగిలి ఉన్నందున ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. 2027 జనగణనలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా స్వీయ గణన చేసుకునేందుకు ఈ నెల 10వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉన్నదని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఇంటి వద్ద నుంచే సులభంగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. మొబైల్ ఫోన్ ద్వారానే ఈ ప్రక్రియను సులభంగా పూర్తి చేయవచ్చని, తమకు నచ్చిన భాషను ఎంపిక చేసుకొని వివరాలు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. గత నెల 26వ తేదీ నుంచి ప్రారంభమైన స్వీయ గణన ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం ఈ నెల 10తో ముగుస్తుందని స్పష్టం చేశారు. జనగణన ప్రక్రియలో భాగంగా ముందుగా స్వీయ గణన, అనంతరం గృహాల లెక్కింపు, తదుపరి పూర్తి జనగణన నిర్వహిస్తారని తెలిపారు. ఈ నెల 11వ తేదీ నుంచి గణన సిబ్బంది ఇంటింటికి వెళ్లి గృహాల జాబితా సేకరణ చేపడతారని వెల్లడించారు. దేశ ప్రణాళిక, భవిష్యత్ అభివృద్ధి, వనరుల పంపిణీకి జనగణన కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. అద్దె ఇళ్లలో నివసిస్తున్న వారు కూడా తమ ప్రస్తుత నివాసం నుంచే వివరాలు నమోదు చేసుకోవచ్చని సూచించారు. ప్రజలు తమ కుటుంబాలకు సంబంధించిన పూర్తి వివరాలను ఖచ్చితంగా అందించాలని, ఈ వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. జనాభా లెక్కల కోసం మాత్రమే ఈ సమాచారాన్ని వినియోగిస్తారని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ నమోదు అనంతరం ప్రత్యేక గుర్తింపు సంఖ్య లభిస్తుందని, ఆ సంఖ్య ఆధారంగా గణన సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని తెలిపారు. ఒక్కరోజే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలందరూ స్వీయ జనగణనలో తప్పనిసరిగా పాల్గొనాలని కలెక్టర్ కోరారు.

# ఉప్పరబోయిన రామ్మూర్తిని పార్టీ నుంచి బహిష్కరించిన న్యూడెమోక్రసీ

**సంయుక్త జిల్లా కార్యదర్శి కందగట్ల సురేందర్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం, మే 9 : సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ చంద్రన్న పార్టీలో భద్రాద్రి జిల్లా కమిటీ సభ్యుడిగా, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఉప్పరబోయిన రామ్మూర్తిని పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం–ఖమ్మం సంయుక్త జిల్లా కమిటీ కార్యదర్శి కందగట్ల సురేందర్ ప్రకటించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత కొంతకాలంగా ఉప్పరబోయిన రామ్మూర్తి పార్టీ వ్యతిరేక, విచ్ఛిన్నకర చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ముఠా పద్ధతులు, ఆర్థిక అక్రమాలు, అనైతిక ధోరణులతో పార్టీని బలహీనపరిచే చర్యలకు దిగుతున్నారని పేర్కొన్నారు. పార్టీ రహస్యాలను ఇతర రాజకీయ శక్తులకు చేరవేస్తూ, నాయకత్వంపై ఒత్తిడి తీసుకొచ్చే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పలుమార్లు పార్టీ పరంగా హెచ్చరించి, తన వైఖరిలో మార్పు తీసుకురావాలని సూచించినప్పటికీ ఎలాంటి మార్పు కనిపించలేదని తెలిపారు. మలుగూరి సుగుణ ఇంకా పార్టీ నిర్మాణంలో కొనసాగుతున్నారని, ఆమెను కూడా ప్రభావితం చేసి తన వెంట తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడని ఆరోపించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాల్సిన సమయంలో విభేదాలను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నాడని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఉప్పరబోయిన రామ్మూర్తిని జిల్లా కమిటీతో పాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వం, ప్రజా సంఘాల బాధ్యతల నుంచి పూర్తిగా తొలగిస్తూ బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఇకపై ఆయనకు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ చంద్రన్న పార్టీతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

# జీవన్ ప్రమాణ్ యాప్‌లో సీఎంపీఎఫ్ఓ ఆప్షన్ నిలిపివేత

**లైఫ్ సర్టిఫికేట్ సమర్పణకు ప్రత్యామ్నాయ విధానం సూచించిన సీఎంపీఎఫ్ అధికారులు.**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 9 : జీవన్ ప్రమాణ్ యాప్‌లో కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (సీఎంపీఎఫ్ఓ) ఆప్షన్ తాత్కాలికంగా అందుబాటులో లేకపోవడంతో సీఎంపీఎఫ్ పెన్షనర్లు లైఫ్ సర్టిఫికేట్ సమర్పణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై సింగరేణి రిటైర్డ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుడు ఎ. బుచ్చి ప్రసాద్ సిపిజిఆర్ఏఎంఎస్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయగా, ధన్‌బాద్ సీఎంపీఎఫ్ కార్యాలయం శుక్రవారం స్పందించింది. కేంద్ర ప్రభుత్వ స్వయంప్రతిపత్తి, చట్టబద్ధ సంస్థల విభాగంలో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా ప్రస్తుతం జీవన్ ప్రమాణ్ యాప్‌లో సీఎంపీఎఫ్ఓ ఆప్షన్ కనిపించడం లేదని అధికారులు వెల్లడించారు. అయితే పెన్షనర్లకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ విధానాన్ని అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఎస్‌బీఐ బ్యాంక్ ద్వారా పెన్షన్ పొందుతున్న సీఎంపీఎఫ్ పెన్షనర్లు తమ హోమ్ బ్రాంచ్ లేదా సమీప ఎస్‌బీఐ శాఖలో లైఫ్ సర్టిఫికేట్ సమర్పించాలని అధికారులు సూచించారు. సంబంధిత బ్యాంకు శాఖ ధృవీకరించిన లైఫ్ సర్టిఫికేట్‌ను cmpf.pension@sbi.co.in లేదా sbi.000668@sbi.co.in ఇమెయిల్ చిరునామాలకు పంపిన అనంతరం ధన్‌బాద్ మెయిన్ బ్రాంచ్‌కు పోస్టు ద్వారా పంపాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే ఎస్‌బీఐ యేతర బ్యాంకుల ద్వారా పెన్షన్ పొందుతున్న సీఎంపీఎఫ్ పెన్షనర్లు కూడా సమీప ఎస్‌బీఐ శాఖలో లైఫ్ సర్టిఫికేట్ సమర్పించవచ్చని పేర్కొన్నారు. సంబంధిత శాఖ కేవైసీ లేదా ఈ–కేవైసీ ఆధారంగా ధృవీకరణ పూర్తి చేసి, పై ఇమెయిల్ చిరునామాలకుపంపినఅనంతరం ధన్‌బాద్‌ప్రధానశాఖకు పోస్టుద్వారా పంపాలని సూచించారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

## - ఫార్మర్ రిజిస్ట్రీపై ప్రత్యేక దృష్టి సారించాలి - విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలి
## - భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్



ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 9 : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగంగా పూర్తి చేయడంతో పాటు విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ధాన్యం కొనుగోలు, ఫార్మర్ రిజిస్ట్రీ, జనగణన, విద్యా వారోత్సవాలపై దృశ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను అన్ని జిల్లాల్లో వంద శాతం పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. స్వీయ జనగణనకు ఒక్కరోజు మాత్రమే గడువు మిగిలి ఉండటంతో ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులందరూ తప్పనిసరిగా స్వీయ గణన పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, కొనుగోలు ప్రక్రియలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 11వ తేదీ నుంచి నిర్వహించే విద్యా వారోత్సవాలను అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. అనంతరం జిల్లా అధికారులతో కలిసి సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యా వారోత్సవాలను ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని, జనగణన కార్యక్రమంపై పర్యవేక్షకులు, గణన సిబ్బందితో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి ప్రేమ్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, మార్కెటింగ్ శాఖ అధికారి నరేందర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కల్లు గీత నుంచి వార్డు మెంబర్ వరకు.. ఎరగాని నాగ శేషు గౌడ్

## వృత్తిని వదల్లేదు... ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్న గుడిబండ యువ నాయకుడు

ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సూర్యాపేట, మే 8 : పేదరికం అతన్ని వెనక్కి నెట్టలేదు.. కష్టాలు అతని ఆత్మవిశ్వాసాన్ని తగ్గించలేదు.. తండ్రి వృత్తినే తన జీవిత మార్గంగా మార్చుకుని ప్రజల మనిషిగా ఎదిగిన యువ నాయకుడు గుడిబండ గ్రామానికి చెందిన ఎరగాని నాగ శేషు గౌడ్. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గుడిబండ గ్రామానికి చెందిన ఎరగాని నాగ శేషు గౌడ్ వయస్సు 30 సంవత్సరాలు. తల్లిదండ్రులు ఆంజనేయులు, వీరమ్మ. చిన్ననాటి నుంచే కుటుంబం పేదరికంతో పోరాడింది. తల్లిదండ్రులు కల్లు గీత వృత్తితో పాటు వ్యవసాయ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించారు. పసివయసులోనే జీవిత కష్టాలు చూసిన నాగ శేషు గౌడ్ చదువుతో పాటు ట్రాక్టర్ పనులు, మెకానిక్ షెడ్లలో పనులు, గ్యాస్ వెల్డింగ్ వంటి పనులు చేస్తూ కుటుంబానికి అండగా నిలిచాడు. మధ్యలో ఆగిపోయిన చదువును మళ్లీ కొనసాగించాలనే పట్టుదలతో ఓపెన్ టెన్త్ పూర్తి చేసి, అనంతరం ఇంటర్ కూడా ఉత్తీర్ణత సాధించాడు. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితులు, తండ్రి మరణం, అన్న నాగరాజు దివ్యాంగుడు కావడం వల్ల కుటుంబ భారం మొత్తం నాగ శేషు గౌడ్‌పై పడింది. దీంతో చదువును అర్థాంతరంగా నిలిపివేసి తండ్రి వృత్తినే తన జీవనాధారంగా స్వీకరించాడు. 2018 నుంచి కల్లు గీత వృత్తిని కొనసాగిస్తున్న నాగ శేషు గౌడ్, కులవృత్తినే గౌరవంగా భావిస్తూ జీవన ప్రయాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నాడు. "తనను పోషించిన వృత్తిని ఎప్పటికీ వదలను" అనే ఆత్మగౌరవంతో ఇప్పటికీ అదే వృత్తిని కొనసాగిస్తున్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న ఆయన, గౌడ సంఘ కార్యకలాపాల్లో ముందుండేవారు. తెలంగాణ రాష్ట్ర కౌడిన్య గౌడ సంఘం అధ్యక్షుడు కేఎల్ఎన్ ప్రసాద్ ఆధ్వర్యంలో కోదాడ మండల కన్వీనర్‌గా సేవలందించారు. తదనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరి 2023లో కోదాడ మండల సోషల్ మీడియా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. గ్రామస్థాయిలో యువతను మమేకం చేస్తూ యూత్ లీడర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కూడా గ్రామ సమస్యలపై అధికార పార్టీ నాయకులతో పోరాడుతూ గ్రామ అభివృద్ధికి కృషి చేశారు. 2025 గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి సహకారంతో నాలుగో వార్డు మెంబర్‌గా గెలుపొందారు. ప్రస్తుతం ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామస్థాయిలో చురుకుగా పనిచేస్తున్నారు. తనలాంటి







ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చేయూత అందిస్తూ, ప్రజల మధ్యనే ఉంటూ సేవలు అందిస్తున్న నాగ శేషు గౌడ్ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. "వృత్తి చిన్నది కాదు.. మనిషి ఆలోచన పెద్దది అయితే ప్రజల మనిషిగా ఎదగొచ్చు" అనే మాటకు నాగ శేషు గౌడ్ జీవితం నిదర్శనంగా నిలుస్తోంది.

స్నేహితులు, గ్రామ ప్రజల మాటల్లో నాగ శేషు గౌడ్..



**పులి శ్రీకాంత్ మాట్లాడుతూ...** "నాగ శేషు గౌడ్ చిన్నప్పటి నుంచి కష్టపడి ఎదిగిన వ్యక్తి. పేదరికంలో పెరిగినా ఎప్పుడూ వెనక్కి తగ్గలేదు. కుటుంబ బాధ్యతల కోసం చదువు ఆపినా, తన లక్ష్యాలను మాత్రం వదల్లేదు. గ్రామంలో ఎవరికైనా అవసరం వచ్చినప్పుడు ముందుండి సహాయం చేస్తాడు. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కూడా వృత్తిని వదలకుండా ప్రజల మధ్యే ఉండటం అతని గొప్పతనం."



**ఎండీ పాషా మాట్లాడుతూ...** "నాగ శేషు గౌడ్ అంటే గ్రామంలో అందరికీ దగ్గరైన వ్యక్తి. యువతను కలుపుకొని గ్రామ సమస్యలపై పోరాడే నాయకుడు. కష్టపడి పనిచేసే స్వభావం వల్లే ప్రజల్లో మంచి గుర్తింపు వచ్చింది. చెట్టు ఎక్కి కల్లు గీసే వ్యక్తి కూడా ప్రజల మద్దతుతో నాయకుడిగా ఎదగొచ్చని నాగ శేషు నిరూపించాడు."గ్రామ ప్రజలు మాట్లాడుతూ నాగ శేషు గౌడ్ రాజకీయాలకు అతీతంగా అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తి అని, ప్రజల సమస్యలపై ఎప్పుడూ స్పందిస్తూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నాడని అభిప్రాయం వ్యక్తం చేశారు.

# రైతులు పండించే ప్రతి ధాన్యం గింజ కొంటాం

## - గూడెం సత్యనారాయణ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడం నా అదృష్టం...
## - ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు...

ప్రజాలక్ష్యం ప్రతినిధి)

లక్షెటిపేట, మే 09 : రైతు పండించే ప్రతి ధాన్యం గింజ రాష్ట్ర ప్రభుత్వంచే కొనిపించే బాధ్యత తనదేనని, రైతులు ఎవరు కూడా అధైర్య పడద్దని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. శనివారం లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని స్థానిక విశ్రాంతిభవన ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. లక్షెట్టిపేట మండలంలో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షం,గాలి వాన బీభత్సంతో మృతి చెందిన నలుగురు రైతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించడం జరిగింది. ఇచ్చిన మాట ప్రకారం శనివారం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి చెక్కులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మరణించిన రైతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. రైతులు ఎవరు కూడా అధైర్య పడద్దని రైతులు పండించే ప్రతి గింజ రాష్ట్ర ప్రభుత్వం చే కొనిపించే బాధ్యత తనదేనని తెలిపారు. రైతులు పంటల మార్పిడి చేయాలని ఎప్పుడు ఒకే పంటను పండించడం ద్వారా భూమిలో సారం తగ్గే అవకాశం ఉందని దాని పంట దిగుబడి తక్కువ వస్తుందని అన్నారు. పంట మార్పిడి ద్వారా అది నివారించవచ్చని రైతులకు సూచించారు. గూడెం



సత్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధి చేయడం నా అదృష్టమని అన్నారు. వచ్చే ఏడాదిలో జరగనున్న పుష్కరాలకు సత్యనారాయణ స్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా మన మంచిర్యాల నియోజకవర్గంలో ఏర్పాటు కాబోతున్న ఫిష్ ప్లాంటేషన్ ద్వారా చాలామంది కుటుంబాలకు ఉపాధి దొరుకుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ షాహిద్ అలీ, జిల్లా ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు నలిమేర రాజు, నాయకులు చెల్ల నాగభూషణం,గడ్డం త్రిమూర్తి, పూర్ణచంద్రరావు, ఆరిఫ్,నర్సయ్య, కౌన్సిలర్లు, కో అప్షన్ సభ్యులు, గ్రామ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# తండ్రి కొడుకుల మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి సీతక్క

ప్రజాలక్ష్యం ప్రతినిధి)

లక్షెటిపేట, మే 09 : ములుగు (గోవిందరావుపేట), మే 9 : ములుగు జిల్లా గోవిందరావు పేట మండలం కర్లపల్లి గ్రామంలో జరిగిన విషాద ఘటనపై మంత్రి సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బావిలో పడి తండ్రి రస్పూర్ రాజు మరియు కుమారుడు పవన్ మృతి చెందడం అత్యంత బాధాకరమని ఆమె పేర్కొన్నారు. ఈ ఘటన వివరాలను తెలుసుకోవడానికి మంత్రి సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి ప్రమాద పరిస్థితులపై సమాచారం సేకరించారు.ఘటనపై తక్షణ చర్యలు తీసుకోవాలని,సమగ్ర విచారణ జరపాలని సూచించారు.అదే విధంగా, బాధిత కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించిన మంత్రి సీతక్క,వారి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.అవసరమైన సహాయ చర్యలు చేపట్టేందుకు అధికారులను ఆదేశించారు.ఈ దుర్ఘటనలో మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ,ఈ కష్ట సమయంలో ప్రభుత్వం పూర్తి మద్దతు అందిస్తుందని మంత్రి సీతక్క పునరుద్ఘాటించారు.

# డీహైడ్రేషన్ నుంచి డయాలసిస్ వరకు కిడ్నీలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత

## - షుగర్, బీపీ ఉన్నవారు అప్రమత్తం కావాలి - కిడ్నీలు దెబ్బతింటే జీవితం కష్టమే
## - కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ రాకేష్ చెన్న



ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మంచిర్యాల, మే 9 : ప్రస్తుత కాలంలో చిన్న వయసులోనే కిడ్నీ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని ప్రముఖ కిడ్నీ వైద్యులు డాక్టర్ రాకేష్ చెన్న ఆందోళన వ్యక్తం చేశారు. జీవనశైలి మార్పులు, షుగర్,బీపీ,తగినంత నీరు తాగకపోవడం,అధిక ఉప్పు వినియోగం, పొగతాగడం, మద్యపానం వంటి కారణాల వల్ల కిడ్నీలు నెమ్మదిగా దెబ్బతింటున్నాయని తెలిపారు. కిడ్నీ సమస్యలు తీవ్రమైన దశకు చేరిన తర్వాత డయాలసిస్ తప్పనిసరి అవుతుందని, అందుకే ముందస్తు జాగ్రత్తలు ఎంతో ముఖ్యమన్నారు.డయాలసిస్ చేయించుకుంటున్న రోగులు ముఖ్యంగా నీటి వినియోగంపై చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రోజుకు శరీరం నుంచి బయటకు వెళ్లే మూత్ర పరిమాణానికి అదనంగా సుమారు 500 మిల్లీలీటర్ల వరకు మాత్రమే నీరు తీసుకోవాలని తెలిపారు. ఎక్కువ నీరు తీసుకుంటే శరీరంలో వాపులు,శ్వాస ఇబ్బందులు, గుండెపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉం టుందని హెచ్చరించారు.అలాగే వైద్యుల సూచన మేరకు ఆహార నియమాలు, మందులు కచ్చితంగా పాటించాలన్నారు. అంతేకాకుండా కిడ్నీ సమస్యలు లేని వారు కూడా నిర్లక్ష్యం చేయకూడదని తెలిపారు. రోజుకు కనీసం 1.5 నుండి 2 లీటర్ల వరకు నీరు తాగడం, సమయానికి మూత్ర విసర్జన చేయడం,శరీరంలో నీరు తగ్గకుండా చూసుకోవడం అవసరమన్నారు.ఎండాకాలంలో డీహైడ్రేషన్ వల్ల మూత్రం గాఢరంగులో రావడం, అలసట,తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదిం చాలని సూచించారు. బీపీ,షుగర్ ఉన్నవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ రెండు వ్యాధులు నియంత్రణలో లేకపోతే కిడ్నీలు త్వరగా దెబ్బతింటాయని తెలిపారు. వైద్యులు సూచించిన మందులు క్రమం తప్పకుండా వాడుతూ,తరచూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.అలాగే జంక్ ఫుడ్, అధిక ఉప్పు,అధిక ప్రోటీన్ ఆహారాన్ని తగ్గించాలని చెప్పారు.రోజుకు 5 గ్రాముల కంటే ఎక్కువ ఉప్పు తీసుకోవద్దని సూచించారు. పొగతాగడం, మద్యపానం, గుట్కా, పొగాకు వంటి అలవాట్లు పూర్తిగా మానేయాలని తెలిపారు. నొప్పి నివారణ మందులు (పెయిన్ కిల్లర్స్) వైద్యుల సలహా లేకుండా ఎక్కువగా వాడకూడదన్నారు. 40 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ కనీసం ఆరు నెలలకు ఒకసారి సియుఈ, ఆర్ఎఫ్టి వంటి కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ రాకేష్ చెన్న సూచించారు. ప్రతి రోజు 30 నుంచి 40 నిమిషాల పాటు నడక లేదా వ్యాయామం చేయడం ద్వారా కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని తెలిపారు."కిడ్నీ సమస్యలు వచ్చిన తర్వాత చికిత్స కంటే, రాకముందే జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో మంచిది. చిన్నచిన్న అలవాట్ల మార్పులతో కిడ్నీలను జీవితాంతం ఆరోగ్యంగా కాపాడుకోవచ్చు" అని డాక్టర్ రాకేష్ చెన్న పేర్కొన్నారు.

# ఖమ్మం రూరల్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా తోట వీరభద్రం

## ఉత్తర్వులు జారీచేసిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ

ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఖమ్మం, మే 9 : కాంగ్రెస్ పార్టీ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడిగా చింతపల్లి గ్రామానికి చెందిన తోట వీరభద్రం ఎంపికయ్యారు. పాలేరు నియోజకవర్గ పరిధిలోని మండలాలు, ఎదులాపురం పురపాలక ప్రాంతాలకు పార్టీ అధ్యక్షులను నియమిస్తూ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడిగా తోట వీరభద్రం ఎంపిక కావడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయడం, కార్యకర్తలను సమన్వయంతో ముందుకు నడిపించే నాయకత్వ లక్షణాలు ఉండటంతో ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. జిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండటంతో పాటు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారని నాయకులు తెలిపారు. మండల స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తోట వీరభద్రం పేర్కొన్నారు.




# రౌడీషీటర్లకు పోలీసుల ప్రత్యేక కౌన్సెలింగ్

## - మాదకద్రవ్యాల పరీక్షల్లో అందరికీ నెగటివ్
## - శ్రీరాంపూర్ సీఐ అశోక్ కుమార్

ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మంచిర్యాల (శ్రీరాంపూర్), మే 9 : రామగుండం కమిషనరేట్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శ్రీరాంపూర్ ప్రాంతానికి చెందిన రౌడీషీటర్లకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని సీఐ అశోక్ కుమార్ ఎస్ఐ సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నియంత్రణలో భాగంగా ఈ కౌన్సెలింగ్ నిర్వహించినట్లు సీఐ తెలిపారు.ఈ సందర్భంగా రౌడీషీటర్లకు భవిష్యత్తులో ఎటువంటి నేర కార్యకలాపాల్లో పాల్గొనరాదని, ప్రజల్లో భయాందోళనలు కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమాజంలో బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తూ మంచి పౌరులుగా జీవించాలని సూచించారు. అనంతరం మాదకద్రవ్యాల వినియోగ నియంత్రణలో భాగంగా వారిని ప్రభుత్వ ఆసుపత్రి మంచిర్యాలకు తరలించి యూరిన్ నార్కోటిక్ డ్రగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో అందరికీ నెగటివ్ ఫలితాలు వచ్చినట్లు పోలీసులు తెలిపారు.మాదకద్రవ్యాల నిర్మూలన, నేరాల నియంత్రణ కోసం పోలీస్ శాఖ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని పేర్కొన్నారు.అనుమానాస్పద కార్యకలాపాలపై ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి యజమానుల ఇళ్లలోపనిచేసే వివరాలను పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయాలి

ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఆసిఫాబాద్, మే 9 : కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పరిధిలో నివసిస్తున్న ఇంటి యజమానులు తమ ఇళ్లలో పని చేయుటకు వంట మనుషులు, సహాయకులు, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులు తదితరులను నియమించుకున్నా లేదా భవిష్యత్తులో నియమించుకోవాలనుకున్నా, ఆయా వ్యక్తుల పూర్తి వివరాలను సమీప పోలీస్ స్టేషన్‌లో తప్పనిసరిగా నమోదు చేయించాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. అదేవిధంగా తమ ఇళ్లలో లేదా భవనాలలో అద్దెకు గదులు ఇచ్చే యజమానులు కూడా అద్దెదారుల పూర్తి వివరాలను ముందస్తుగా స్థానిక పోలీస్ స్టేషన్‌కు తెలియజేసి, పోలీసుల ద్వారా వెరిఫికేషన్ చేయించుకోవాలని ఎస్పీ సూచించారు. ఇటీవలి కాలంలో భద్రతా పరమైన అంశాలను దృష్టిలో ఉంచుకుని, ఇంటి పనుల కోసం నియమించుకునే వ్యక్తుల వివరాలను ముందుగానే పోలీస్ శాఖకు అందించడం ద్వారా అనుమానాస్పద ఘటనలను నివారించవచ్చని ఎస్పీ పేర్కొన్నారు. పని కోసం నియమించుకున్న వ్యక్తుల ఆధార్ కార్డు, ప్రస్తుత నివాస చిరునామా, ఫోటో, మొబైల్ నంబర్ ఇతర వ్యక్తిగత వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయడం ద్వారా యజమానులు భద్రతాపరమైన సమస్యల నుండి రక్షణ పొందవచ్చని తెలిపారు. ముఖ్యంగా నేపాల్‌కు చెందిన వ్యక్తులను ఉద్యోగాల్లో నియమించుకునే సందర్భాల్లో పూర్తి ధృవీకరణ అనంతరమే పనిలోకి తీసుకోవాలని, వారి వివరాలను తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయించాలని సూచించారు. ఇంటి యజమానులు తమ వద్ద పనిచేసే వ్యక్తుల వివరాలను ముందస్తుగా నమోదు చేయించుకుంటే, ఎటువంటి అనుమానాస్పద కార్యకలాపాలు చోటుచేసుకున్నా వెంటనే గుర్తించే అవకాశం ఉంటుందని, తద్వారా ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించవచ్చని ఎస్పీ తెలిపారు. జిల్లా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తెలిపారు.

# మోడీ బహిరంగ సభను విజయవంత చేయండి

## బిజేపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు

ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్ లో జరిగే మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు శనివారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాది రూపాయలతో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పరుస్తున్న నరేంద్ర మోడీ నాయకత్వాన్ని ప్రతి ఒక్కరు బలపరచాల్సిన అవసరం ఉందని అన్నారు. నరేంద్ర మోడీ రాక భారతీయ జనతా పార్టీ శ్రేణులకు కొత్త ఉత్సాహం ఇస్తుందని, ఈ బహిరంగ సభ తో తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులు జరుగుతాయని జోష్యం చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో గతంలో పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని పూర్తిగా అప్పుల పాలు చేసిందని, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని,ఈ రెండు పార్టీల పైన తెలంగాణ ప్రజలకు పూర్తిగా విశ్వాసం పోయిందని తెలిపారు. తెలంగాణ ప్రజలు నరేంద్ర మోడీ పరిపాలన పట్ల విశ్వాసం వ్యక్తం చేస్తూ రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బిజెపికి అండగా నిలబడతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బిజేపి శ్రేణులు, మోడీ అభిమానులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# సినిమా న్యూస్



## డ్రెస్సింగ్ స్టైల్‌తోనే సెగలు రేపుతున్న శోభిత!



ఫ్యాషన్ అంటే కేవలం ఖరీదైన బ్రాండ్లు కాదు, మనం ధరించే దుస్తులను ఎంత హుందాగా క్యారీ చేస్తామనేదే అసలైన ఫ్యాషన్ అని నిరూపిస్తోంది శోభితా ధూళిపాళ. నెట్, ఆర్గాంజా, షీర్ చీరలను ధరించడంలో ఆమెకంటూ ఒక ప్రత్యేక శైలి ఉంది. మనీష్ మల్హోత్రా నుండి సబ్యసాచి వరకు టాప్ డిజైనర్లు రూపొందించిన పారదర్శక దుస్తుల్లో ఆమె కనిపిస్తుంటే, ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ఆ విశేషాలు చూద్దాం.. మనీష్ మల్హోత్రా సిల్వర్ సీక్విన్ మ్యాజిక్: శోభితా ఫ్యాషన్ సెన్స్ గురించి చెప్పాలంటే ఆమెకి ఎవరు సాటి రారనే చెప్పాలి. ఆమె ఫోటో షూట్స్ చుస్తే ఎవరికైనా వావ్ అనాలనిపిస్తుంది. ఇక ఆమె కట్టిన సిల్వర్ సీక్విన్ నెట్ చీర గురించి కచ్చితంగా చెప్పాలి. ప్రముఖ డిజైనర్ మనీష్ మల్హోత్రా రూపొందించిన ఈ సిల్వర్ వర్క్ చీరలో ఆమె ఒక దేవకన్యలా మెరిసిపోయింది. దీనికి జతగా స్వీట్ హార్ట్ నెక్ లైన్ బ్లౌజ్, వేవీ హెయిర్ స్టైల్‌తో ఆమె ఇచ్చిన పోజులు ఇంటర్నెట్‌లో వైరల్ అవుతున్నాయి. నెట్ చీరను ఇంత క్లాసీగా కట్టడం శోభితకే సాధ్యమని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఇటీవల జరిగిన ఒక అవార్డు వేడుకలో శోభితా సబ్యసాచి డిజైన్ చేసిన షీర్ ఎంబ్రాయిడరీ చీరలో కనిపించింది. పారదర్శకమైన ఫ్యాబ్రిక్ మీద అద్భుతమైన ఫ్లోరల్ మోటిఫ్స్, జిగేల్ మనే సీక్విన్ డీటెయిలింగ్‌తో ఉన్న ఈ చీర ఆమెకు ఒక రాయల్ లుక్‌ను ఇచ్చింది. ఆ పిక్ సోషల్ మీడియా లో పోస్ట్ చేయగానే ఫాన్స్ నుండి దిగి వచ్చిన దేవ కన్య లాగ ఉందని కామెంట్స్ తో నింపేశారు. ఇక ఏ రెడ్ కార్పెట్ ఈవెంట్ అయినా, తన సొంత స్టైల్‌తో ఆ వేదికకే ప్రత్యేక ఆకర్షణగా నిలవడం శోభితా ప్రత్యేకత. ఇక కేవలం గ్లామర్ మాత్రమే కాదు, మన భారతీయ సంప్రదాయాన్ని ఆధునిక హంగులతో చూపించడంలో శోభితా ఎప్పుడూ ముందుంటుంది. తోరాణి బ్రాండ్ నుండి వచ్చిన ఆర్గాంజా శారీ సెట్లలో ఆమె లుక్ అద్భుతం. ఇక స్వచ్ఛమైన తెల్లటి ఆర్గాంజా మీద ఆరి ఎంబ్రాయిడరీ చేసిన ఈ చీర, ఆమెకు ఒక వింటేజ్ అందాన్ని ఇచ్చింది. చందేరీ బ్లౌజ్‌తో ఆమె కట్టిన ఈ శైలిని చూసి ఫ్యాషన్ ప్రియులు 'పిక్చర్ పర్ఫెక్ట్' అని ప్రశంసిస్తున్నారు. గోల్డ్ సీక్విన్ హంగామా: మరో ఫోటోషూట్‌లో శోభితా సీమా గుజ్రాల్ డిజైన్ చేసిన గోల్డ్ సీక్విన్ చీరలో ధగధగ మెరిసిపోయింది. దీనికి అమ్రపాలి జ్యువెలరీని జతచేసి పక్కా దేశీ ఫ్యాషన్ ఐకాన్‌లా కనిపించింది. ఇక నితికా గుజ్రాల్ డిజైన్ చేసిన బ్లష్ పింక్ నెట్ చీరలో ఆమె లుక్ చాలా సాఫ్ట్‌గా, ఎలిగెంట్‌గా ఉంది. ఇలా రకరకాల షీర్ ఫ్యాబ్రిక్స్‌ను క్యారీ చేయడంలో శోభితాకు సాటి మరెవరూ లేరని చెప్పాలి. శోభితా ధూళిపాళ అంటేనే ఒక బ్రాండ్ ఆఫ్ క్లాస్ అండ్ గ్రేస్. ఫ్యాషన్ అనేది మనం వేసుకునే బట్టల్లోనే ఉంటుందని, వాటిని ఆత్మవిశ్వాసంతో ధరించినప్పుడే అసలైన అందం వస్తుందని ఆమె నిరూపిస్తోంది. సోషల్ మీడియాలో ఆమె షేర్ చేసే ప్రతి ఫోటో ఒక స్టైల్ స్టేట్‌మెంట్‌గా మారుతోంది. ఆమె ఫొటోస్ క్షణాల్లో వైరల్ అవుతూ, ఆమె క్రేజ్ ను మరోసారి నిరూపించాయి..

## జీక్యూ కవర్‌పేజీపై కృతి స్టన్నింగ్ లుక్



వెండితెరపై తన అద్భుత నటనతో కోట్లాదిమంది అభిమానుల మనసు గెలుచుకున్న నటి కృతి సనన్ ఇప్పుడు వ్యాపార రంగంలోనూ అప్రతిహతంగా దూసుకుపోతోంది. ఇటీవల ముంబైలో జరిగిన ప్రతిష్ఠాత్మక –ఫెమినా బ్యూటీ అవార్డ్స్ 2026– వేడుకలో –బ్యూటీ అంట్రప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్– పురస్కారాన్ని అందుకున్నారు. కేవలం గ్లామర్ ప్రపంచానికే పరిమితం కాకుండా.. ఒక పారిశ్రామికవేత్తగా కృతి సాధిస్తున్న విజయాలు సినిమా రంగానికి ఆవల తనకు ఉన్న బలమైన పనితనాన్ని నిరూపిస్తున్నాయి. స్కిన్ కేర్ రంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుడుతూ కృతి ప్రారంభించిన వ్యాపార ప్రయాణం ఇప్పుడు ఒక మైలురాయిని చేరుకుంది. కృతి సనన్ స్థాపించిన స్కిన్ కేర్ బ్రాండ్ –హైఫన్– అనతి కాలంలోనే సౌందర్య సాధనాల పరిశ్రమలో బలమైన ముద్ర వేసింది. సాధారణంగా సెలబ్రిటీలు బ్రాండ్ అంబాసిడర్లుగా మాత్రమే వ్యవహరిస్తుంటారు.. కానీ కృతి మాత్రం అందుకు భిన్నంగా ఉత్పత్తుల అభివృద్ధి.. బ్రాండ్ విజన్ .. క్వాలిటీ కంట్రోల్ వంటి విషయాల్లో స్వయంగా పాల్గొంటున్నారు. శరీరతత్వాన్ని బట్టి హై–పెర్ఫార్మింగ్ సన్‌స్క్రీన్‌లు, బారియర్ రిపేర్ క్రీమ్‌లు – గ్లో బూస్టింగ్ సీరమ్స్ వంటి వినూత్న ఉత్పత్తులను పరిచయం చేస్తూ వినియోగదారుల నమ్మకాన్ని గెలుచుకున్నారు. తన వ్యాపారాన్ని సామాన్యులకు చేరువ చేయడంలో కృతి అనుసరిస్తున్న వ్యూహాలు అద్భుతమనే చెప్పాలి. ఈ రంగంలో ఇప్పటికే పోటీపడుతున్న దీపిక పదుకొనే, కత్రిన లాంటి సీనియర్లకు భిన్నంగా కృతి తన బ్రాండ్ ని సక్సెస్ చేయడంలో సఫలమైంది. సామాన్యుల చర్మ సమస్యలను అర్థం చేసుకుంటూ.. అందరికీ అందుబాటులో ఉండే ధరలలో నాణ్యమైన ఉత్పత్తులను అందించడంలో విజయవంతమైంది. ఈ పారదర్శకతే తనను ఒక సక్సెస్ ఫుల్ అంట్రప్రెన్యూర్‌గా నిలబెట్టింది. వ్యాపారవేత్తగా బిజీగా ఉన్నా.. కృతి తన గ్లామర్ ప్రపంచాన్ని ఏమాత్రం విస్మరించడం లేదు. తాజాగా ప్రఖ్యాత –జీక్యూ– (+ు) మ్యాగజైన్ కవర్ పేజీపై అదిరిపోయే డిజైనర్ లుక్ తో మెరిసిపోయింది. కృతి రెడ్ టాప్– షార్ట్స్ ధరించి ఇచ్చిన పోజులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ సమ్మర్ కి అనుగుణంగా ఉండే విభిన్నమైన డిజైనర్ దుస్తులను ధరించి ఫోజులిచ్చింది. ఈ బ్యూటీ ఆకర్షణీయమైన రూపంతో పాటు .. తను షేర్ చేస్తున్న వ్యక్తిగత విషయాలు కూడా నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. తాను మనసున్న –రొమాంటిక్– వ్యక్తినని, ప్రేమ – సంబంధాల విషయంలో నమ్మకానికి, నిబద్ధతకు, నిజాయితీకి తాను అత్యంత ప్రాధాన్యతనిస్తానని ఈ సందర్భంగా కృతి వెల్లడించారు. సినిమా రంగంలో అగ్ర హీరోయిన్‌గా రాణిస్తూనే.. వ్యాపార రంగంలో నూతన ఆవిష్కరణలతో ముందుకు సాగుతున్న కృతి సనన్ ప్రయాణం బహుముఖ ప్రజ్ఞకు నిదర్శనం. ఒకవైపు కళాత్మక రంగం.. మరోవైపు సాంకేతికతతో కూడిన స్కిన్ కేర్ బిజినెస్.. రెండింటినీ సమతుల్యం చేస్తూ ఈ బ్యూటీ సాగిస్తున్న ప్రస్థానం నేటి యువతకు గొప్ప స్ఫూర్తినిస్తోంది. పట్టుదల.. స్పష్టమైన విజన్ ఉంటే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చని కృతి సనన్ నిరూపిస్తున్నారు. 2026లో కృతి అందుకున్న ఈ పురస్కారం కెరీర్‌లో మరొక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుంది. కాక్ టెయిల్ 2లో కృతి సనన్ నయా గ్లామర్‌లి 2026 జూన్ 19న విడుదల కాబోతున్న –కాక్ టెయిల్ 2– చిత్రంలో కృతి సనన్ అల్లీ అనే అత్యంత స్టైలిష్– బోల్డ్ పాత్రలో కనిపిస్తోంది. ఈ సినిమా 2012 నాటి ఒరిజినల్ చిత్రానికి సీక్వెల్ కాకపోయినా అదే తరహా ఆధునిక స్నేహబంధాలు..

## బికినీలో పూజా హెగ్డే స్టన్నింగ్ లుక్ -- ఫ్యాన్స్ ఫిదా!



టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డే సోషల్ మీడియాలో సెగలు రేపుతోంది. వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఈ భామ, తాజాగా షేర్ చేసిన బోల్డ్ అండ్ స్టైలిష్ ఫోటోలు ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. కలర్‌ఫుల్ బికినీ టాప్, డెనిమ్ షార్ట్స్‌లో పూజా తన అందచందాలతో నెటిజన్లను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. "ఒక మంచి స్టూడెంట్‌లా నేను ఈ అసైన్‌మెంట్‌ను చాలా సీరియస్‌గా తీసుకున్నాను" అంటూ ఆమె ఇచ్చిన క్యాప్షన్ ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. ఆ విశేషాలు చూద్దాం.. బికినీలో సెగలు రేపుతున్న బుట్టబొమ్మ: పూజా హెగ్డే అంటేనే గ్లామర్‌కు కేరాఫ్ అడ్రస్. తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఫోటోలు చూస్తుంటే కుర్రకారుకు చెమటలు పట్టడం ఖాయం. 'అగువా బెండిటా మాలోరీ హార్వెస్ట్' బ్రాండ్‌కు చెందిన మల్టీ కలర్ ఫ్లోరల్ ప్రింట్ బికినీ టాప్‌లో ఆమె మెరిసిపోతోంది. ఇక దానికి జతగా లో–రైజ్ డెనిమ్ షార్ట్స్, నడుముకి సన్నని చైన్ ధరించి పక్కా బీచ్ లుక్‌లో స్టన్నింగ్‌గా కనిపిస్తోంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫోటోలు: కేవలం ఫోటోలే కాకుండా, పూజా ఇచ్చిన కాన్ఫిడెంట్ పోజులు ఆమె ఫ్యాన్స్ మనసు గెలుచుకుంటున్నాయి. ఫోటోలకు ఆమె జోడించిన క్యాప్షన్ కూడా ఫన్నీగా ఉండటంతో లైకులు, కామెంట్లతో సోషల్ మీడియా హోరెత్తిపోతోంది. ఇక ఈ రేంజ్ గ్లామర్ షో చూసిన అభిమానులు "పూజా ఈజ్ బ్యాక్" అంటూ కామెంట్స్ చేస్తున్నారు. తన ఫిట్‌నెస్‌తో పూజా టెంపరేచర్‌ను ఒక్కసారిగా పెంచేసింది. బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ హిస్టరీ: తెలుగులో పూజా హెగ్డేకు తిరుగులేని క్రేజ్ ఉంది. 'అల వైకుంఠపురములో', మహర్షి, అరవింద సమేత, దువ్వాడ జగన్నాథం వంటి బ్లాక్ బస్టర్ హిట్లతో ఆమె స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. గ్లామర్‌తో పాటు తన నటనతోనూ ప్రేక్షకులను మెప్పించి టాలీవుడ్ టాప్ లీగ్‌లో నిలబడింది. కేవలం ఇక తెలుగులోనే కాదు, తమిళంలో విజయ్ సరసన 'బీస్ట్' సినిమాతో, గత ఏడాది కూలి సినిమాలో ఓ సాంగ్ తో నూ సూపర్ సక్సెస్ అందుకుంది. చేతినిండా క్రేజీ ప్రాజెక్టులు: ప్రస్తుతం పూజా తన కెరీర్‌లో వరుస సినిమాలతో దూసుకుపోతోంది. కోలీవుడ్ స్టార్ విజయ్‌తో ఆమె నటించిన 'జన నాయగన్' చిత్రం త్వరలోనే విడుదల కాబోతోంది. ఇక బాలీవుడ్‌లో వరుణ్ ధావన్ సరసన 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' అనే చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమా జూన్ 4న థియేటర్లలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉంది. వరుసగా పెద్ద ప్రాజెక్టులు చేతిలో ఉండటంతో పూజా ఫ్యాన్స్ ఫుల్ ఖుషీగా ఉన్నారు. మొత్తానికి పూజా హెగ్డే తన గ్లామర్ అండ్ స్టైల్‌తో మరోసారి టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, సోషల్ మీడియా ద్వారా తన అభిమానులను ఎలా అలరించాలో ఈ బుట్టబొమ్మకు బాగా తెలుసు. జూన్ నెలలో ఆమె నటించిన సినిమాలు రాబోతుండటంతో బాక్సాఫీస్ వద్ద పూజా ఎలాంటి హవా చూపిస్తుందో వేచి చూడాలి!

## సమంత ట్రెండీ ఫోటోషూట్ - సోషల్ మీడియాలో సెగలు!



టాలీవుడ్ క్వీన్ సమంత రూత్ ప్రభు మరోసారి తన గ్లామర్‌తో ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నారు. 'ది నాడ్' మ్యాగజైన్ మే 2026 కవర్ షూట్ కోసం ఆమె చేసిన ఫోటోషూట్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. మెటాలిక్ గౌన్ నుండి ముత్యాల డ్రెస్ వరకు సమంత ధరించిన ప్రతి అవుట్‌ఫిట్ ఒక అద్భుతంలా ఉంది. కేవలం గ్లామర్ మాత్రమే కాదు, సినిమాల్లో మహిళల ప్రాధాన్యత గురించి ఆమె చెప్పిన మాటలు అభిమానుల మనసు గెలుచుకుంటున్నాయి. మంచులో మెరిసిన దేవత: సమంత ఈ ఫోటోషూట్‌లో చాలా డిఫరెంట్ లుక్స్‌లో కనిపించారు. ముఖ్యంగా డీప్ నెక్ లైన్‌తో ఉన్న మెటాలిక్ మెష్ గౌన్‌లో ఆమెను చూస్తుంటే ఒక దేవతలా అనిపిస్తోంది. ఆమె చుట్టూ ఉన్న మంచు దిమ్మెలు, ఆ డ్రెస్ కి వున్న అద్దాల టాసెల్స్ ఒక డ్రామాటిక్ ఎఫెక్ట్‌ను ఇచ్చాయి. సమంత ఫేస్ ఎప్పుడూ పర్ఫెక్ట్ అని, ఈ షూట్‌లో ఆమె లుక్ చూస్తే అది మరోసారి రుజువైందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ముత్యాల డ్రెస్సులో మెరిసిపోతూ: మరో లుక్‌లో సమంత ఐవరీ కలర్ ముత్యాల డ్రెస్సులో దేవకన్యలా మెరిసిపోయారు.

# ఆరోగ్యం

## ఆ మాంసం ఎక్కువ తింటే డయాబెటిస్ ముప్పు!




ప్రస్తుత సమాజంలో డయాబెటిస్ బాధితులు రోజురోజుకీ పెరిగిపోతున్నారు. డయాబెటిస్ మన సమాజాన్ని పట్టి పీడిస్తున్న మహమ్మారిలా తయారైంది. ప్రస్తుత మన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, పని ఒత్తిడి, శారీరక వ్యాయామం లేకపోవడం అంటే అనేక కారణాలు మనలను డయాబెటిస్ బాధితులుగా మారుస్తున్నాయి. అసలు డయాబెటిస్ ఎందుకు వస్తుంది? ఎటువంటి కారణాలతో డయాబెటిస్ వస్తుంది అంటే. డయాబెటిస్ రావటానికి ఈ ఆహారం కారణం డయాబెటిస్ రావడానికి మనం తీసుకునే ఆహారం కూడా కారణమని అనేక అధ్యయనాలు తెలిపాయి. చాలామంది మాంసాహారాన్ని ఇష్టంగా తింటారు. రెడ్ మీట్ ను, ప్రాసెస్ చేసిన మీట్ ను తరచూ తినేవారు ఉన్నారు. అటువంటివారు కచ్చితంగా ఈ విషయం తెలుసుకోవాల్సిందే. ఇంగ్లాండులోని కేంబ్రిడ్జి యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్లు డయాబెటిస్ ఏ ఆహారం తినేవారికి ఎక్కువ వస్తుందని 20 దేశాలలో 31 అధ్యయనాలు చేశారు. రెడ్ మీట్ తినేవారిలో ఎక్కువ డయాబెటిస్ రిస్క్ ఆ అధ్యయనాలలో ప్రతిరోజు ప్రాసెస్ చేసిన రెడ్ మీట్ తినేవాళ్ళల్లో డయాబెటిస్ వచ్చే ఛాన్స్ ఎక్కువగా ఉంటుందని తెలిపారు. మొత్తం 19.7 లక్షల మంది పైన డయాబెటిస్ పరీక్షలు నిర్వహించిన వారు ఈ పరిశోధనలో ప్రతిరోజు 50 గ్రాముల ప్రాసెస్ చేసిన మీట్ తీసుకున్న వారిలో 15% డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని తేల్చారు. అధ్యయనం తేల్చిందిదే ఇక ప్రతిరోజు 100 గ్రాముల ప్రాసెస్ చేసిన ఎర్ర మాంసం తిన్న వారిలో డయాబెటిస్ వచ్చే ప్రమాదం మరో 10 శాతం పెరుగుతుందని తేల్చారు. ఇక అలాగే 100 గ్రాముల పౌల్ట్రీ మాంసం తినే వారిలో డయాబెటిస్ వచ్చే ప్రమాదం మరో ఎనిమిది శాతం పెరిగిందని అధ్యయనంలో వెల్లడైంది. డయాబెటిస్ రాకుండా ఉండాలంటే ప్రాసెస్ చేస్తున్న రెడ్ మీట్ ను తక్కువగా తినాలని సూచిస్తున్నారు. ఈ మాంసం తినొద్దు ప్రాసెస్ చేసిన ఎర్ర మాంసం టైప్ టు డయాబెటిస్ వచ్చే ప్రమాదాన్ని 62% పెంచుతుందని అధ్యయనాలలో వెల్లడైనట్టుగా పేర్కొన్నారు. కనుక మాంసం ప్రియులు టైప్ టు డయాబెటిస్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. సాధ్యమైనంత వరకు ప్రాసెస్ చేసిన ఎర్ర మాంసాన్ని తినకుండా ఉంటేనే మంచిది.

## చికెన్ సుక్కా..

నాన్ వెజ్ లో అనేక రకాలు ఉంటాయి. చికెన్ తో రకరకాల వంటకాలు తయారుచేస్తుంటారు. అలాంటివాటిల్లో చికెన్ సుక్కా ఒకటి. చికెన్ సుక్కా ఒక్కసారి తిన్నారంటే మళ్లీ మళ్లీ తినాలని నాలుక పీకేస్తుంటది. అంత రుచికరంగా ఉంటుంది. చికెన్ సుక్కాను రెస్టారెంట్లలో తినాలంటే భారీగా ఖర్చుపెట్టాల్సిందే. అయితే దీనిని ఇంట్లోనే చాలా ఈజీగా తయారుచేసుకోవచ్చు. ఇది రుచికరంగా ఉండటమే కాకుండా, ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. ఇంట్లోనే చికెన్ సుక్కా తయారీకి కావలసిన పదార్థాలు, తయారీ విధానం ఇక్కడ చూడండి.

**చికెన్ సుక్కా తయారీకి కావలసిన పదార్థాలు చికెన్: 1 కిలో (చిన్న ముక్కలుగా కోసినవి) ఉల్లిపాయలు: 2 (సన్నగా తరిగినవి) పచ్చిమిర్చి: 4 (సన్నగా తరిగినవి) అల్లం వెల్లుల్లి పేస్ట్: 2 టేబుల్ స్పూన్లు కారం: 2 టేబుల్ స్పూన్లు పసుపు: 1/2 టీస్పూన్ ధనియాల పొడి: 1 టేబుల్ స్పూన్ జీలకర్ర పొడి: 1/2 టీస్పూన్ గరం మసాలా: 1/2 టీస్పూన్ కరివేపాకు: కొద్దిగా కొత్తిమీర: కొద్దిగా (సన్నగా తరిగినది) నూనె: 3 టేబుల్ స్పూన్లు ఉప్పు: రుచికి సరిపడా.**



**చికెన్ సుక్కా తయారీ విధానం –మొదటగా చికెన్ ముక్కలను శుభ్రంగా కడిగి, పక్కన పెట్టుకోవాలి. –తర్వాత స్టవ్ మీద పాన్ పెట్టి ఆయిల్ పోసి వేడి చేయాలి. –ఆయిల్ వేడెక్కిన తర్వాత అందులో సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి వేసి బంగారు రంగు** వచ్చేవరకు వేయించాలి. –తర్వాత అందులో అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చి వాసన పోయే వరకు వేయించాలి. –ఇప్పుడు అందులో చికెన్ ముక్కలు వేసి బాగా కలపాలి. –తర్వాత అందులో కారం, పసుపు, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరం మసాలా, ఉప్పు వేసి బాగా కలపి మూత పెట్టి 10 నిమిషాలు ఉడికించాలి. –తర్వాత మూత తీసి చికెన్ ముక్కలు మెత్తబడే వరకు ఉడికించాలి. –తర్వాత అందులో కరివేపాకు, కొత్తిమీర వేసి కలపాలి. –ఆయిల్ పైకి తేలే వరకు ఉడికించాలి. అంతే చికెన్ సుక్కా రెడీ. చికెన్ ముక్కలు బాగా వేగితే, సుక్కా మరింత రుచిగా ఉంటుంది. రుచి కోసం, కొద్దిగా నిమ్మరసం కలపవచ్చు. అన్నం, చపాతీ, రోటీతో కలిపి తింటే చాలా రుచికరంగా ఉంటుంది. –నాటుకోడితో చేస్తే ఇంకా రుచిగా ఉంటుంది. కాజు, బాదం వంటి డ్రై ఫ్రూట్స్,కొబ్బరి తురుము వేసి కూడా చేయవచ్చు. పెరుగు వేసి కూడా చేయవచ్చు.

## కోడిగుడ్డు ఎల్లిపాయ కారం



కోడిగుడ్డు ఎల్లిపాయ కారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో చాలా ప్రసిద్ధి చెందిన వంటకం. కోడిగుడ్డు ఎల్లిపాయ కారంను అన్నం, చపాతీ, రోటీతో కలిపి తింటే చాలా రుచికరంగా ఉంటుంది. ఇది పిల్లల నుండి పెద్దల వరకు అందరూ ఇష్టపడే వంటకం. ఇది రుచికరంగా ఉండటమే కాకుండా, ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. ఈ వంటకంలో ఉపయోగించే మసాలాలు జీర్ణక్రియను మెరుగుపరచుతుంది. కోడిగుడ్డు ఎల్లిపాయ కారం తినడం వల్ల శరీరానికి కావాల్సిన పోషకాలు అందుతాయి. దీనిని ఇంట్లోనే చాలా ఈజీగా తయారుచేసుకోడానికి కావలసిన పదార్థాలు, తయారీ విధానం ఇక్కడ చూడండి.

కోడిగుడ్డు ఎల్లిపాయ కారం తయారీకి కావలసిన పదార్థాలు కోడిగుడ్లు: 6 ఉల్లిపాయలు: 2 (సన్నగా తరిగినవి) వెల్లుల్లి రెబ్బలు: 10–12 ఎండుమిర్చి: 8–10 కారం: 2 టేబుల్ స్పూన్లు పసుపు: 1/2 టీస్పూన్ జీలకర్ర: 1 టీస్పూన్ ఆవాలు: 1/2 టీస్పూన్ నూనె: 3 టేబుల్ స్పూన్లు ఉప్పు: రుచికి సరిపడా కరివేపాకు: కొద్దిగా కొత్తిమీర: కొద్దిగా (సన్నగా తరిగినది)

తయారీ విధానం –కోడిగుడ్డు ఎల్లిపాయ కారం తయారుచేయడానికి మొదటగా మొదటగా కోడిగుడ్లను ఉడికించి చల్లారాక పొట్టు తీసి, వాటిని పెద్ద ముక్కలుగా కోయాలి. –వెల్లుల్లి కారం కోసం, వెల్లుల్లి రెబ్బలు, ఎండుమిర్చి, కారం, జీలకర్ర, ఉప్పు వేసి మిక్సీలో మెత్తగా రుబ్బుకోవాలి.తర్వాత –స్టవ్ మీద పాన్ పెట్టి ఆయిల్ వేడి చేయాలి. ఆవాలు, జీలకర్ర, కరివేపాకు వేసి వేయించాలి. కొద్దిసేపటి తర్వాత తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి.

–తర్వాత అందులో పసుపు వేసి కలపాలి. –రుబ్బిన వెల్లుల్లి కారం వేసి నూనె పైకి తేలే వరకు వేయించాలి. –కోడిగుడ్డు ముక్కలు వేసి, మసాలా బాగా పట్టేలా కలపాలి. –తర్వాత అందులో రుచికి సరిపడా ఉప్పు వేసి, రెండు నిమిషాలు ఉడికించ కొత్తిమీరతో గార్నిష్ చేస్తే కోడిగుడ్డు ఎల్లిపాయ కారం రెడీ.

## అయిదు నిమిషాల్లో సూపర్ టేస్టీ ఎగ్ బుర్జీ..

గుడ్డుతో నానా రకాల రెసిపీస్ చేస్తుంటారు. కేవలం బ్యాచిలర్స్ మాత్రమే కాదు, ఇంటిల్లిపాది కుటుంబ సభ్యులందరూ కలిసి తినే వంటకాల్లో గుడ్డు రెసిపీస్ కూడా ఒకటి. గుడ్డుతో చేసుకుని తినే రెసిపిల్లో ఎగ్ బుర్జీ కూడా ఒకటి. ఇది తినడానికి చాలా రుచికరంగా ఉంటుంది. చేసుకోవడం కూడా చాలా సులభం. కేవలం సులభమైన పద్ధతిలో అయిదే అయిదు నిమిషాల్లో దీనిని చేసుకోవచ్చు. కానీ ఎలా చేసుకోవాలో తెలియదు. అందుకే ఈ స్టోరీలో ఎగ్ బుర్జీ ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి? అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.



**ఎగ్ బుర్జీ తయారీకి కావాల్సిన పదార్థాలు**

కోడిగుడ్లు: 2–3 ఉల్లిపాయ: 1 (చిన్నగా తరిగినవి) పచ్చిమిర్చి: 1–2 (సన్నగా తరిగినవి) నూనె: 2 టేబుల్ స్పూన్లు పసుపు: చిటికెడు కారం: రుచికి తగినంత ఉప్పు: రుచికి తగినంత కొత్తిమీర: కొద్దిగా (సన్నగా తరిగినది)

తయారుచేసే విధానం: ముందుగా ఒక గిన్నెలో గుడ్లను పగలగొట్టి, అందులో ఉప్పు, పసుపు, కారం వేసి బాగా కలపాలి. స్టవ్ మీద బాణలి పెట్టి నూనె వేడి చేయాలి. నూనె వేడయ్యాక ఉల్లిపాయ, పచ్చిమిర్చి వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. తర్వాత కలిపి పెట్టుకున్న గుడ్డు మిశ్రమాన్ని వేసి బాగా కలపాలి. గుడ్డు బాగా ఉడికి, పొడిపొడిగా అయ్యేవరకు కలుపుతూ వేయించాలి. చివరగా కొత్తిమీర వేసి కలపాలి. అంతే వేడి వేడి ఎగ్ బుర్జీ రెడీ.

## ఇలాంటి అన్నం తింటే అసలు అన్నం మర్చిపోతారు



ఉరుకుల పరుగుల జీవితంలో చాలా మందికి వంట చేసుకునే సమయం కూడా ఉండడం లేదు. అలాగే చాలా మంది బ్యాచ్‌లర్స్‌కు కూడా వంట చేసుకోవడం రాకపోవడం వలన, ఎక్కువగా బయటి ఫుడ్స్‌కు అలవాటు పడిపోతున్నారు. అయితే ఈ స్టోరీలో కేవలం అయిదు నిమిషాల్లో ఇంట్లో ఎలాంటి కూరగాయలు లేకపోయినా.. సులభంగా కారం అన్నం చేసుకోవచ్చు. ఈ కారం అన్నం ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

**కారం అన్నం తయారీకి కావాల్సిన పదార్థాలు**

ఉడికించిన అన్నం: 2 కప్పులు ఉల్లిపాయ: 1 (సన్నగా తరిగినవి) పచ్చిమిర్చి: 2 (సన్నగా తరిగినవి) కారం: 1–2 టీస్పూన్లు (రుచికి తగినంత) పసుపు: అర టీస్పూన్ ఆవాలు: 1 టీస్పూన్ జీలకర్ర: అర టీస్పూన్ శనగపప్పు: 1 టీస్పూన్ మినపప్పు: 1 టీస్పూన్ కరివేపాకు: 2 రెబ్బలు నూనె: 2 టేబుల్ స్పూన్లు ఉప్పు: రుచికి తగినంత

**తయారుచేయు విధానం:** ముందుగా స్టవ్ మీద బాణలి పెట్టి నూనె వేడి చేయాలి. అందులో ఆవాలు, జీలకర్ర, శనగపప్పు, మినపప్పు వేసి వేయించాలి. తర్వాత ఉల్లిపాయ, పచ్చిమిర్చి, కరివేపాకు వేసి ఉల్లిపాయలు బంగారు రంగులోకి వచ్చేవరకు వేయించాలి. అనంతరం పసుపు, కారం, ఉప్పు వేసి బాగా కలపాలి. ఇప్పుడు అందులో ఉడికించిన అన్నం వేసి బాగా కలపాలి. 2–3 నిమిషాలు వేడి చేసి దించేయాలి. అంతే, కారం అన్నం రెడీ.

## వేముల సమక్షంలో బిఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ నేతలు

నిజామాబాద్,మే9 : మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలోని ఎర్గట్ల మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సున్నపు అంజయ్య, జిట్టావోయినా రాజు, నాయుడు పోశెట్టికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్నా వాటిని సక్రమంగా అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

## నేడు ప్రధాని బహిరంగ సభ

మొదటి పేజీ తరువాయి

భద్రతా కారణాల దృష్ట్యా సభా ప్రాంగణంలోకి డ్రోన్లు, కెమెరాలు, బ్యాగులను తీసుకురావడంపై నిషేధం విధించారు. బహిరంగ సభ దృష్ట్యా.. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9 గంటల వరకూ పరేడ్ గ్రౌండ్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని సీపీ స్పష్టం చేశారు. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు పడకుండా ముందుగానే ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రోడ్లపై ఎక్కడైనా వాహనాలను పార్క్ చేస్తే.. వాటిని వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు. సభకు వచ్చే వారి కోసం ప్రత్యేకంగా 12 పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేశామని, వాహనదారులు పార్కింగ్ స్థలాలను సులభంగా గుర్తించేందుకు వీలుగా అక్కడ క్యూఆర్ (ఖీఖీ) కోడ్‌లను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని వాహనదారులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని కోరారు.

## రైతులంటే పట్టింపులేని సిఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి

తిరుగుడు, మక్కలు ఎలా కొనుగోలు చేస్తున్నారో చూడడానికి ఒక్క మంత్రి కూడా రైతుల దగ్గరికి రాలేదని మాజీ మంత్రి మండిపడ్డారు. ప్రభుత్వానికి రైతుల కంటే ముఖ్యమైన పని మరేముంటుందని ప్రశ్నించారు. సిద్దిపేట, చిన్నకోడూరు మండలాల్లో సన్‌ఫ్లవర్ రైతులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం అని తేడా లేకుండా రైతులు పండించిన పంటను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి పంట మార్పిడి చేయాలని చెబుతున్నారని.. పంట మార్పిడి చేస్తే కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా సూర్యాపేట, సిద్దిపేట, జాలి తదితర ప్రాంతాల్లో వడ్లను బి గ్రేడ్ పేరుతో, తరుగు పేరుతో రైతులకు నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. 'రేవంత్ రెడ్డి.. మాటలు బంద్ చేసి ఐకేపీ సెంటర్ దగ్గరికి వెళ్లి రైతులతో నేరుగా మాట్లాడాలి. 40 రోజులుగా సన్‌ఫ్లవర్ కొనుగోలు చేయకపోవడంతో పంటకు చెదలు పడుతున్నాయి' అని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పట్టణ జనాభాకు అనుగుణంగా వసతులు

మొదటి పేజీ తరువాయి

అవసరం ఉందని సీఎం వెల్లడించారు. పార్కింగ్ ఇబ్బందులను అధిగమించేందుకు నగరంలో మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని మూడు భాగాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ప్యూర్,క్యూర్, రేర్ అభివృద్ధిని మూడు భాగాలుగా విభజించుకున్నామన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు ఏరియాను సర్వీస్ సెక్టార్‌గా గుర్తించా మన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు బయట, రీజనల్ రింగ్ రోడ్డు లోపల ఉన్న ఏరియాను మాన్యూఫ్యాక్చర్ సెక్టార్‌గా గుర్తించామని తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్డు బయట ఉన్న ఏరియాను అగ్రికల్చర్ సెక్టార్‌గా గుర్తించామని అన్నారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధికి సంబంధించి తెలంగాణ రైజింగ్–2047 మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరించుకున్నామని ముఖ్యమంత్రి అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు మన సంస్కృతికి అనుసంధానం చేయబోతున్నట్లు తెలిపారు. నగరంలో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో ఆర్టీసీలో ఈవీ బస్సులను తీసుకొస్తున్నామని అన్నారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ఆటోలకు ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేయించి ఈవీ వాహనాలుగా మార్చబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆధునికీకరణ, పట్టణీకరణతో భవిష్యత్‌లో మరిన్ని కొత్త సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో నిర్వహించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిటీ ఛైర్మన్ మాగుంట శ్రీనివాసులురెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరయ్యారు. గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాలపై సమావేశంలో చర్చించారు.

## ఎట్టకేలకు తమిళనాడు ఉత్కంఠకు తెర

మొదటి పేజీ తరువాయి

నియమిస్తూ లేఖలను అందించారు. దాదాపు గంటా నలభై నిముషాలు వీరి భేటీ జరిగింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత కీలక మలుపులు తిరిగిన అత్యధిక స్థానాలు గెలిచిన విజయ్ నేతృత్వంలోని టీవీకేకు కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ మద్దతు తెలపడంతో ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ లైన్ క్లియర్ చేశారు. ఈ మేరకు తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్‌ను నియమిస్తూ లోక్‌భవన్ ఓ ప్రకటన విడుదల చేసింది. శనివారం గవర్నర్‌ను కలిసి తమకు మద్దతిచ్చిన పార్టీల లేఖలను అందజేసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని విజయ్ కోరారు. మెజార్టీ మార్క్ (118)కు చేరుకోవడంతో గవర్నర్ సమ్మతించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు చెన్నైలోని నెహ్రూ స్టేడియం వేదికగా టీవీకే చీఫ్ విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మే 13వ తేదీలోగా బల నిరూపణ చేసుకోవాలని సూచించారు. దీంతో ఇక తమిళనాడులో విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వం ఈనెల 10న కొలువు తీరనుంది. గవర్నర్ అపాయిమెంట్ ఇవ్వడంతో శనివారం సాయంత్ర లోక్‌భవన్‌లో ఆయనను విజయ్ కలుసుకున్నారు. టీవీకేకు మద్దతిస్తున్న కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, వీసీకే, ఐయూఎంఎల్ నేతలు కూడా విజయ్ వెంట గవర్నర్‌ను కలిశారు. ఎమ్మెల్యేల మద్దతు లేఖలను విజయ్ గవర్నర్‌కు అందజేశారు. ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతించాలని కోరారు. ఇందుకు గవర్నర్ సమ్మతించారు. చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో ప్రమాణస్వీకార కార్యక్రమం ఏర్పాటు చేశారు. విజయ్‌తో పాటు 9 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. తదుపరి మంత్రి వర్గ విస్తరణలో భాగస్వామ్య పార్టీలకు అవకాశం కల్పిస్తారని తెలుస్తోంది. ఈనెల 4న వెలువడిన ఫలితాల్లో విజయ్ టీవీకే 108 సీట్లతో ఏకైక పెద్దపార్టీగా నిలిచింది. అయితే ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన 118 మంది ఎమ్మెల్యేల సంఖ్యా బలం లేకపోవడంతో ప్రభుత్వం ఏర్పాటుకు సంబంధించిన గవర్నర్ మూడుసార్లు విజయ్‌కు అనుమతి నిరాకరించారు. ఈనెల 10వ తేదీతో గవర్నర్ ఇచ్చిన గడువు ముగియనుండటంతో ఉత్కంఠ కొనసాగుతూ వచ్చింది. రెండు చోట్ల నెగ్గిన విజయ్ ఒకచోట వదులుకోవాల్సి ఉండటంతో టీవీకే బలం 107కు చేరింది. కాంగ్రెస్ పార్టీ నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలు, వామపక్షాల నుంచి నలుగురు ఎమ్మెల్యేలు మద్దతు ఇవ్వడంతో అది 116కు చేరింది. అయితే మరో ఇద్దరు ఎమ్మెల్యేల మద్దతుపై సస్పెన్స్ కొనసాగుతూ వచ్చింది. ఎట్టకేలకు ఇద్దరు ఎమ్మెల్యేలున్న వీసీకే బేషరుతుగా టీవీకేకు మద్దతు తెలిపింది. దీంతో పూర్తి సంఖ్యాబలం చేకూరిన విజయ్ నాలుగోసారి గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరారు. అయితే అప్పుడు కూడా సస్పెన్స్ కొనసాగింది. కేరళ పర్యటన ఉండటంతో గవర్నర్ అందుబాటులో లేరని చెప్పిన లోక్‌భవనన్ వర్గాలు ఆ తర్వాత కొద్దిసేపటికే గవర్నర్ పర్యటన రద్దయిందంటూ ఆపాయింట్‌మెంట్ ఖరారు చేసింది. దీంతో నాలుగోసారి గవర్నర్‌ను కలిసిన విజయ్ పూర్తి సంఖ్యాబలాన్ని గవర్నర్ ముందుంచారు. దీంతో ప్రభుత్వం ఏర్పాటుకు లైన్ క్లియర్ అయింది. ప్రభుత్వ ఏర్పాటులో టీవీకేకు మద్దతు ఇస్తున్న వీసీకే.. క్యాబినెట్ బెర్తులు మాత్రం వద్దని చెప్పింది. 'మేం ప్రభుత్వంలో చేరబోం. వెలుపలి నుంచే మద్దతు ఇస్తాం. భవిష్యత్‌లో ప్రభుత్వంలో భాగం అవుతామా లేదా..? అన్నది చెప్పలేం. రాష్ట్రపతి పాలనను నివారించేందుకు, ప్రజల తీర్పును నెరవేరేలా చేసేందుకు ప్రభుత్వ ఏర్పాటులో భాగం అవుతున్నాం' అని వీసీకే చీఫ్ తిరుమావళవన్ మీడియాకు వెల్లడించారు. తాము ఇప్పటికీ డీఎంకే నేతృత్వంలోని కూటమిలోనే ఉన్నామని వీసీకే, ఐయూఎంఎల్ వెల్లడించడం గమనార్హం. ఇప్పటికే వామపక్షాలు కూడా క్యాబినెట్ పదవులు వద్దని చెప్పిన విషయం తెలిసిందే. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో చెన్నై సమీపంలో టీవీకే ఎమ్మెల్యేలు ఉంటున్న రిసార్ట్ బయట భద్రతను భారీగా పెంచారు. ప్రస్తుతం విజయ్‌కు మద్దతు ఇస్తున్న సభ్యుల సంఖ్య 120కి చేరింది. పార్టీల వారీగా సంఖ్యాబలం ఇలా ఉన్నాయి. టీవీకే : 107, కాంగ్రెస్ : 5, సీపీఐ : 2, సీపీఎం : 2, వీసీకే : 2, ఐయూఎంఎల్: 2 ఉన్నాయి.

## కేరళంపై కాంగ్రెస్ మల్లగుల్లాలు

మొదటి పేజీ తరువాయి

అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన సమావేశం జరిగినప్పటికీ.. సీఎం పేరును మాత్రం వెల్లడించలేదు. దీంతో ఆదివారం దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ విజయఢంకా మోగించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పర్యటించిన ఏఐసీసీ పరిశీలకులు ముకుల్ వాస్నిక్, అజయ్ మాకెన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు శుక్రవారం నివేదిక సమర్పించారు. ఈ క్రమంలోనే శనివారం సాయంత్రం 4 గంటలకు ఖర్గే నివాసంలో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి రాహుల్ గాంధీ, కేపీసీసీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్, సీఎం పదవి రేసులో ఉన్న వీడీ సతీషన్, కేసీ వేణుగోపాల్, రమేశ్ చెన్నితల హాజరయ్యారు. కీలక సమావేశం ముగిసిన అనంతరం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షీ మీడియాతో మాట్లాడారు. సీఎం అభ్యర్థి ఎవరనే దానిపై ఇంకా చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని, పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు సంయమనం పాటించాలని కోరారు. నాయకత్వ ఎంపికపై అధిష్ఠానం సమష్టిగా నిర్ణయం తీసుకుంటుందన్నారు. మరోవైపు సీఎం ఎవరనేది ప్రకటించే ముందు మరోసారి చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## బండి తనయుడు భగీరథ్‌పై ఫోక్సో కేసు

మొదటి పేజీ తరువాయి

ప్రయత్నించి నట్లు సమాచారం. చివరికి గత అర్ధరాత్రి ఆమె పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే, మొదట్లో బండి భగీరథ్‌పై కేసు నమోదు చేసేందుకు పోలీసులు వెనుకాడటంతో పోలీస్ స్టేషన్ వద్ద సుమారు ఆరు గంటల పాటు హైడ్రామా చోటుచేసుకుంది. ఆ తర్వాత బాధితురాలి నుంచి ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసు అనంతరం బండి సంజయ్ కొడుకు భగీరాథ్ మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాడు. ఇంతకుముందు కూడా కాలేజీలో ఒక విద్యార్థిపై దాడి చేసి భగీరథ్ వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. అయితే భగీరథ్‌పై పాత వివాదాల నేపథ్యంలో దర్శకుడు రామ్ గోపాల్ వర్మ గతంలో చేసిన ట్వీట్ ఇప్పుడు మళ్ళీ వైరల్‌గా మారింది. భగీరథ్‌ను ఇరాక్ మాజీ నియంత సద్దాం హుస్సేన్ కుమారుడు ఉదయ్ హుస్సేన్‌తో పోలుస్తూ ఆర్జీవీ అప్పట్లో చేసిన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా నిలిచింది.

# మనీలాండరింగ్ కేసులో ఇడి దూకుడు

### పంజాబ్ పరిశ్రమల శాఖ మంత్రి సంజీవ్ అరోరా అరెస్ట్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

చండీఘడ్, మే 9 :మనీ లాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న పంజాబ్ పరిశ్రమల శాఖా మంత్రి సంజీవ్ అరోరాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శనివారం అరెస్టు చేసింది. మోసపూరిత జీఎస్టీ లావాదేవీలతో రూ.100 కోట్ల నగదు అక్రమ రవాణా జరిగినట్టు ఆరోపణలు రావడంతో దర్యాప్తు ప్రారంభించిన ఈడీ తాజాగా మంత్రిని పీఎంఎల్ఏ చట్టం కింద అరెస్టు చేసింది. ఢిల్లీ, గురుగ్రామ్, చండీగఢ్‌లోని మంత్రి సంజీవ్ అధికారిక నివాసం సహా మొత్తం ఐదు చోట్ల ఈడీ అంతకుముందు సోదాలు నిర్వహించింది. మంత్రికి సంబంధించిన వ్యక్తులు, కంపెనీల భవనాల్లో కూడా రెయిడ్స్ నిర్వహించిన అనంతరం మంత్రి సంజీవ్‌ను ఈడీ అరెస్టు చేసింది. ఈడీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, మంత్రికి సంబంధించిన వారు ఫేక్ కంపెనీల సాయంతో మొబైల్ ఫోన్ కొనుగోళ్ల పేరిట నకిలీ బిల్లులను సృష్టించారు. ఈ బిల్లుల సాయంతో అక్రమంగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్, జీఎస్టీ రీఫండ్స్, ఇతర ఎగుమతి ఆధారిత ప్రయోజనాలను ÷–లకెయిమ్ చేసుకున్నారు. ఇలా అక్రమంగా వచ్చిన డబ్బును అక్రమంగా దుబాయ్‌కు పంపించి తిరిగి భారత్‌కు తీసుకొచ్చి మనీ లాండరింగ్‌కు పాల్పడినట్టు అధికారులు ఆరోపిస్తున్నారు. వచ్చే ఏడాదిలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మంత్రి అరెస్టు ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఆప్ నేతలు మాత్రం మంత్రి సంజీవ్ అరెస్టును ఖండిస్తున్నారు. బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థల సాయంతో రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని అన్నారు. ఈ ఈడీ రెయిడ్స్ ఉద్దేశం నల్ల ధనాన్ని వెలికి తీయడమో లేక ఇతర డాక్యుమెంట్స్‌ను వెలుగులోకి తేవడమో కాదు. బీజేపీలో చేరితే ఇవన్నీ పోతాయని రెయిడ్స్ ఎదుర్కొంటున్న వారికి ఒక సంకేతం పంపించడమే అసలు లక్ష్యం' అని పంజాబ్ ముఖ్యమంత్రి భగ్‌వంత్ మాన్ మీడియాతో అన్నారు.

## రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి

మొదటి పేజీ తరువాయి

స్థానంలో దక్షిణాది రాష్ట్రాల్లో కూడా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. అలాంటి పోలీసులు ఈ రోజు దేశంలోనే వెనకడుగు వేస్తున్న రాష్ట్రంలో తెలంగాన ఉందంటే బాధ అనిపిస్తుంది. ఆందోళన కూడా కనిపిస్తుంది.. ప్రభుత్వాలు మారుతుంటాయి. దాంతోపాటు ప్రాధాన్యాతలు కూడా మారుతాయి. కానీ ప్రాథమిక బాధ్యత అయిన శాంతిభద్రతలు విస్మరిస్తే రాష్ట్రమే అధోగతి పాలవుతుందని అనడానికి ఈ రెండున్నర సంవత్సరాలు ఉదాహరణన్నారు.. మన రాష్ట్రంలో శాంతి భద్రతలు అనగానే రాజకీయ వేధింపులు, ప్రతిపక్షంలో ఉన్నవారిని ట్రాప్ చేయడం తప్పితే ఏం జరగుతుంది రాష్ట్రంలో అనేదానిపై రివ్యూ చేసుకునే పరిస్థితిలో ఈ ప్రభుత్వం ఉంది. తెలంగాణ సాధించుకున్నమంటే ఏదో భౌగోళికంగా సాధించుకున్నది కాదు. ప్రశాంతమైన వాతావరణం ఉండాలి.. పెట్టుబడులు వెల్లువలా రావాలి. ఈ రాష్ట్రంలో ఉన్న యువత అందరికీ ఉపాధి దొరకాలినే ఆలోచనతో ఈ రాష్ట్రాన్ని సాధించుకున్నం అని అన్నారు. ఉాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడాల్సిన ప్రభుత్వానికి ఉందని విజ్ఞప్తి చేస్తున్నా. రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా హోంమంత్రి దగ్గరకు పరెగెత్తేవాళ్లు. రాష్ట్రంలో హోంమంత్రి లేరు. ఎందుకంటే ముఖ్యమంత్రే హోం మంత్రి. కానీ ఒక్కోసారి ఆ బాధ్యతను విస్మరించాలరేమో అనిపిస్తుంటుంది. ఎప్పుడు వెళ్లినా ముఖ్యమంత్రి కమాండ్ కంట్రోల్ సెంట్రల్‌లో సమీక్ష చేస్తున్నారని ఎప్పుడూ వింటుంటాం. ఏం సమీక్ష చేస్తున్నారని.. అనుకుంటే ఒక హోంశాఖ తప్ప మిగితా అన్ని సమీక్షలు జరుగుతంటాయి. కానీ కమాండ్ కంట్రోల్‌లో కూర్చొని హోంశాఖను సమీక్షించాలన్న ఆలోచన ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి లేదని చెప్పుకోవాల్సి రావడం బాధాకరమైన విషయమన్నారు. కేంద్రమంత్రి కొడుకా.. వేరే వ్యక్తి కొడుకా అని కాదు.. తప్పు చేసినప్పుడు సామాన్యుడికి ఏ చట్టం ఉంటుందో ఆయనకు కూడా అదేచట్టం ఉండాలే. ఎవరైతే కంప్లెయింట్ ఇచ్చారో దాన్ని రిసీవ్ చేసుకోవాలె. కచ్చితంగా పోక్సో కేసు పెట్టాల్సిందే. ఎందుకంటే రిపోర్ట్ తీసుకుంటే ఆ అమ్మాయి 17 ఏండ్లు అని విన్నా. కాబట్టి పెట్టాల్సిందే. కేసు రిజిస్టర్ చేయాల్సిందే. చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సిందని సబిత అన్నారు.

## కాళేశ్వరంను తక్కువ చేసే యత్నం

మొదటి పేజీ తరువాయి

అన్నారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ నీటి సౌలభ్యతను తక్కువ చేసి మాట్లాడకండి అని హితవు పలికారు. జలహారతి అంటూ డ్రామాలు తప్ప కాంగ్రెస్‌లో నిజాయితీ లేదని విమర్శించారు. ఆనాడు ఏడున్నరేళ్లు.. ఈనాడు రెండున్నరేళ్లు కాంగ్రెస్ డ్రామాలు చేసిందని మండిపడ్డారు. మేడిగడ్డ మరమ్మతు చేసి సాగు, తాగు నీళ్లు ఇచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. నాలుగేళ్లలో ప్రాణహితను పూర్తి చేస్తామని చెప్పి.. ఇప్పటివరకు తట్టెడు మట్టి తీయలేదని హరీశ్‌రావు మండిపడ్డారు. 2024–25 బ్జడెట్‌లో ప్రాణహితకు రూ.2కోట్లు కేటాయించారని హరీశ్‌రావు తెలిపారు. 2025–26 బడ్జెట్‌లో ప్రాణహితకు రూ.30కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రాణహిత చేవెళ్లకు పెట్టింది రూ.50కోట్లు అని అన్నారు. తిప్పి తిప్పి రూ.84 కోట్లే కేటాయించారని.. వీటితో ప్రాణహిత పూర్తవుతందా అని ప్రశ్నించారు. నిజంగానే కట్టే ఆలోచన ఉంటే బ్జడెట్‌లో నిధులు పెంచాలి కదా అని నిలదీశారు. ప్రాణహితకు సంబంధించి రూ.11వేల కోట్ల పనులు పూర్తయ్యాయని నిన్న రేవంత్ రెడ్డి అబద్దాలు చెప్పాడని మండిపడ్డారు. అసలు కాంగ్రెస్ హయాంలో భూసేకరణ, పనునలకు అయిన ఖర్చు రూ.3708 కోట్లు అని తెలిపారు. రేవంత్ రెడ్డి చెబుతున్న అబద్దాలకూ హద్దూ పద్దూ ఉండాలని అన్నారు. ఆనాడు జలయజ్ఞం కాదు.. ధన యజ్ఞం అన్న రేవంత్ ఇవాళ గొప్పలు మాట్లాడుతున్నాడని విమర్శించారు. ఊసరవెల్లిలా రేవంత్ రెడ్డి రంగులు మారుస్తున్నాడని మండిపడ్డారు. 30 నెలలుగా కుంగిన మేడిగడ్డ పిల్లర్లను మరమ్మతు చేయలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండుటెండల్లోనూ 6400 క్యూసెక్కుల నీరు పోతుందని అన్నారు. మేడిగడ్డ మరమ్మతు చేస్తే కేసీఆర్‌కు పేరొస్తదని తమ్మిడిహట్టి అంశం తీసుకొస్తున్నారని తెలిపారు. రాష్ట్రం గురించి రేవంత్ రెడ్డి ఏ మాత్రం ఆలోచించడం లేదని విమర్శించారు.

## బెంగాల్ సిఎంగా సువేందు అధికారి

మొదటి పేజీ తరువాయి

నబిన్ తదితరులు హాజరయ్యారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనం సృష్టించిన సంగతి తెలిసిందే. బీజేపీ 207 స్థానాల్లో ఘన విజయం సాధించింది. అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ 80 సీట్లకే పరిమితం అయింది. సువేందు అధికారి రెండు చోట్ల పోటీ చేశారు. నందిగ్రామ్, భవానీపూర్ నుంచి ఆయన బరిలో నిలిచారు. భవానీపూర్ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం కావటం విశేషం. సువేందు భవానీపూర్‌లో మమతాపై 15 వేల ఓట్ల మెజార్టీతో గెలుపు సాధించారు. అవివాహుతుడైన 55 ఏళ్ల సువేందు.. బెంగాల్ కు 9వ సీఎంగా ప్రమాణం చేశారు. ఈ పదవి చేపట్టిన తొలి భాజపా నేతగా అరుదైన చరిత్ర సృష్టించారు. 1970 డిసెంబరు 15న బెంగాల్ తూర్పు మేదినీపూర్ జిల్లాలో సువేందు జన్మించారు. 1998లో మమతా బెనర్జీ స్థాపించిన తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. అప్పటినుంచి దీదీకి నమ్మినబంటులా మారారు. 2004లో తమలుక్ నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 2006లో తొలిసారి కాంథీ దక్షిణ్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత రెండుసార్లు ఎంపీగా గెలిచి లోక్‌సభకు వెళ్లారు. గతంలో మమతా బెనర్జీ క్యాబినెట్‌లో మంత్రిగా పని చేశారు. మమత మేనల్లుడి కారణంగా ఆమెతో విభేదించి.. 2020లో టీఎంసీని వీడి కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. అప్పటినుంచి రాష్ట్రంలో భాజపాను ముందుండి నడిపించారు. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పార్టీ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్‌లో, తాజా ఎన్నికల్లో భవానీపూర్‌లో మమతా బెనర్జీని రెండుసార్లు ఓడించి సంచలనం సృష్టించారు.

## బెంగాల్ ప్రజలకు మోడీ సాష్టాంగ ప్రణామం

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు. భారీ సంఖ్యలో హాజరైన ప్రజలను చూసిన ప్రధాని మోదీ ముందుగా చేతులు ఊపుతూ అభివాదం చేశారు. అనంతరం మోకాళ్లపై కూర్చుని, చేతులు జోడించి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పశ్చిమ బెంగాల్ చరిత్రలో బీజేపీ తొలిసారిగా అధికారంలోకి వచ్చింది. తమకు మద్దతుగా నిలిచిన ఆ రాష్ట్ర ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ విధంగా తన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ అగ్రనేతలు హాజరయ్యారు. దాదాపు పదిహేనేళ్లు పశ్చిమ బెంగాల్‌ను పాలించిన మమతా బెనర్జీ తాజా ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. గతంలో తృణమూల్ కాంగ్రెస్‌లో ఉన్న సువేందు అధికారి, ఆ తర్వాత బీజేపీలో చేరి కీలక నేతగా ఎదిగారు. బెంగాల్‌లో బీజేపీ విజయంలో కీలక పాత్ర పోషించి ఏకంగా ముఖ్యమంత్రి అయిపోయారు.

## బిజెపి దాడికి నిరసనగా బంద్

మొదటి పేజీ తరువాయి

పాటించాయి. బంద్ నేపథ్యంలో రోడ్లపైకి వచ్చిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ఎక్కడికక్క అరెస్టు చేసి టీటీసీకి తరలించారు. శనివారం ఉదయం నుంచే గంగుల కమలాకర్ ఇంటి వద్ద మోహరించిన పోలీసులు ఆయన్ను అరెస్టు చేసి ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మాజీ మేయర్ రవీందర్ సింగ్, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తదితరులను అరెస్టు చేశారు. మరోవైపు కరీంనగర్‌లో నిర్వహిస్తున్న బంద్‌లో పాల్గొనేందుకు గంగాధర మండలం బూరుగుపల్లి నుంచి బయల్దేరిన చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను మార్గమధ్యలో పోలీసులు అడ్డుకున్నారు. ఆయన్ను అదుపులోకి తీసుకుని బూరుగుపల్లిలోని నివాసానికి తరలించి హౌస్ అరెస్ట చేశారు. ఇక కరీంనగర్‌లో బంద్ ప్రశాంతంగా కొనసాగుతోంది. నగరంలో వ్యాపార వాణిజ్య సంఘాలు సచ్చంధంగా గా బందును పాటిస్తున్నాయి నగరంలోని అనేక ప్రాంతాల్లో వ్యాపార వాణిజ్యాలని మూసి ఉన్నాయి మరోవైపు పోలీసులు రోడ్లపైకి వస్తున్న టిఆర్ఎస్ నాయకులను ఎక్కడికక్కడ అరెస్టులకు కొనసాగిస్తున్నారు.

## 11వ తేదీ నుండి విద్యా వారోత్సవాలు

మొదటి పేజీ తరువాయి

ఉన్నతాధికారులు వివరించారు. అంతకుముందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఫార్మర్ రిజిస్టీ కి సంబంధించిన పురోగతి, పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లు, జనాభా స్వీయ గణన కు సంబంధించిన అంశాలపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి సి ఎస్ జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రానా , కళాశాల విద్యా శాఖ కమిషనర్ దేవసేన, పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ , పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# సస్పెన్స్ థ్రిల్లర్ టు సక్సెస్ స్టోరీ : తమిళ పీఠంపై 'విజయ్' కేతనం!

## ఆదివారం 'తమిళ వెట్రి'కి అంకురార్పణ : ప్రజాస్వామ్య సౌధంలో ప్రజా తీర్పుకు గౌరవం

(రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్)

తమిళనాడు రాజకీయ చరిత్రలో 2026 అసెంబ్లీ ఎన్నికల పర్యవసానాలు ఒక అపూర్వమైన రాజ్యాంగ ఉత్కంఠకు తెరలేపాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల తీర్పును శిరోధార్యంగా భావించి పాలనా పగ్గాలు అప్పగించాల్సిన రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ, అనేక నాటకీయ పరిణామాల మధ్య ఒక సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాను తలపిస్తూ సాగడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రత్యేకించి తమిళ వెట్రి కళగం అధినేత విజయ్ చంద్రశేఖర్ ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన స్పష్టమైన మెజారిటీని కూడగట్టుకున్నప్పటికీ, రాజ్ భవన్ వ్యవహరించిన తీరు రాజ్యాంగ పరిమితులపై నిశిత విశ్లేషణకు దారితీసింది. అయితే, ఆఖరి నిమిషంలో గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ తన కేరళం పర్యటనను రద్దు చేసుకుని విజయ్‌కు భేటీ సమయం కేటాయించడం, ఆదివారం ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు వెలువడిన సంకేతాలు తమిళనాట ఒక రాజకీయ శకానికి నాంది పలికాయి.

234 స్థానాలు కలిగిన తమిళనాడు శాసనసభలో అధికారం దక్కించుకోవడానికి కావాల్సిన మ్యాజిక్ ఫిగర్ 118. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ఏ ఒక్క పార్టీకి సంపూర్ణ మెజారిటీ రాకపోవడంతో హంగ్ అసెంబ్లీ ఏర్పడింది. అయితే, ఈ ఎన్నికల్లో ఎవరూ ఊహించని విధంగా విజయ్ నేతృత్వంలోని టీవీకే 108 స్థానాలను కైవసం చేసుకుని అతిపెద్ద ఏకైక పార్టీగా అవతరించింది. దశాబ్దాలుగా రాష్ట్ర రాజకీయాలను శాసిస్తున్న ద్రవిడ దిగ్గజాలను కాదని ప్రజలు విజయ్‌కు పట్టం కట్టడం ఒక చారిత్రక పరిణామం. ఆయనకు మద్దతుగా కాంగ్రెస్ (5), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (2), విడుతలై చిరుతైగళ్ కచ్చి (2), మరియు వామపక్ష పార్టీలకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు కలిసి రావడంతో విజయ్ కూటమి బలం 120కి చేరింది. రాజ్యాంగబద్ధంగా సంఖ్యాబలం ఉన్న నాయకుడిని తక్షణమే ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించడం గవర్నర్ విధి. కానీ, మద్దతు పత్రాలతో వెళ్లిన విజయ్‌కు అపాయింట్‌మెంట్ నిరాకరించడం, గవర్నర్ అందుబాటులో లేరని చెప్పడం వంటివి ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలిగించేవిగా నిలిచాయి.

ముఖ్యంగా వామపక్ష ప్రతినిధులను లోక్ భవన్ ద్వారం వద్దే అడ్డుకోవడం, గవర్నర్ కేరళ పర్యటనకు సిద్ధమవడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. గతంలో దేశంలోని పలు రాష్ట్రాల్లో గవర్నర్ వ్యవస్థను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్న ఉదంతాలను ఈ సందర్భంగా విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. ఎస్.ఆర్. బొమ్మై కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రక తీర్పు ప్రకారం, మెజారిటీ నిరూపణ అనేది అసెంబ్లీ ఫ్లోర్ టెస్ట్ ద్వారానే తేలాలి తప్ప గవర్నర్ వ్యక్తిగత ఇష్టాయిష్టాలపై కాదు. ఈ నేపథ్యంలో, విజయ్ శిబిరం చట్టపరమైన పోరాటానికి, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధం కావడం రాష్ట్రంలో తీవ్ర ఉద్రిక్తతను సృష్టించింది. ఒకవైపు మద్దతు లేఖలు సిద్ధం చేసుకుని, మరోవైపు న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరుపుతూ విజయ్ ప్రదర్శించిన రాజకీయ పరిణతి ఆయనలోని నాయకత్వ పటిమను చాటిచెప్పింది.

రాష్ట్రంలో పెరుగుతున్న ఆగ్రహం, విపక్షాల ఐక్య గొంతుక, మరియు రాజ్యాంగ సంక్షోభం తలెత్తే ప్రమాదాన్ని గుర్తించిన గవర్నర్ కార్యాలయం చివరకు వెనక్కి తగ్గింది. తన విదేశీ లేదా ఇతర రాష్ట్ర పర్యటనల కంటే ప్రజాస్వామ్య ప్రక్రియే ముఖ్యమని భావించి, గవర్నర్ తన కేరళ పర్యటనను రద్దు చేసుకోవడం సానుకూల పరిణామం. సాయంత్రం 6:30 గంటలకు జరిగిన భేటీలో విజయ్ తనకున్న 120 మంది ఎమ్మెల్యేల మద్దతు పత్రాలను సమర్పించారు. ఈ భేటీ కేవలం ఒక అధికారిక కలయిక మాత్రమే కాదు, ఇది తమిళనాడు రాజకీయాల్లో ఒక కొత్త శక్తి ఉద్భవించిందని రాజ్యాంగబద్ధంగా గుర్తించడమే. డీఎంకే వంటి పార్టీలు సైతం ఈ విషయంలో గవర్నర్ తీరును తప్పుబట్టడం ద్వారా, సమాఖ్య స్ఫూర్తిని రక్షించడంలో రాజకీయాలకు అతీతంగా గళం విప్పాయి.

విజయ్ రాజకీయ ప్రస్థానాన్ని పరిశీలిస్తే, ఆయన సినీ గ్లామర్ నుండి ఒక బాధ్యతాయుతమైన పాలకుడిగా ఎదిగిన తీరు ఆశ్చర్యకరంగా ఉంది. అవినీతి వ్యతిరేకత, యువతకు ఉపాధి, ప్రాంతీయ అస్తిత్వం వంటి అంశాలను తన ఎన్నికల ఎజెండాగా మార్చుకుని, ప్రజల్లో విశ్వాసాన్ని నింపడంలో ఆయన విజయవంతమయ్యారు. సంప్రదాయ రాజకీయ శక్తుల మధ్యన ఒక స్వతంత్ర రాజకీయ అస్తిత్వంగా టీవీకే ఎదగడం, ఇతర లౌకిక మరియు ప్రాంతీయ పార్టీల మద్దతును పొందడం విజయ్ వ్యూహాత్మక విజయంగా చెప్పవచ్చు. ప్రభుత్వ ఏర్పాటులో ఎదురైన అడ్డంకులు ఆయన రాజకీయ ప్రయాణానికి ఒక అగ్నిపరీక్షగా నిలిచాయి. ఈ ప్రతిష్టంభనను ఎదుర్కోవడంలో ఆయన చూపిన సంయమనం భవిష్యత్ ముఖ్యమంత్రిగా ఆయనపై ప్రజల్లో మరింత నమ్మకాన్ని పెంచింది.

తమిళనాడులో నెలకొన్న ఈ పరిస్థితులు భారత రాజ్యాంగంలోని గవర్నర్ వ్యవస్థ పాత్రపై పునరాలోచన చేయాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా కాకుండా, రాజ్యాంగ రక్షకుడిగా గవర్నర్ వ్యవహరించాల్సిన బాధ్యతను ఈ ఘటన నొక్కి చెబుతోంది. హంగ్ అసెంబ్లీ ఏర్పడినప్పుడు అతిపెద్ద కూటమిని ఆహ్వానించడంలో జాప్యం చేయడం వల్ల రాజకీయ బేరసారాలకు అవకాశం ఇచ్చినట్లవుతుందనే ఆందోళనలు నిజం కాకుండా, గవర్నర్ సకాలంలో స్పందించడం ఆహ్వానించదగ్గ పరిణామం. 120 మంది సభ్యుల బలంతో విజయ్ ఆదివారం ప్రమాణ స్వీకారం చేయబోతుండటంతో తమిళనాడులో సుస్థిర ప్రభుత్వం



ఏర్పడబోతుందనే ఆశలు చిగురించాయి.

మొత్తానికి, తమిళనాడు రాజకీయాలు ఒక సంక్లిష్టమైన మలుపు నుంచి సాఫీగా సాగే మార్గంలోకి వచ్చాయి. సస్పెన్స్, ఉత్కంఠ, రాజ్యాంగ చర్చలు మరియు ప్రజాస్వామ్య పోరాటాల కలయికగా సాగిన ఈ ప్రక్రియ చివరకు ప్రజాభిప్రాయానికే పట్టం కట్టింది. 234 స్థానాల అసెంబ్లీలో మెజారిటీ నిరూపించుకోవడమే ఇక మిగిలి ఉన్న లాంఛనం. విజయ్ నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం తమిళనాడు ప్రజల ఆకాంక్షలను ఏ మేరకు నెరవేరుస్తుందో కాలమే నిర్ణయించాలి. కానీ, ఈ మొత్తం ఉదంతం భారత ప్రజాస్వామ్యంలో ప్రజల ఓటుకున్న శక్తిని, రాజ్యాంగ సంస్థల బాధ్యతను మరోసారి చాటిచెప్పింది. ఉద్రిక్తతలు సద్దుమణిగి, ఒక కొత్త నాయకత్వంలో తమిళనాడు అభివృద్ధి పథంలో పయనించాలని రాష్ట్ర ప్రజలు ఆశిస్తున్నారు. ఆదివారం జరగబోయే ప్రమాణ స్వీకారోత్సవం కేవలం ఒక వ్యక్తి ముఖ్యమంత్రి కావడం మాత్రమే కాదు, అది ఒక కొత్త రాజకీయ విప్లవానికి నాంది కానుంది.







# విద్యా వారోత్సవాలు విజయవంతం చేయాలి

### - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు - అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష
### - హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రజాలక్ష్యం (ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, మే 09 : ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక" లో భాగంగా ఈ నెల 11 వ తేదీ నుంచి 17 వ తేదీ వరకు విద్యాశాఖ వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. సీఎస్ రామకృష్ణారావు 99 రోజుల ప్రత్యేక ప్రణాళిక విద్యా వారోత్సవాలు, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, జనగణన సెల్ఫ్ ఎన్యుమరేషన్, ఫార్మర్ రిజిస్ట్రీ, తదితర అంశాలపై, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి, అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీ ఎస్ మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవాలు ఈ నెల 11 వ తేదీ నుంచి 17 వ తేదీ వరకు ఏడు రోజుల పాటు ప్రణాళికకు అనుగుణంగా నిర్వహించాలన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. జనగణన ప్రక్రియకు సంబంధించి, సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వేగం పెంచాలన్నారు. వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని వివరించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే తరలింపు చేపట్టాలని వివరించారు. తగినన్ని గన్ని సంచులు, లారీలు, తగినంతమంది హమాలీలను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, డీఐఈఓ శరత్, సీపీఓ శ్రీనివాస చారి, డీఏఓ అఫ్జల్ బేగం, డీటీఓ లక్ష్మణ్, డీసీఓ రామకృష్ణ, పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, సహాయ లేబర్ అధికారి నజీర్, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.







# సమగ్ర గణాంకాల రూపకల్పనలో జనగణన కీలకం

### - జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ అగ్రవాల్ - స్వీయ గణనకు ఆదివారం తుది గడువు
### - ఈ నెల 11 నుండి జూన్ 9 వరకు ఇండ్ల గణన - మొదటి దశ జనగణనపై జిల్లా కేంద్రంలో అవగాహన వాక్
### - జెండా ఊపి ప్రారంభించిన జిల్లా కలెక్టర్

ప్రజాలక్ష్యం (ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, మే 09 : సమగ్ర, ఖచ్చితమైన గణాంకాల రూపకల్పనలో జనగణన కీలకమని, దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జనగణన ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. శనివారం ఉదయం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద మొదటి దశ జనగణనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. జనగణనపై క్షేత్ర స్థాయి ప్రచారం, అవగాహన కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం అంబేద్కర్ కూడలి నుండి బతుకమ్మ ఘాట్ వరకు నిర్వహించిన 2కె వాక్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చాలా సంవత్సరాల తర్వాత భారతదేశంలో జనగణన చేయడం జరుగుతుందని, మన తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత ఇది మొదటి జనగణన అని, మొదటి సారి డిజిటల్ విధానంలో ఈ జనగణన నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. స్వీయగణన అనే విధానం తొలిసారి ప్రవేశపెట్టి జనగణన ప్రక్రియలో నూతన అధ్యాయానికి నాంది పలకడం జరిగిందని పేర్కొన్నారు. మీ కుటుంబ వివరాలను స్వయంగా మీరే నమోదు చేసుకునే చేసుకునే అవకాశం స్వీయ గణన ద్వారా కల్పించారని, ఇందులో 34 ప్రశ్నలు ఉన్నాయని, కేవలం ఐదు నిమిషాల్లో స్వీయ గణన ప్రక్రియను పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. స్వీయ గణన కోసం హ్ట్ట్ప్స్:// ఒవ.ఎవఅంబం.స్త్రశీజ.అఅ సైట్ లో మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయ్యి ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. స్వీయగణన చేయడానికి రేపే (ఆదివారం) తుది గడువు అని, స్వీయ గణనలో పాల్గొని వివరాలను స్వయంగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సోమవారం నుండి జనగణన ఎన్యూమరేటర్లు ఇంటింటికీ తిరిగి వివరాలను సేకరించడం జరుగుతుందని అన్నారు. అనుభవజ్ఞులైన సిబ్బందిని జనగణన సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లుగా నియమించి వారికి అవసరమైన శిక్షణ అందించడం జరిగిందని వెల్లడించారు. వారికి ప్రత్యేక ఐడీ కార్డులు కూడా జారీ చేశామని, ఇంటికి వచ్చినప్పుడు వారికి సహకరించాలని కోరారు. జనగణన పేరుతో ఎవరైనా అనుమానిత వ్యక్తులు మీ ఇంటికి వచ్చి వివరాలు అడిగే అవకాశం ఉంటుందని, అలాంటి వ్యక్తుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని అన్నారు. జనగణనలో పాల్గొనే సిబ్బందికి జారీ చేసిన గుర్తింపు కార్డుల మీద క్యూ ఆర్ కోడ్ ఉంటుందని, దానిని స్కాన్ చేస్తే అధికారిక వెబ్ సైట్ లో పొంది ఉంచిన వారి పూర్తి వివరాలు వస్తాయని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

### - ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియపై దృష్టి సారించాలి
### - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

ప్రజాలక్ష్యం (ప్రతినిధి)



ములుగు జిల్లా మే 9 : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. ధాన్యం కొనుగోలు, ఫార్మర్ రిజిస్ట్రీ, సెన్సస్, విద్యా వారోత్సవాలపై శనివారం హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ అన్ని జిల్లాలలో వంద శాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ కు ఒక్క రోజే మిగిలి ఉండడంతో ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో పది లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని, వీరంతా స్వీయ గణన చేసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 11వ తేదీ నుంచి నిర్వహించే విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా సిఎస్ సూచించారు. ములుగు జిల్లా వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు వీసీలో పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్యా వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సి పి ఓ ప్రకాష్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సయ్యద్ షా ఫైసల్ హుస్సైని, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల కార్పోరేషన్ ఎస్ కృష్ణవేణి, డి ఏ ఓ సురేష్ కుమార్, డి ఈ ఓ సిద్ధార్థ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం

### 108 చాలీసా పారాయణంలో హనుమాన్ మాల ధారణ స్వాములు



రామగుండం, మే 9 : రామగుండం పట్టణంలోని అత్యంత మహిమగల పురాతన భక్తాంజనేయ ఆలయంలో శనివారం రాత్రి హనుమాన్ మూలధారణ స్వాములు నామస్మరణతో మారు మోగించారు. ఈ నెల 12న కొండగట్టు ఆంజనేయస్వామి జయంతి ఉండగా రామగుండం పట్టణ భక్త ఆంజనేయ ఆలయంలో నిత్య అన్న ప్రసాద భిక్షతోపాటు హనుమాన్ చాలీసా పారాయణం ఆధ్యాత్మిక వాదానికి మరింత జనానికి స్ఫూర్తినిచ్చేలా ఉంది సందడిగా మారింది. ఆలయ పూజారి చందుస్వామి తీర్థ ప్రసాదాలను అందించారు. లోక కళ్యాణం కోసం రామగుండం పట్టణ ప్రజలు సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో విలసిల్లాలని నూతన పరిశ్రమలతో పూర్వ వైభవం రావాలని 108 హనుమాన్ చాలీసా పారాయణం చేయడం జరిగిందని స్వాములు పేర్కొన్నారు.

# అక్రమ కేసులు పెట్టినా ప్రశ్నిస్తూనే ఉంటా

### సంగారెడ్డి జైలునుంచి క్రిశాంక్ విడుదల

ప్రజాలక్ష్యం (ప్రతినిధి)



సంగారెడ్డి,మే9 :కాంగ్రెస్ పార్టీని ప్రశ్నిస్తున్నందుకే తనపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేస్తున్నారని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ వ్యాఖ్యానించారు. శనివారం ఉదయం సంగారెడ్డి సెంట్రల్ జైల్ నుంచి క్రిశాంక్ విడుదలయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్ని కేసులు పెట్టినా ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. గతంలో హైదరాబాద్ ఏటీఎం కాద్ద కాల్పులు జరిపి దొంగలు పారిపోయారని, కరీంనగర్ జ్యూవెలరీ షాపులో దొంగలు కాల్పులు జరిపి నగలు ఎత్తుకెళ్లారని అన్నారు. సీపీ సుమతికి అర్ధరాత్రి రక్షణ లేకుండా పోయిందని క్రిశాంక్ అన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ క్వార్టర్స్‌లోనే రక్షణ లేదని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలపై కాకుండా శాంతి భద్రతలపై దృష్టి సారించాలని హితవుపలికారు. మీడియా వాళ్లతో కూడా మాట్లాడితే ఎందుకు మాట్లాడావని అడుగుతున్నారన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తమ ఫోన్లు ట్యాపింగ్,హ్యాకింగ్ చేస్తుందన్న అనుమానం కలుగుతోందని క్రిశాంక్ పేర్కొన్నారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com